గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# ఆగస్ట్ 2016
# కథలు




"అయ్య గారండీ...అయ్య గారండీ" అని ఇంటి బయట నుండి కేకలు వినబడటంతో, చదువుతున్న పేపర్ను పక్కన పడేసి కూర్చున్న ఈజీ చైర్ లో నుండి లేచి గుమ్మం దగ్గరకు వచ్చేడు కేశవ రావ్.

వాకిట్లో నడుం చుట్టూ తుండు కట్టుకుని నిలబడున్న పనివాడు కనిపించేడు.

"ఏవిట్రా ఆ అరుపులు...ఏదో కొంపలు మునిగి పోయినట్లు"

"అవునండయ్యా...నిజంగానే మన కొంప మునిగిందయ్యా. మన చిన్నయ్య గారు ఆ నూకాలమ్మ కూతురితో రైలు స్టేషన్లో కనిపించేరండి"

"ఏవిట్రా వాగుతున్నావ్" కళ్ళు పెద్దవి చేసేడు కేశవరావ్.

“నే సెప్పేది నిజమేనండయ్యా…నా కళ్ళారా చూసేనయ్యా. ఇద్దరి సేతుల్లోనూ సూటు కేసులున్నాయండయ్యా…ఈ ఇషయాన్ని మీ కాడ సెప్పాలని ఎంటనే లగెత్తుకుని ఈడకొచ్చేనయ్యా"

"సావిత్రీ" అంటూ పెద్దగా అరిచేడు కేశవరావ్.

"ఏమిటండీ అలా అరిచేరు!" వంట గదిలోనుండి పరిగెత్తుకొచ్చిన కేశవరావ్ భార్య సావిత్రి భర్తను చూస్తూ ఆశ్చర్యంగా అడిగింది.

"కిష్టుడు గదిలో ఉన్నాడో లేడో చూడు" భార్యను ఆదేశించేడు కేశవ రావ్.

"గది లోనే ఉంటాడు…నిద్రలో నుండి ఇంకా లేచుండడు" చెప్పింది సావిత్రి.

"చెప్పింది చెయ్యి" భార్యను గదమాయించేడు కేశవ రావ్. వెంటనే పరుగు లాంటి నడకతో మేడ పైకి వెళ్ళింది సావిత్రి. కొడుకు క్రిష్ణా రావ్ గది తలుపును రెండు సార్లు తట్టింది. మూడో సారి గది తలుపు మీద తట్టినప్పుడు తలుపులు కొంచంగా తెరుచుకున్నాయి. దాంతో సావిత్రిలో భయం పుట్టుకొచ్చింది. ధైర్యం తెచ్చుకుని లోపలికి వెళ్ళి చూసింది. కొడుకు మంచం మీద లేడు. బాత్ రూం లో ఉన్నాడేమోనన్న అనుమానంతో అటు తిరిగింది. బాత్ రూం తలుపు తెరిచే ఉంది. బాత్ రూములో కూడా కొడుకు కనిపించక పోయే సరికి సావిత్రి గుండె గుభేలు మంది.

కొడుకు గదిలో నుండి పరుగు లాంటి నడకతో బయటకు వచ్చి "కిష్టుడు రూములో లేడండి" మేడపై నుండే భర్తకు విన బడేలా చెప్పింది సావిత్రి. ఆమె గొంతులో వొణుకు చోటు చేసుకోవటం ఎవరికైనా అర్ధమై పోతుంది.

భార్య మాట వినగానే నెత్తి మీద బరువు పడినట్లు పక్కకు ఒరిగిన కేశవరావ్ పడి పోకుండా ఉండటానికి దగ్గరున్న గుమ్మాన్ని పట్టుకున్నాడు. "ఎంత పని చేసేడు!…కుటుంబ గౌరవానికి తల వొంపులు తీసుకు వచ్చేడే…గౌరవంగా బ్రతుకుతున్న నన్ను తల వంచుకునేలా చేసేడే" అనుకుంటూ కుంగి పోతూ పక్కనున్న గుమ్మం మీద కూర్చుండి పోయేడు.

"ఏమైందండీ… " భర్త దగ్గరకు వచ్చిన సావిత్రి కేశవ రావ్ ను చూసి అడిగింది.

"నీ కొడుకు చేసిన ఘన కార్యమే"

"ఏం చేసేడండి"

"ఏం చేసేడని నిదానంగా అడుగుతావేం...మన కుటుంబ గౌరవానికి తల వొంపులు తీసుకొచ్చే నీచమైన పని చేసేడే నీ కొడుకు...ఈ ఊళ్ళో నన్ను తల దించుకునేలా చేసేడే"

"అదే ఏం చేసేడని అడుగుతున్నా"

"ఆ నూకాలమ్మ కూతురితో ఊరు వదిలి వెళ్ళి పోయేడు...రైల్వే స్టేషన్లో వాలిద్దరిని సూట్ కేసులతో చూసేడట మన ఏకాంబరం" అంటూ లేచి నిలబడి మీసాలు మెలేస్తూ "వదలను...కుటుంబ గౌరవానికి కళంకం తీసుకు వచ్చిన వాడిని వదలను. కులం తక్కువ దానితో కులకటానికి ఇన్నేళ్ళు పెంచి పోషించిన తల్లి తండ్రులనే వదులుకుంటాడా?...కుల గౌరవాన్ని, పెద్ద వాళ్ళని తల వొంచుకునేలా చేయడానికా వాడు చదువుకుంది.? వదలను...వదలను...మనకూ, మన కుటుంబ గౌరవానికీ తల వొంపులు తీసుకు వచ్చిన వాడ్ని వదలను" ఎర్ర బడ్డ కళ్ళతో అటూ ఇటూ తిరుగుతూ పూనకం వచ్చిన వాడిలా చిందులు వేసేడు కేశవ రావ్.

పని వాళ్ళు, విషయం తెలుసుకున్న ఊరి పెద్దలు అప్పుడే కేశవరావ్ ఇంటి ముందు గుమికూడేరు.

"ఏవండీ...మీరు ఆవేశ పడకండి...మీ ఆరోగ్యం దెబ్బ తింటుంది" భయ పడుతూ చెప్పింది భార్య సావిత్రి.

"ఆవేశ పడకుండా ఎలా ఉండనే...నీ కొడుకు చేసిన పనిని సమర్ధించ మంటావా? లేక ఇంట్లో నుండి కులం తక్కువ దానితో ఊరు వదిలి పారిపోయి మన కుటుంబ గౌరవానికి తల వంపులు తీసుకు వచ్చిన ఆ పిరికి వాడిని మన్నించ మంటావా?...వదలనే...వాడిని, దానిని ఇద్దరినీ వదలను..." పూనకం వచ్చిన వాడిలా ఊగి పోయేడు కేశవ రావ్.

"వదలద్దండి...వాడిని వదిలేయమని నేనటం లేదు. మీరు ఆవేశం తగ్గించుకుని...ఏం చేయాలో నిదానంగా ఆలోచించమని చెబుతున్నాను" అన్నది సావిత్రి.

ఆ మాటకు కొంచం శాంతించిన కేశవ రావ్ ఇంట్లోకి వెళ్ళి పోయేడు.

అక్కడ గుమి కూడిన వారందరూ తమ తమ పనులకు వెళ్ళి పోయేరు.

****************************

రైలులో వస్తున్న వాళ్ళని తీసుకు వెళ్ళడానికి కేశవ రావ్ మరియూ అతని నమ్మిన బంటు చెంచలయ్య రైల్వే ప్లాట్ ఫారం మీద నిలబడున్నారు.

గౌతమీ ఎక్స్ ప్రెస్ ఒకటో నెంబర్ ప్లాట్ ఫారం లోకి వచ్చి ఆగింది.

అందులో నుండి క్రిష్ణా రావ్, అతనితో పాటు హేమ దిగేరు. దిగిన వెంటనే వారిద్దరికీ కేశవ రావ్, చెంచలయ్య కనిపించేరు. వారిద్దరినీ చూసి ఆశ్చర్యపోయిన క్రిష్ణా రావ్, హేమలకు చెమటలతో పాటు గుండె ధడ ఒక్క సారిగా పట్టుకున్నాయి.

"రా క్రిష్ణా...ఎలా ఉన్నావు. ఆరు నెలలో ఇంత చిక్కి పోయేవేం.....సరే రా...ఇంటికి వెడదాం. మీ ఇద్దరినీ ఈ ఊరికి రప్పించటానికే నూకాలమ్మకు యాక్సిడెంట్ అని అబద్దం చెప్పేను. మీరూ వచ్చేసేరు. బయట కారు నిలబడుంది...వచ్చి ఎక్కు" కొడుకు క్రిష్ణా రావును చూస్తూ, మీసాలు తిప్పుకుంటూ, చిరు మందహాసంతో అతని ఎదురుగా వెళ్ళేడు కేశవరావ్.

"నాన్నా...హేమ..." అని చెప్పి ముగించేలోపు క్రిష్ణా రావ్ చెంప చెల్లు మనేలా గట్టి దెబ్బ వేసేడు తండ్రి కేశవ రావ్. కొడుకు గొంతు వెనుక తన బలమైన చేతులు వేసి అతన్ని తోసుకుంటూ రైలు స్టేషన్ బయటకు వచ్చేడు. అక్కడ నిలబడున్న కారు తలుపులు తెరుచుకున్నాయి. క్రిష్ణా రావును అందు లోకి తోసి బంధించేడు కేశవ రావ్.

కారు తమ ఊరి వైపు వెళ్ళే రోడ్డు ఎక్కింది.

*********************************

రైల్వే స్టేషన్లో తన కళ్లెదుట జరింగింది చూసి పిచ్చెక్కిన మనిషిలా నిల బడి పోయింది హేమ. తన కళ్ళెదుటే తన భర్త క్రిష్ణా రావును అతని తండ్రి కొట్టి లాక్కు పోవడం ఆమె మనసును కలవర పెట్టింది. "ఏం చెయ్యాలి...ఇప్పుడేం చేయాలి" అనుకుంటున్న హేమకు తాను ఏమీ చేయ లేనని అర్ధమవడానికి పది నిమిషాలు పట్టింది. మనుష్యులే లేని చిట్టడవిలో వదిలి పెట్ట బడ్డ అనాధ లాగా ప్లాట్ ఫారంపై నిలబడింది.

తల్లికి ఏమీ అవ లేదనే తృప్తి ఆమె మనసును శాంత పరుస్తున్నా...కడుపులో శిశువుతో ఇంటికి వెడితే తల్లి ఒప్పుకుంటుందా? ఆరు నెలల క్రింద తల్లికి చెప్పకుండా క్రిష్ణా రావుతో ఈ ఊరు వదిలి వెళ్ళి పోవటం, తల్లికి యాక్సిడెంట్ అని తెలిసిన వెంటనే తిరిగి ఊరికి వచ్చిన తనకు రైల్వే స్టేషన్లో జరిగిన అవమానం ఆమె కళ్లెదుట మారి మారి వస్తుంటే హేమకు ఏడుపు ఆగ లేదు. తన భవిష్యత్తు, తన బిడ్డ భవిష్యత్తు గురించిన ఆలొచన రాగానే కళ్ళు తుడుచుకుని బస్ స్టేషన్ కు వెళ్ళింది. బస్సులో ఎక్కి కూర్చుంది. బస్సు బయలు దేరింది.

భర్త క్రిష్ణారావ్ ఎలకల బోనులో చిక్కుకున్నట్లు అతని తండ్రి దగ్గర దొరికి పోయిన సంఘటన ఆమె మనసు నుండి దూరమవడానికి నిరాకరించింది. క్రిష్ణా రావ్ చెంప మీద చెల్లు మని పడిన దెబ్బ, తన చెంప మీద పడినట్టు చెంపంతా నొప్పి పుట్టింది.

బస్సు దిగేటప్పటికి చీకటి పడింది. ధైర్యం తెచ్చుకుంటూ తన గుడిసె వైపుకు వెళ్ళింది. గుడిస ముందు నిలబడి "అమ్మా" అని పిలిచింది.

ఎవరై ఉంటారనుకుంటూ ఇంటి బయటకు వచ్చిన నూకాలమ్మకు కూతురు హేమ కనబడటంతో కొయ్య బారి నిలబడి పోయింది. ఆరు నెలల కిందట తనతో చెప్పకుండా, క్రిష్ణారావ్ తో ఊరు వదిలి పారి పోయిన కూతురు ఇప్పుడు కడుపులో బిడ్డతో తిరిగి రావటం...నూకాలమ్మ జీర్ణించుకో లేక పోయింది. ఇంట్లోకి రమ్మనాలా...లేక తిరిగి వెళ్ళి పొమ్మనాలా? కన్న ప్రేమ కూతుర్ని తిరిగి వెళ్ళమని చెప్ప గలదా?...హేమ చేతులు పుచ్చుకుని ఇంట్లోకి తీసుకు వెళ్ళింది. నులక మంచం మీద కూర్చున్న హేమకు మంచి నీళ్ళు ఇచ్చి, ఆమె దగ్గరగా నేలపై కూర్చుంది నూకాలమ్మ.

"నువ్వు ఇంట్లో నుంచి వెళ్ళి పోయిన      రోజు, నువ్వెక్కడికి వెళ్ళేవో, ఎందుకు వెళ్ళి పోయేవో తెలియక నా మనసు ఎంత గిల గిలా కొట్టుకుందో తెలుసా. ఏం చేయాలో తెలియక, ఎవరికి చెప్పాలో తెలియక సతమతమవుతున్న నాకు ఏడు కొండలు వచ్చి జరిగిన విషయం చెప్పటంతో నా గుండె జారి పోయింది. ఏ నిమిషంలో ఏం కబురొస్తుందో, లేక కేశవ రావ్ మనుష్యులు వచ్చి నన్నేం చేస్తారో నన్న భయం నాలో జ్వరం తీసుకు వచ్చింది. ఇంట్లో నుండి బయటకు వెళ్ళ లేదు. రెండు రోజులైనా ఎవరూ రాక పోయే సరికి మనసు కొంచం కుదట పడింది. కానీ భయం పోలేదు...కేశవ రావ్ ఎందుకు వూరికే ఉన్నాడు?...లేదు...ఏదో ప్లానులొ ఉండే ఉంటాడని అనిపించింది...మీరెక్కడున్నా వెతికి పట్టుకుని చంపేస్తాడని మాత్రం అర్ధమయ్యింది. ఇన్నిరోజులూ ఏం కబురు వస్తుందో ననే భయం తోనే గడిపేను. కానీ నువ్విలా ప్రాణాలతో తిరిగొస్తావని నేను కలలో కూడా అనుకో లేదు...అసలేం జరిగింది చెప్పు" తల వంచుకుని ఏడుస్తునే ఉన్న కూతురు హేమను అడిగింది.

కళ్ళు తుడుచుకుంటూ జరిగిందంతా తల్లితో చెప్పింది హేమ.

"సరే...జరిగిందేదో జరిగిపోయింది. నీ తల రాత ఎలా రాసుందో అలాగే జరుగుతుంది...దాన్నెవరూ మార్చ లేరు. కానీ ఇంకేదో చేసేద్దామని మాత్రం మరో కొత్త ఆలొచన పెట్టుకోకు. మన మేమిటో, మన కులమేమిటో, సంఘంలో మన స్థానమేమిటో అర్ధం చేసుకుని ఈసారన్నా తెలివిగా ప్రవర్తించు...నేను బ్రతికున్నంతవరకూ నిన్ను కడుపులో పెట్టుకుని కాపాడుతాను...ఆలేస్యమైంది...భోజనం చేసి పడుకో" అన్నది నూకాలమ్మ.

తల్లి ప్రేమను అర్ధం చేసుకున్న హేమ "అమ్మా...నన్ను క్షమించు" అంటూ తల్లి కాళ్ళ మీద పడ్డది. కూతుర్ని లేపి అభయంగా తన హృదయానికి హత్తుకుంది నూకాలమ్మ.

ఆ రాత్రంతా ఏడుపులో గడిపింది హేమ.

****************************************

మరుసటి రోజు ప్రొద్దున పెరట్లో పాత్రలు కడుగుతోంది నూకాలమ్మ.

"నూకాలమ్మా...నూకాలమ్మా..."........ఎవరో తనని పిలుస్తున్నారని, కడుగుతున్న పాత్రను పక్కన పడేసి, చేతులు కడుక్కుని ఇంటి బయటకు వచ్చింది నూకాలమ్మ.

"అయ్య గారు నిన్ను పిలుచుకు రమ్మాన్నారు" చెప్పేడు ఏకాంబరం.

నూకాలమ్మ వొళ్ళు జలదరించింది. చీర కొంగుతో మొహం మీద పట్టిన చెమటను తుడుచుకుంటూ "వస్తున్నా...నువ్వు ముందు పద" అన్నది.

"లేదు...దగ్గరుండి తీసుకు రమ్మన్నారు" చెప్పేడు ఏకాంబరం.

"సరే ఉండు...ఒక్క నిమిషంలో వస్తాను" అని చెప్పి ఇంట్లోకి వెళ్ళి, దేవుడి ఫోటోకు దణ్ణం పెట్టుకుని ఇంటి బయటకు వస్తుంటే "నేనూ రానా" కూతురు హేమ అడిగింది.

"వద్దు...నిన్ను రమ్మని చెప్ప లేదు. నే వెళ్ళొస్తా...నువ్వు జాగ్రత్త" కూతురు జవాబుకు ఎదురు చూడకుండా బయటకు వచ్చి, ఏకాంబరాన్ని చూసి "పద" అంటూ బయటకు నడిచింది.

కేశవ రావ్ ఇంటి దగ్గరకు వెడుతుంటే నూకాలమ్మ కాళ్ళలో వొణుకు మొదలయ్యింది.నెమ్మదిగా నడుచు కుంటూ కేశవ రావ్ ఇంటి గేటు దాటి కాంపౌండ్ లోపలికి వెళ్ళింది. అక్కడ కేశవ రావ్ తో పాటు చెంచలయ్య, మరో ఇద్దరు ఊరి పెద్దలు కుర్చీలేసుకుని కూర్చొనున్నారు. చుట్టూ జనం ఉన్నారు. నూకాలమ్మను చూసిన వెంటనే గుమి కూడిన జనం పక్కకు తప్పుకుని ఆమెకు దోవ వదిలేరు. నేరారోపణ మోప బడిన ఒక ఖైదీ లాగా, వాళ్ళ ముందుకు వెళ్ళి, నేరస్తులు బోనులో నిలబడే విధంగా తల దించుకు నిలబడింది నూకాలమ్మ.

"నూకాలమ్మా...జరిగిందేదో జరిగి పోయింది. నా కొడుకు నీ కూతుర్ని లేపుకు పోయేడని నేను చెప్పను...నీ కూతురే నా కొడుకును లేపుకు పోయింది. ఏది ఏమైనా నీ కూతురి కడుపులో పెరుగుతున్న బిడ్డకు నా కొడుకు కారణం అయ్యేడు...కానీ, నా కొడుకు నీ కూతురి మెడలో తాలి కట్ట లేదు...రిజిస్టర్ మ్యారేజీ చేసుకో లేదు. అందు వలన విడాకులకు అవసరం లేదు. అయినా సరే నేను యాభై వేల రూపాయలు డబ్బిస్తాను. తీసుకు వెళ్ళు...నీ కూతురు నా కొడుకును మర్చి పోవాలి" చెప్పేడు కేశవ రావ్.తలెత్తి కేశవ రావును చూసే ధైర్యం లేక, తల దించుకునే కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ మౌనంగా నిల బడింది నూకాలమ్మ.

"ఏం...సమాధానమే లేదు" కఠినంగా అడిగేడు కేశవ రావ్. "మీరు చెబితే సరే నండి" అన్న నూకాలమ్మ చేతుల్లో యాభై వెల రూపాయలను ఉంచేడు కేశవ రావ్ గుమాస్తా.....అంతే. కేశవ రావ్ లేచి ఇంట్లోకి వెళ్ళి పోయేడు...ఆ తరువాత మిగిలిన వారందరూ అక్కడి నుండి కదిలి వెళ్ళి పోయేరు.

తన కూతురు కడుపులో పెరుగుతున్న బిడ్డకు ఖరీదు కట్టి కేశవ రావ్ తన చేతిలో పెట్టిన డబ్బును చూసుకుంటూ ఏడుస్తూ బయటకు వచ్చిన నూకాలమ్మను ఏకాంబరం ఆపేడు..."చూడు నూకాలమ్మా... కేశవ రావ్ ఎందుకనో నీ మీద కరుణ చూపించేడు. అసలు నిన్నూ, నీ కూతుర్నీ చంపేస్తాడేమో అనుకున్నాం...ఇలా నీ చేతిలో డబ్బు పెట్టి, మిమ్మల్నీ క్షమిస్తాడని నేను కలలో కూడా అనుకో లేదు. ఈ భూమ్మీద మీకింకా నూకలుండబట్టే వదిలేసేడేమో ననిపిస్తోంది" అన్నాడు.

“నిజమే నూకాలమ్మా...ఈ మధ్య కుల గౌరవం, కుటుంబ గౌరవం, తమ వ్యక్తిగత గౌరవం మంట గలిపేరని ఎంతో మంది, తప్పు చేసింది తమ పిల్లలేనని కూడా చూడకుండా వారిని చంపేస్తున్నారు...పైగా ఆ నేరానికి "పరువు హత్య" అని గౌరవమైన నామ కరణం చేసేరు. నీ కూతురి విషయంలో అలా జరగలేదని సంతోష పడు...ఈ విషయాన్ని ఇంతటితో వదిలేయమని నీ కూతురితో చెప్పు" ఇంకొకరు చెప్పేరు.

పిచ్చి పట్టిన దానికి మళ్ళే నూకాలమ్మ కాళ్ళీడ్చుకుంటూ ఇంటి వైపు నడిచింది.

************************************

అమ్మ రాక కోసం పూరి గుడిసెలో ఎదురు చూస్తున్న హేమ అప్పుడే ఇంట్లోకి అడుగు పెడుతున్న తల్లిని చూసి "ఎందుకు రమ్మనారు?...ఏం చెప్పేరు?" అని అడిగింది.

కూతురు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా కేశవ రావ్ ఇచ్చిన డబ్బును హేమ ముందు ఉంచి "ఈ డబ్బు తీసుకుని...క్రిష్ణా రావ్ ని నువ్వు మర్చి పోవాలట" అన్నది నూకాలమ్మ.

క్రిష్ణా రావ్ బిడ్డను తన కడుపులో మోస్తున్నందుకు కూలీగా ఈ డబ్బును ఇచ్చేరని అనుకున్నప్పుడు హేమకి ఈ సముదాయం

మీద, ఈ సంఘం మీద విరక్తి ఏర్పడింది. ఇక మీదట క్రిష్ణారావ్ తన వాడు కాదు అన్న భావన కలిగినప్పుడు ఆమె కళ్ళల్లో నీళ్ళు జల పాతంగా ఉప్పొంగినై. అతనితో గడిపిన రోజులు, అతను తనకిచ్చిన మరో ప్రాణాన్ని మోస్తున్న అనుభూతులు...అన్నిటినీ మర్చి పోవాలా?...తన మీద, తన తల రాత మీద హేమ కు కోపం వచ్చింది. తమాయించుకుని, నిలకడ తెచ్చుకుని "ఆ డబ్బును బ్యాంకులో డిపాజిట్ చేయమ్మా" అని తల్లితో చెప్పింది.

కూతురి నోట ఆ మాట విన్నప్పుడు నూకాలమ్మ మొహం చిగురించింది...మనసు ఆనంద పడింది...డబ్బు డిపాజిట్ చేయమన్నందుకు కాదు...కూతురు ఇక మీదట క్రిష్ణా రావ్ మాట ఎత్తదని గ్రహించినందుకు.

*************************************

రోజులు గడిచినై.

హేమకు ఆడ పిల్ల పుట్టింది. పుట్టిన బిడ్డతో హేమను హాస్పిటల్ నుండి ఇంటికి తీసుకు వచ్చిన నూకాలమ్మకు ఇంటి గుమ్మం దగ్గర చిందర వందర జుట్టుతో, పిచ్చి వాడిలో నిలబడున్న క్రిష్ణా రావ్ కనబడ్డాడు.

ఏం జరుగుతుందో నన్న భయం పట్టుకుంది నూకాలమ్మకు.

ఆటోలో నుండి దిగిన హేమ క్రిష్ణా రావ్ ను చూసి కూడా చూడనట్లు అతన్ని దాటుతుంటే "హేమా...నాతో మాట్లాడవా?...నా బిడ్డను నాకు చూపించవా?" అడిగేడు క్రిష్ణా రావ్.

హేమ క్రిష్ణా రావ్ కి సమాధానం చెప్పకుండా "అమ్మా...తాళం తీయ్" అన్నది.

కూతురి మాటలకు ధైర్యం తెచ్చుకున్న నూకాలమ్మ "చూడు బాబూ...అనవసరంగా గొడవ చేయకు. నీకు, నా కూతురికి ఎటు వంటి సంబంధం లేదు. డబ్బులిచ్చి సరి చేసేరు...మళ్ళీ హేమతో మాటలెందుకు" అన్నది.

ఆమె మాటలు విన్న క్రిష్ణారావ్ ఒక్కసారి హేమ వైపు చూసేడు. హేమ తన ముఖాన్ని పక్కకు తిప్పుకుంది...అంతే క్రిష్ణా రావ్ ఇంకేమీ మాట్లాడకుండా అక్కడ నుండి బయలు దేరేడు. తిన్నగా సారా కొట్టు వైపుకు వెళ్ళేడు.

హేమ బిడ్డతో ఇంట్లోకి వెళ్ళింది.

**************************************

హేమకు డబ్బులిచ్చి కొడుకుతో ఆమె భంధుత్వాన్ని తెంపేసిన కేశవ రావ్ కొడుకు క్రిష్ణా రావ్ కి తమ కులానికి చెందిన వేరే అమ్మాయితో పెళ్ళి సంబంధం కుదిర్చేడు. పెళ్ళి సంబంధం కుదుర్చుకున్న మూడు రోజుల తరువాత పెళ్ళి కూతురు తరఫు నుండి పెళ్ళి క్యాన్సెల్ చేసుకున్నామని కబురు వచ్చింది.

క్రిష్ణా రావ్, హేమతో కలిసి ఊరు వదిలి పారి పోయి ఆరు నెలలు గడిపేడని తెలియటంతో క్రిష్ణా రావ్ కి పెళ్ళి కుదర లేదు. బయట ఊర్ల నుండి సంబంధాలు వెతుకున్నా అవి కూడా తప్పి పోవటంతో కేశవ రావ్ కి దిగులు పట్టుకుంది...క్రిష్ణా రావ్ తాగుడుకు అలవాటు పడి దానికి బానిసై పోయేడు. విపరీతంగా తాగటంతో మనిషి చిక్కి సల్యమై పోయేడు.

కొడుకును చూసి తల్లి సావిత్రి ఏడవని రోజు లేదు. కాని భర్తతో మాట్లాడటానికి భయ పడింది. కాని ఈ రోజు భర్త దిగులుతో ఉన్నాడని తెలుసుకున్న ఆమె ఈజీ చైర్లో కూర్చున్న భర్త దగ్గరకు వెళ్ళి కూర్చుంది.

"ఏమండీ...ఆ రోజు మన కొడుకును, హేమ దగ్గర నుండి విడ దీయమని, అది గనుక జరగక పోతే హేమను చంపైనా కొడుకును తీసుకొచ్చి మన కుల గౌరవాన్ని కాపాడమని మిమ్మల్ని ఉసిగొల్పిన మన కులం వాళ్ళే ఈ రోజు మన కిష్టుడికి పిల్లనివ్వడానికి కాదుతున్నారు...వీళ్ళా కుల గౌరవాన్ని కాపాడే పెద్దలు. వీరి మాటలు వినా మనం వాలిద్దరినీ విడదీసింది...ఇంకా నయం కుల గౌరవం పేరిట వాళ్ళను హతమార్చలేదు. అలా చేసుంటే మీరు జైలుకు వెళ్ళేవారు...నేను ఒంటరి దాన్ని అయ్యే దాన్ని. కులం, కులం అంటూ అవతలి వారిని ఉసి గొల్పటమే తప్ప వారి వరకు వస్తే ఎలా తప్పుకుంటున్నారో చూసేరా. వీళ్ళ కోసం మన బిడ్డను మనం శిక్సించి, మనం పెద్ద తప్పు చేసేమండి...వాడేమై పోతాడో నన్న భయం నన్ను వేదిస్తోంది" అంటూ కొంగులో కళ్ళు తుడుచుకుంది.

"నిజమేనే...నేను చాలా పెద్ద తప్పు చేసేను...నా తప్పును నేనే సరి దిద్దుతాను...కిష్టుడుని కాపాడతాను" భార్యకు కేశవ రావ్

అభయమిచ్చేడు.

************************************

ఆ రోజు సాయంత్రం కేశవ రావ్ హేమ గుడిసెకు వచ్చేడు. నూకాలమ్మ ఇంట్లో ఉన్న పాత     కుర్చీని తన చీర కొంగుతో తుడిచి అందులో ఆయన్ను కూర్చోమన్నది.

కేశవ రావ్ అందులో కూర్చున్నాడు.

"హేమా నిన్ను...నా కొడుకు దగ్గర నుండి విడదీసి, వాడికి మా కులం పిల్లతో పెళ్ళి చేయాలనుకున్నాను...అది కుదర్లేదు. ఇప్పుడు వాడు తాగి, తాగి వొళ్ళు పాడుచేసుకుని, నిన్నే తలచుకుని జీవిస్తున్నాడు. వాడ్ని ఇలాగే వదిలి పెడితే చచ్చి పోతాడు...కాబట్టి వాడిని నువ్వే పెళ్ళి చేసుకో...ఇద్దరూ రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుని సంతోషంగా ఉండండి" తన గంభీరాన్నీ, గౌరవాన్నీ, పరువు-మర్యాదలు అన్నిటినీ గాలికి వదిలేసి తప్పు తెలుసుకున్న వాడిలా చెప్పేడు కేశవ రావ్.

హేమ ఒక్క క్షణం ఆశ్చర్య పోయింది. ఇంత పెద్ద మనిషి తన గుడెసను వెతుక్కుంటూ వచ్చి...తన కొడుకును పెళ్ళిచేసుకుని, వాడికి ప్రాణ బిక్ష పెట్టమని అడగడం కేశవ రావ్ తన తప్పును తెలుసుకున్నాడని గ్రహించింది...కానీ ఆమె మనసు ఒప్పుకో లేదు.

"ఇప్పుడు మీరు మనసు మారి వచ్చేరు...మమ్మల్ని పెళ్ళి చేసుకోమంటున్నారు...కానీ మీ కొడుకు ఇప్పుడు పాత క్రిష్ణారావ్ కాదే?...తాగి, తాగి తన ఆరోగ్యాన్ని పాడు చేసుకున్న ఒక రోగి. అతన్ని పెళ్ళిచేసుకుని కొన్ని రోజులు సుమంగళిగా     బ్రతకటం కన్నా...జీవితాంతం నేను ఒంటరిగానే ఉండి పోతాను" చెప్పింది హేమ.

ఆమె మాటలు చెంప మీద కొట్టినట్టు అనిపించడంతో కేశవ రావ్ తల వొంచుకున్నాడు. ఇద్దర్నీ విడ దీసిన తప్పుకు తన కొడుకు బలి అవుతున్నాడన్న ఆలొచనతో కుచించుకు పోయేడు.

కొడుకు హేమతో పారి పోయినప్పుడు తన పరువు తీసేడని, తనకీ, తన కులానికీ తల వొంపులు తెచ్చేడని కుల అహంభావంతో వాళ్ళిదరినీ విడదీసేడు. కానీ ఈ రోజు హేమ అన్న మాటలు కేశవ రావును నిజంగానే తల దించుకునేలా చేసింది.

కులం పేరుతో వాళ్ళిద్దరినీ విడదీసి తనే తప్పు చేసేనని "ఇదే నిజమైన తలవొంపు" అని గ్రహించిన కేశవ రావ్ తన గంభీరాన్నీ, బెదిరించే చూపులనూ అక్కడే విడిచి పెట్టి తప్పు చేసిన మనిషిలా తల వొంచుకుని అక్కడి నుండి బయటకు వచ్చేడు.




తను మరో రెండుగంటల్లో రాజమండ్రిలోని తన చెల్లెలి గారింట్లో వుంటాడు. ఈ మధ్య కాలంలో ఇటొచ్చినా అప్పటి తన పరిస్తితి పూర్తి యాంత్రిక స్తితి. ఇన్నాళ్ళూ తన సర్వస్వం డిస్పెంసరీనే అనుకున్నాడు. ఖరీదైన రోగాలు గల పేషంట్లే తన ప్రపంచం అనుకున్నాడు. తన వృత్తిలోనే ఆకాశమంత ఎదగాలని పేరున్న డాక్టర్ గా మిగిలిపోవాలన్న స్వార్ధ చింతన వెంటాడ సాగింది.

నిజానికి తన బంధు వర్గం తననో పెద్ద స్వార్ధ పరుడినిగా చిత్రీకరించింది. డబ్బులోనే ఆనందం వెతుక్కుంటాడని అపవాదు వేసింది. తన చుట్టూ ఒక బలమైన కంచె వేసుకుని సంప్రదాయాలు, కట్టుబాట్లకు అతీతంగా వ్యవహరిస్తున్నాడని తీవ్రంగా దుయ్యబట్టింది.

డాక్టర్ మోహన్రావులో అంతర్మధనం మొదలయ్యింది కొన్నాళ్లుగా.. రాత్రిళ్ళు నిద్ర కరువయ్యి అటూ ఇటూ పచార్లు చేసేవాడు.

ఎన్నోసార్లు ఉవ్వెత్తున లేచి పడే ఆలోచనా తరంగాలను బలవంతంగా అదిమి పట్టేవాడు. ఆ సమయంలోనే అతనికి సరైన సమాధానం లభించింది. . కొన్నాళ్ళు తన వృత్తి బంధనాలకు తెరదించి బంధు జనజీవన స్రవంతిలో కలవాలనుకున్నాడు. ఆ ఆలోచనలకే కార్యరూపం భార్య నిర్మలతో సహా రాజమండ్రి ప్రయాణం. మరో కొద్ది నిముషాల్లో తన చెల్లెలు భారతి ఇల్లు చేరుకోబోతున్నాడు . డాక్టర్ మోహన్రావులో అతని వృత్తికి అతీతంగా భరించలేని టెన్షన్ కనిపిస్తోంది. ఇన్నాళ్ళ తర్వాత భారతి ఎలా రిసీవ్ చేసుకుంటుందో ? నిజానికి తనలో ఇంత త్వరగా జ్ఞానోదయం కలగడం వెనుక తన భార్య నిర్మల సహకారం కూడా వుంది.

గుమ్మంలో కారు ఆగగానే భారతి అన్నగారికి, వదినకు స్వాగతం పలికి లోపలికి తీసుకెళ్ళింది. వాళ్ళను చూస్తూనే ఆమె కళ్ళు నీటి చలమలయ్యాయి. ఆ వెంటనే మొహం కలువ పువ్వులా వికసించింది. మోహనరావు కళ్ళల్లో సన్నటి కన్నీటి పొర తళుక్కుమంది. ఇన్నాళ్ళకు అదీ తన ముంగిట్లో అన్నగారిని, వదినను చూస్తున్నందుకు భారతి ఇంకా విచిత్రమైన భావోద్వేగంతో ఉక్కిరిబిక్కిరి అవుతూనే వుంది.

" కొన్నాళ్ళు మనవాళ్ళు, మన ఆత్మీయుల మధ్య ఉండిపోదామని వచ్చేసామోయ్" అన్నాడు మోహనరావు సోఫాలో కూర్చుంటూ . ఆ మాట అంటుంటే అతని కళ్ళు గర్వంగా మెరిసాయి. అతనికిప్పుడు నిజమైన స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నట్టుగా వుంది.

"మరి డిస్పెంసరీ మాటో? " అడిగింది భారతి అన్నగారు అనాలోచిత నిర్ణయం తీసుకున్నాడేమో అన్న అనుమానంతో.

"నాకా వర్రీ లేదోయ్ . ఇకముందు కూడా వుండదు. నీ మేనల్లుడు రఘు ఇప్పుడు నన్ను మించిపోయాడు.. వాడికి పేషంట్ల మీద ఉన్న శ్రద్ధ అంతా ఇంతా కాదు. వృత్తి పట్ల వాడికున్న అంకిత భావం నన్ను బాగా ఆకర్షించింది. అందుకే కొన్నాళ్ళు వాడిని ఒంటరిగా వదిలేసి నా ఆత్మీయులు, మిత్రుల సేవలో గడపాలనుకుంటున్నాను. " ఆ మాటలు అంటూంటే మోహన్రావులో పెద్ద రిలీఫ్ కనిపిస్తోంది. చక్కని మేడ, దాని చుట్టూ ప్రహరీ గోడ , గోడ లోపల అందమైన చెట్ల సముదాయం, ఆ ఇంటి కొచ్చే అతిధుల కోసం మేడ మీద విడిగా గది మోహన్రావును, నిర్మలను బాగా ఆకట్టుకున్నాయి.

భారతి మోహన రావు ఆఖరి చెల్లెలు. వాళ్ళిద్దరి మధ్య ఎనిమిదేళ్ళ గ్యాప్ ఉంది. దాంతో మోహన రావుకు ఆ అమ్మాయంటే చాలా ఇష్టం. అందుకే తన ప్రోగ్రాం లో ముందుగా భారతి ఇల్లు ఎంచుకున్నాడు. డాక్టర్ దంపతులు వచ్చారనగానే భారతి భర్త సందీప్ పది నిముషాల్లో ఇంట్లో వాలాడు. ఆ రాత్రి అన్న గారి కిష్టమైన పెసర పప్పు పాటోళి, ఉల్లి పాయ పులుసు, ప్రక్కన గుమ్మడి కాయ వడియాలు, వగైరా వగైరాలతో భోజనం వడ్డించింది.

భోజనం మధ్యలో సందీప్ ఎక్కువగా నీళ్ళు తాగడం గమనించాడు మోహనరావు. వెంటనే అతనిలోని డాక్టర్ బయటకు వచ్చాడు. " బావ గారు ఏమి అనుకోకండి. భోజనం మధ్యలో నీళ్ళు ఎక్కువగా త్రాగకండి. మనకందరికీ తెల్సిందే అనుకోండి. పొట్టలో ఊరిన హైడ్రోక్లోరిక్ ఆసిడ్ బాగా పలుచనయ్యి తిన్నది సరిగ్గా జీర్ణం కాదు. దీని వల్ల కడుపులో మంట, అజీర్ణం , గ్యాస్ తయారయ్యి పులి తేనుపులు రావడం లాంటి సమస్యలతో మొదలయ్యి ఇతర రోగాలకు దారి తీస్తుంది. అలా కాకుండా ఒక గంటా గంటన్నర తర్వాత నీళ్ళు తీసుకుంటే జీర్ణ క్రియ సక్రమంగా జరుగుతుంది." అన్నాడు మోహన రావు హాస్పిటల్లో రోగులకు చెపుతున్నట్టు మొహం పెట్టి.

"చాల్లెండి మీ డాక్టర్ బుద్ది పోనిచ్చుకున్నారు కాదు. ఎక్కడ పడితే అక్కడ సమయం సందర్భం లేకుండా , అవతలి వాళ్ళు ఏమనుకుంటారో అని కూడా ధ్యాస లేకుండా సందీప్ ని నీళ్ళు తాగకుండా చేసారు." అంది నిర్మల కోపంగా మొహం పెట్టి.

"ఏమి లేదు వదినా ! మేము పొరపాటున కూడా ఏమీ అనుకోం. శంఖంలో పోస్తే గాని తీర్ధం కానట్లు డాక్టర్ చెబితేనే, అదీ కావాల్సిన వాడు అన్నయ్య చెపితే చచ్చినట్టు ఎవరైనా వింటాం. అసలు మీ ఇద్దరూ మా ఇంటికి రావడమే అపూర్వం. అన్నయ్య ఎప్పుడొచ్చి తన సలహాలు ఇస్తాడా అని మేము ఎదురు చూస్తూంటే ఇందులో అనుకునేదేముంది? ఇందాక అన్నయ్య చెప్పిన రోగాలన్నీ ఈయనకున్నాయి. ఆ అల్మారా తెరిచి చూడు ఎన్ని మందులు వాడుతున్నారో తెలుస్తుంది. మౌనంగా అలా బాధ పడతారే తప్ప ఏ డాక్టర్ దగ్గరికి వెళ్లరు." అని చెపుతుంటే అప్రయత్నంగా ఆమె కళ్ళలో నీళ్ళు ఉబికాయి. మోహన రావు ఆ రాత్రి కొన్ని మందులు రాసిచ్చాడు ఎలా వాడాలో చెప్పి.

రాజమండ్రిలో ఉన్న రెండు రోజులు సరదాగా కాల క్షేపం అవడంతో పాటు ఆరోగ్యానికి సంబంధించిన అనేకానేక అనుమానాలు ఇంటిల్లి పాదికి తీరాయి. ఈ మధ్యలో మోహన రావు రాజమండ్రిలో ఉన్న ఇద్దరు ముగ్గురు సన్నిహితులను కూడా కలుసుకోగాలిగాడు. వాళ్ళ మధ్య పాత జ్ఞాపకాలు వెల్లువలా బయట పడ్డాయి.

ఆ తర్వాత పర్యటనలో భాగంగా విశాఖ పట్నంలో ఉంటున్న పెద్ద చెల్లెలి గారింటికి వెళ్లారు మోహన రావు దంపతులు. అక్కడ కూడా వారిద్దరికీ ఘన స్వాగతం లభించింది. చాలా మంది అనుకుంటూ వుంటారు. "ఈ రోజుల్లో ఏ హాస్పిటల్కు వెళ్ళినా నిలువు దోపిడేనని, పైగా రోగం పూర్తిగా నయమవుతుందని గారంటీ లేదని, అయిన దానికి, కాని దానికి, అనవసరమైన పరీక్షలు చేస్తారని, ఏదైనా అనుమానాలు తీర్చుకోవాలంటే ప్రతి డవుటుకు రేటు పెరిగి పోతుంటుందని , వాళ్ళు 'పల్స్' చూడటం మానేసి 'పర్సు' మాత్రమే చూస్తున్నారని" . రోగులలో విపరీతంగా అపవాదులున్న ఈ రోజుల్లో నిజాయితీ ప్రదర్శించి , ప్రజలు దేవుడిలా భావించే డాక్టర్లు తమ స్వార్ధ చింతనను కొంత వరకైనా విడనాడి ప్రజలతో మమైకమై పోవాల్సిన అవసరం ఎంతైనా వుందని చాలా మంది బంధువులు, స్నేహితులూ మోహన రావు పర్యటన సందర్భంగా నిర్మొహమాటంగా వ్యక్తీకరించటం అతనికి కొత్త అనుభూతిని కలిగించింది.

విశాఖ పట్నంలో పెద్ద చెల్లెలు గారింట్లో అన్నీ అరటి చెట్లే. అక్కడ మోహనరావు కిష్టమైన అరటి పువ్వు కూర, దూట కూర, దూట పెరుగు పచ్చడి లాంటి కోరికలు తీరాయి. తను వస్తాడని తెలిసి పెద్ద చెల్లెలు కొడుకు శ్రీకాంత్, అతని భార్య సౌజన్య హైదరాబాద్ నుండి వచ్చారు. శ్రీకాంత్ను ఇంతకు ముందు హైదరాబాద్లో రెండు మూడు సార్లు ఈ మధ్య కాలంలో చూసినా హాస్పిటల్లో బిజీగా ఉండటం వల్ల అతని పైన సరిగ్గా మనసు పెట్ట లేక పోయాడు.

"ఇప్పుడు వీడేమిచేస్తున్నాడంటావ్ ?" అని అడిగాడు మోహనరావు శ్రీకాంత్ను ఉద్దేశించి చెల్లెలు సులోచనతో.

" హైటెక్ సిటీలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా చేస్తున్నాడు. రాత్రంతా డ్యూటీ, పగలంతా పడుకోవటం, వీడి జీవితం పూర్తి యాంత్రికం అయి పోయిందనుకో. నువ్వొస్తున్నావని తెల్సి అతి కష్టం మీద రెండు రోజులు సెలవు పెట్టుకుని వచ్చాడు. మళ్ళీ రేపే వెళ్లి పోవాలిట. . అప్పుడే వాడికి టెన్షన్ మొదలయ్యింది " అంది దిగులుగా సులోచన.

శ్రీకాంత్ జబ్బు పడిన మనిషిలా కనిపిస్తున్నాడు. కుర్చున్నంత సేపు ముళ్ళ మీద ఉన్నట్టుగా వుంది అతని పరిస్తితి. అతని అవస్థ మోహనరావు డాక్టర్ గా ఊహించ గలడు.

"సరిగ్గా మాటలాట్టానికిక్కూడా ఆయనకు టైం ఉండదండి. బయటకెళ్ళి ఏదైనా తీసుకు రమ్మంటే అంతెత్తున లేస్తారు. . కళ్ళు, కాళ్ళు లాగేస్తున్నాయంటారు.. ఎప్పుడూ మంచం పక్కన పెయిన్ కిల్లర్స్ ఉండాలి. దీనికి తోడు ఉదయాన్నే ఆఫీసు నుండి వస్తూ అడ్డమైన హోటళ్ళలో నూనె పదార్ధాలన్నీ తిని వస్తారు. మేము కల్సి బయటకు వెళ్ళేది మహా అయితే ఏ నాలుగు నెలలకో ఒకసారి. ఏ విషయంలోనూ ఉత్సాహం వుండదు. తన గది లోకి ఎవ్వరని రానివ్వరు." అంటూ చెప్పుకు పోతోంది సౌజన్య దుఖం పూడుకు పోయిన గొంతులో. ఆమె మాటలు శ్రద్దగా వింటున్నాడు మోహన రావు.

"అంతా అర్ధమైందమ్మా! ఈ సమస్య నీ భర్త ఒక్కడిదే కాదు. నేడు ఐటీ పరిశ్రమలలో, కాల్ సెంటర్స్లో చాలా మంది ఎదుర్కొంటున్నదే . భయంకరమైన ఒత్తిడుల తాలూకు లక్షణాలు అలాగే వుంటాయి. అసలు వీరి మానసిక స్తితిలో కూడా చాలా మార్పులు వస్తున్నాయని కొన్ని సర్వేల ద్వారా తెలుస్తోంది. ఎక్కువ జీతాలకు ఆకర్షింప బడుతున్న వీళ్ళంతా కనీసం వీరి జీవన విధానం మార్చు కోవడానికి ప్రయత్నం చెయ్యాలి. నిజ జీవితం లోని అవసరాలను , ప్రాముఖ్యతలను గుర్తించి , వాటికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందిన్చుకోవాలి. తద్వారా వారికి కొంత ఆట విడుపు దొరుకుతుంది. తాము అన్ని పనులు చేసుకో గలుగుతున్నామన్న సంతృప్తి వారిలో కలుగుతుంది. ముఖ్యంగా ఆహార విషయాలలో జాగ్రత్త వహించాలి. వేళకు తినడం, అది జీర్ణం కావడానికి కొంత సమయం ఇవ్వడం, వీలయ్యేంత వరకు పోషకాహారం తీసుకోవటం ఇది కాకుండా వారాంతంలో కుటుంబ సభ్యులతో కలసి గడపటం ద్వారా కొన్ని శారీరక మానసిక అవ లక్షణాలను సవరించుకోవచ్చు. ఇటు వంటి వారికి మందుల కన్నా కౌన్సిలింగ్ బాగా పని చేస్తుంది. మేము చెపుతున్నవన్ని ఉపన్యాసాలుగా పాఠాలు చెపుతున్నట్టుగా చాలా

మందికి అనిపించవచ్చు.. కానీ ప్రతి వ్యక్తీ తెలుసుకోవాల్సిన విషయాలివి. అప్పటికీ వీటి గురించి అన్నీ ప్రముఖ పత్రికల లోనూ మీడియాల్లోనూ సమాచారాన్ని ఇస్తూనే వున్నాము. నేటి కుర్ర కారుకు ఇవేమీ చూసే టైం ఉండటం లేదు. అయినా కంగారు పడాల్సిందేమీ లేదు. ఈపాటికి శ్రీకాంత్ లో కొంత అవగాహన వచ్చి ఉంటుంది" అంటూ అత్తా కోడళ్ళకు ధైర్యం నూరి పోసాడు మోహన రావు .

" మరి నీ ఆరోగ్యం, బావగారి ఆరోగ్యం ఎలా ఉంది ? ఇంతకు ముందు ఒకసారి కలిసినప్పుడు ఏవో కొన్ని సమస్యలు చెప్పినట్టు గుర్తు. " అడిగాడు చెల్లిలిని..

" నా ఆరోగ్యం మాటలా ఉంచు. మీ బావ గారి గురించే నాకు భయంగా ఉంది. ఈ మధ్య కొలెస్ట్రాల్ చూపించుకుంటే చాలా ఎక్కువగా వుందని చెప్పారుట. ఎక్కడ గుండాగి పోతుందేమోనన్న భయంతో నన్ను టెన్షన్ పెట్టి చంపుతున్నారు. ఆయనకు అన్నంలో నెయ్యి లేనిదే ముద్ద దిగదు. కూరలు. వేపుళ్ళు నూనెలో మునిగి తేలాలి.. నూనె లేని ఇడ్లీలు లాంటి పదార్థాలు అస్సలు ముట్టుకోరు. కొలెస్ట్రాల్ తగ్గాలంటే ఏమి చెయ్యాలో చెప్పి పుణ్యం కట్టుకుందూ ?" అంది సులోచన అసహాయంగా దైన్యం నిండిన కళ్ళతో.

"ఎవెరికైనా నేను చెప్పాలనుకున్నదేమిటంటే చాలా మంది రోగాలు కొని తెచ్చుకుంటున్నారు. వాళ్ళ ఆహారపు అలవాట్లు వీలయ్యేంత వరకు ఆరోగ్యానికి భంగం కలిగించకుండా ఉండేటట్లు చూసుకోవడం వాళ్ళ చేతుల్లోనే వుంది. ఆహారపు అలవాట్లతో పాటు ముఖ్యంగా టెన్షన్ పనికి రాదు . మనకున్న సమయంలో పుస్తక పఠనం, మంచి సంగీతం వినడం , క్రమం తప్పకుండా వాకింగ్ చెయ్యడం లాంటి కొన్ని జాగ్రత్తలతో పాటు శరీర శాస్త్రాన్నీ తెలుసుకుని దాన్ని సక్రమంగా పని చేసేటట్లు చూసుకోవడం మనందరి విధి.. ఇప్పుడు నీకు చెప్పిన విషయాలన్నీ మీ ఆయనకు తెలియనివి కావు. కానీ అశ్రద్ధ వహిస్తే దుష్ఫలితాలు వుంటాయి. నువ్వు కూడా బయో టెక్నాలజీ చదువుకున్నావు కాబట్టి కొంత వరకు నీకు కూడా అవగాహన వుంటుంది. . నేను వ్రాసిన మెడికల్ గైడ్ ఒక కాపీతో పాటు ఈ మధ్య మా డాక్టర్లు నిర్వహించిన ఒక అవగాహనా సదస్సును సీడీ రూపంలో కూడా చేసింది ఒకటి ఇస్తున్నాను. వీటిని మీ ఆయనకు చూపించు. అందులో అన్నీ రోగాలకు సంబంధించి వివరాలు వుంటాయి. మన వాళ్ళందరికీ కూడా ఒక్కొక్క కాపీ దానితో పాటు సీడీ ఇచ్చాను. ప్రస్తుతం నా ట్రిప్ బరంపురం వరకు సాగుతుంది. . ఇక నుండి ప్రతి ఊళ్ళోనూ ఫ్రీ మెడికల్ కాంప్ లు పెట్టాలనుకుంటున్నాను. మందులు ఉచితంగా ఇవ్వాలనుకుంటున్నాను. ఇప్పటివరకు సంపాదిన్చిందేదో సంపాదించాం. నీ మేనల్లుడిని డాక్టర్ చేసాను. ఆ తృప్తి మాకు చాలు. ఇక నుండి ఎవరికీ ఏ అవసరం వచ్చినా ఏ మాత్రం సంశయించ కుండా నాకు ఫోన్ చెయ్యడమో, మనింటికి వచ్చేయడమో మాత్రం మానొద్దు. " అని మోహన రావు అంటూ ఉంటే అప్రయత్నంగా సులోచన కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి..

తన వృత్తి ధర్మంలో పడి తన చెల్లెళ్ళ పెళ్ళిళ్ళ విషయంలో ఇతర బంధువుల, స్నేహితుల విషయంలో " నన్ను

ముట్టుకోకు నామాల కాకి" సామెత చందాన వ్యవహరించి పూర్తిగా బాధ్యతలు విస్మరించాడన్న తీవ్రమైన అపవాదుల నుండి బయట పడటం కోసం తన వ్యవహార శైలిని పూర్తిగా మార్చుకుని బంధు జన జీవన స్రవంతిలో కలిసి వారితో మమైకమై పోవడానికి సిద్ధ పడిన డాక్టర్ మోహన్రావులో అంతర్లీనంగా ఇప్పుడు చెప్పలేనంత తృప్తి సజీవంగా ఊపిరి పోసుకుంది.




"ఇంకో వారంలో పరీక్షలు అయిపోతాయి కదా! ఇంక మనం ఎవరి లైఫ్ వాళ్ళు వెతుక్కుంటూ విడిపోవాల్సిందే." అన్నాడు దిగులుగా ప్రదీప్. 'అరె! లైట్ రా భాయ్. ఎక్కడికిపోయినా ఇది మన హోం టౌనేగా? అయినా, ఫేస్ బుక్, వాట్సాప్ లు ఉండగా విడిపోయేదేముందిరా? రోజూ చాటింగేనాయె!" అన్నాడు తేలిగ్గా కుశాల్. "రైట్లీ సెడ్ రా కుశూ. అయినా వేర్ డూ వియ్ గో రా? " అన్నాడు ప్రదీప్ ని చూస్తూ విరాట్ . "యా! యా!!" అన్నాడు చెవికున్న హెడ్ ఫోన్లో పాటలు వింటూ, ఊగిపోతూ నరేన్, అసలతనికి ఆ పాటలహోరులో వీళ్ళ సంభాషణ ఏమైనా వినబడే అలా అన్నాడో, లేక వింటున్న పాటకి తన స్వరం జత కలిపేడో !

"నేనన్నది జాబ్ సెర్చ్ గురించిరా. అఫ్ కోర్స్, మీకా బాధల్లేవు. మీ ఫాదర్స్ లైన్స్ లోకి మీరు ఆటోమేటిగ్గా వెళ్ళి పోతారు. నేనే ఏదైనా జాబ్ ట్రైల్స్ వెంటనే మొదలెట్టాలి " అన్నాడు ప్రదీప్.

వాళ్ళు ఇంజనీరింగ్ IT ఫైనల్ పూర్తి చేయబోతున్నారు. నిజానికి వాళ్ళందరూ కేంపస్ సెలెక్షన్స్ లో ఓ IT కంపెనీ కి సెలెక్ట్ అయ్యారు. ఆ రకంగా చూస్తే ప్రదీప్ దిగులు పడాల్సిన అవసరం లేదు. కాని ఆ కంపెనీ జాబ్ ఆఫర్ చేయడానికి ఇంకా ఓ ఆర్నెల్లు ఆగమంటోంది. ఈలోగా ఏదైనా జాబ్ లో చేరక పోతే, ఒక వేళ ఆ కంపెనీ కనక చేతులెత్తేస్తే, అప్పుడు ప్రారంభించే ప్రయత్నాలకి "ఎక్స్ పీరియన్స్"అన్న మాట అడ్డొస్తుంది. అప్పుడు ఏ జాబ్ కి వెళ్ళినా, ఇన్నాళ్ళు ఖాళీగా ఉన్నావేం? (ఎవడూ ఉద్యోగం ఇవ్వలేదా!? అన్నట్టు) అని ఓ ప్రశ్న ఎదురౌతుంది. అదీ ప్రదీప్ దిగులు.

అతని స్నేహితులు ముగ్గురూ బాగా సంపన్న కుటుంబస్తులు. కుశాల్ నాన్న సినీ నిర్మాత. బాగానే పేరు, డబ్బూ గడించాడు. కుశాల్ చదువు నామక: నే. ఈ చదువై పోయాక కొడుకుని హీరో గా పరిచయం చెయ్యాలనే తపనతో ఉన్నాడు. విరాట్ ఓ పెద్ద బిజినెస్ మాగ్నెట్ కి ఏకైక కొడుకు. తండ్రి వ్యాపారాలకి వారసుడు. ఇక నరేన్ కి ఏ లోటూ లేదు. అతడి నాన్న రాజకీయాల్లో మునిగి తేలుతున్నాడు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, క్రితం సారి ఓడి పోయి, ఈసారి కొడుకుని యువ నాయకుడి పేర రంగంలోకి దింపడానికి ఉవ్విళ్ళూరుతున్నాడు. వాళ్ళకి వేరేగా ఉద్యోగాలు చెయ్యాల్సిన అవసరం లేకపోయినా, సరదాకి కేంపస్ సెలెక్షన్స్ లో పాల్గొన్నారు.

ఇక ప్రదీప్ ఒక గవర్నమెంట్ ఉద్యోగస్తుడి కొడుకు. అతని నాన్న మెరిట్ పైన వచ్చిన చిన్న ప్రభుత్వోద్యోగంలో చేరినా, కష్టపడి ఉన్నతస్థాయి కొచ్చాడు. ఆయన నిజాయితీ అన్న చట్రంలో ఉండి, అవకాశాలొచ్చినా, పై సంపాదనలకి ఇష్ట పడ లేదు. తన కొడుకు కూడా తన లాగే మెరిట్ తో మంచి ఉద్యోగం సంపాదించుకుని పైకొస్తాడనే నమ్మకం లో ఉన్నాడు.

మిగిలిన ముగ్గురు స్నేహితులూ ఆస్థి, అంతస్తుల్లో ప్రదీప్ కన్నా బాగా పైనున్నా, వాళ్ళ స్నేహానికి అవి అడ్డు రాలేదు. స్నేహానికున్న గొప్ప తనమే అది. "అరే! జాబ్ కోసం ఆ దిగులేంట్రా? అంతగా అయితే మేం లేమా? నాతో సినీ ఫీల్డ్ కో, విరాట్ బిజినెస్ లో హెల్ప్ కో, లేక పోతే నరేన్ ఎమ్మెల్యే అయాక, వాడి పియే గానో సెటిల్ ఐ పోదువు గానిలే! రిలాక్స్ నౌ! లెట్స్ గో .." అంటూ ప్రదీప్ భుజంపై తట్టి లేచాడు కుశాల్. అంతా నవ్వుకుంటూ కదిలారు.

పరీక్షలైపోవడం, మంచి ఉత్తీర్ణతతో అంతా పాసవడం ఎవరి గోల్స్ కి వారు చేరే ప్రయత్నాలు మొదలెట్టడం జరిగి పోయాయి. ఒక రోజు తన స్నేహితుల గురించి చెబుతూ, తన తండ్రి నడిగాడు ప్రదీప్ సరదాగా, "అసలు నువ్వెందుకు రాజకీయాల్లోకో, సినీ రంగానికో వెళ్ళలేదు నాన్నా! అప్పుడించక్కా నేను కూడా నా ఫ్రెండ్స్ లాగా వారసత్వ ఉద్యోగం లో చేరి పోయుండే వాణ్ణిగా, ఇలా ఉద్యోగాల వేట లో పడకుండా" అని.

"మీ నాన్నేనా! ఇలా నీతీ నిజాయితీ అంటూ కూర్చునే వాడికి తగిన రంగాలేనా అవి? అయినా ఆ ముచ్చట కూడా తీరిందిలే.

మా పెళ్ళైన కొత్తల్లో, వీళ్ళ కుటుంబానికి కాస్త మంచి పేరుందని, మీ నాన్నని మున్సిపల్ కార్పొరేటర్ గా నిలబెట్టారు. నాకు బాగా గుర్తు. సిన్సియారిటీ, పంక్చుయాలిటీ కి ప్రతీకగా గడియారం గుర్తు కూడా కేటాయించారు. ఉద్యోగానికి రాజీనామా కూడా చేసేసారు. కాని కొందరు "నీలాంటి నిజాయితీ పరుడికి ఇవి పనికి రావు, పైకి నిపట్ల అనుకూలం గా ఉన్నట్లున్నా, నువ్వు గెలిస్తే అడ్డగోలు పన్లు జరగనివ్వవు అని నిన్ను ఓడించే ప్రయత్నాలే జరుగుతున్నాయి. ఇప్పుడు మంచి ప్రభుత్వోద్యోగం చేసుకుంటున్నావు. ఆనక ఓడి పోయాక, పదవి లేక, ప్రభుత్వోద్యోగమూ లేక నానా బాధలు పడతావ్ అని నచ్చచెప్పి, విత్ డ్రా చేయిం చేసారు. వాళ్ళెవరో గానీ, వాళ్ళ పుణ్యమాని, ఈ రోజు ఇలాగైనా ఉండ గలుగుతున్నాం. నీకుద్యోగం వచ్చి, నీ చెల్లెలి కి కూడా మంచి సంబంధం దొరికి పెళ్ళి చేసేస్తే మాకింకేం చింతా ఉండదురా." అంటూ భర్తనేమీ మాట్లాడనివ్వకుండానే తనే గతం, వర్తమానం, భవిష్యత్ చెప్పేసింది ప్రదీప్ తల్లి సుబ్బ లక్ష్మి.

ప్రదీప్ తండ్రి సుబ్రహ్మణ్యం "అవును. అలా ఒక రకంగా మంచే జరిగింది. అయినా మనలాంటి వాళ్ళకెందుకురా ఆ కోట్లకి పడగలెత్తిన జీవితాలు. అడ్డగోలు సంపాదనలు. ఒక వేళ సంపాదించినా, ఏదో రకంగా అవి మన్ని బాధిస్తాయి. చేసిన తప్పుకు వెంటనే శిక్ష పడక పోయినా, ఏ జన్మకా జన్మ లోనే, అదును చూసి నొక్కేస్తాడు ఆ దేవుడు. సంపాదించుకున్న దాని లోంచి ఉన్నంతలో సుఖంగా జీవించడం, పిల్లల క్షేమం, సంక్షేమం చూడ గలిగితే చాలు. సమాజ సేవ ప్రత్యక్షంగా చెయ్య లేక పోయినా, పరోక్షంగా మన వరకు నిజాయితీ గా ఉండి, చేతనైనంతలో ఇతరులకి సహాయ పడ గలిగితే అదే సమాజ హితం. మనల్ని చూసి ఒక్కరైనా మన బాట లో ప్రయాణిస్తే చాలదా? అలాగ నువ్వు చేసిన మంచి పనికి ఫలితం వెంటనే ఇవ్వక పోయినా, దానికి కూడా తగిన సహాయం సమయం చూసి అందిస్తాడు ఆ దైవం. " అన్నాడు.

నువ్వు చెప్పేది వినడానికి బానే ఉంది కానీ, మరి నా స్నేహితులంతా కోట్లకి పడగలెత్తిన వారే. వాళ్ళ తండ్రులదంతా అవినీతి సంపాదనేనా? అలా అయితే నువ్వు చెప్పినట్టు వాళ్ళ అవినీతికి ఎక్కడా దేవుడు శిక్షించిన దాఖలాలు లేవే? వాళ్ళు నాకు ఇంటర్ నుండి ఫ్రెండ్స్. ఎప్పుడూ వాళ్ళ నాన్నల గురించి చెడుగా విన లేదు నేను. వాళ్ళు కష్టాలు పడినట్లు ఎప్పుడూ నా ఫ్రెండ్స్ చెప్పనే లేదు." అన్నాడు ప్రదీప్ తండ్రి చెప్పింది అంగీకరించి, విభేదిస్తున్నట్లు.

కొడుకుతో ఇంత తీరు బడిగా ఎప్పుడూ మాట్లాడే అవకాశం దొరక లేదు సుబ్రహ్మణ్యంకి. ఎప్పుడూ తనకి ఉద్యోగ హడావుడి, కొడుక్కి చదువు హడావుడి మరి. అందుకని తను చెప్పిన దాన్ని ఇంకాస్త విపులీకరిస్తే తప్ప, ఉపయోగం లేదనుకుని, "ప్రత్యేకించి నలుగురు నోళ్ళల్లో పడేలా వాళ్ళకి కష్టాలు కలిగిండక పోవచ్చురా. వాళ్ళ స్థాయి కష్టాలు వాళ్ళకుంటాయి. వ్యాపారాల్లో నష్టాలు, ఏవో అనారోగ్యాలు, కలతలూ ఉండే ఉంటాయి. పిల్లలు, మీరు వివరంగా అవన్నీ చర్చించుకోరుగా! కుశాల్ వాళ్ళ నాన్న రెండేళ్ళ క్రితం తీసిన ఓ పెద్ద హీరో సిన్మా అట్టర్ ఫ్లాప్ అయి, ఆ టెన్షన్ కి ఆయనకి చిన్నగా గుండె పోటు వచ్చింది. నీకు గుర్తు లేదా. విరాట్ వాళ్ళ నాన్నపై ఇన్ కం టాక్స్ దాడులు ఆ మధ్య జరిగాయి. మరి మీ నరేన్ నాన్న మొన్న ఎలక్షన్లలో కొన్ని కోట్లు ఖర్చు పెట్టినా, ఓడి పోయాడు. ఇవన్నీ వాళ్ళ స్థాయికి కష్టాలే. కాక పోతే, ప్రత్యక్షం గానో, పరోక్షం గానో వాళ్ళు చేసిన మంచి పన్లు వాళ్ళని ఆ కష్టాలు తట్టుకుని, బయట పడేలా చేసుంటాయి."

"మరీ ఎలిమెంటరీ స్కూల్ పిల్లాడికి చెప్పిన నీతి కథల్లా చెప్తున్నారు నాన్న గారు. అవినీతి వల్ల కష్టాలంటారు, మంచి పన్లు చేసి బయట పడి పోయారంటారు. అలా అయితే ప్రతీ వాడు కొంత అవినీతి పని చేసి, కొంత నీతి పని చేసేస్తే, పాపం పుణ్యం బేలన్స్ అయి పోయినట్లేనా!? లాజికల్ గా లేదు" అన్నాడు ప్రదీప్, బలమైన సాక్ష్యాధారాల్లేవని న్యాయమైన కేసుని కూడా కొట్టేసిన జడ్జీలా.

"ఇలాంటి వాటికి ఒక స్థిరమైన లాజిక్ అని ఉండదు ప్రదీప్. ఇదేదో ఒకట్రెండు మాటల్లో చెప్పి ముగించేదీ కాదు. ఇది భగవత్ సంకల్పం. ఒక పాపం, ఒక పుణ్యం చేసేసి, ఏ రోజుకా రోజు బేలన్స్ చేసేసుకోవడం కాదు. అలా అనుకున్నా, ఆ పాప పుణ్యాల అకౌంట్ అక్కడికక్కడే టాలీ అయి పోదు. పూర్వ యుగాల్లోలాగా, దేవుడు ప్రత్యక్షంగా ఎదుట నిల్చి శపించడమో, వరమివ్వడమో చెయ్యడు . దేని ఫలం, దేని సమయం దానిదే. చేసిన చెడుకి శిక్ష ఎలా ఉంటుందో, మంచికి తగిన ప్రతి ఫలం కూడా ఉంటుందని చెప్పడమే దాని అంతరార్థం.

ఇప్పుడు మీ ఫ్రెండ్స్ నాన్నల సంగతే తీసుకుందాం. ఒక సిన్మా తీస్తే, దానికి ఎందరో టెక్నీషియన్లు, నటీ నటులు, ఇతరత్రా సిబ్బంది అవసరం. వాళ్ళలందరికీ ఆ సిన్మా ద్వారా ఉపాధి లబిస్తోంది. మీ కుశాల్ నాన్న లాంటి వాళ్ళు ఎందరో సినిమాల్లో పెట్టుబడి పెట్టి తాము లాభం పొందుతునే, ఎందరికో ఉపాధి కల్పిస్తున్నారు. మీ విరాట్ నాన్న వ్యాపారాల కార్యాలయాల్లో, ఫేక్టరీల్లో ఎంతో మంది ఉద్యోగాలు పొందారు. ఇవన్నీ ఇతరులకుపయోగ పడే మంచి పన్లేగా? మీ నరేన్ నాన్న రాజకీయాల్లో కొద్దో గొప్పో మంచి పనులు చేసి ఉండడం వల్లే, మూడు సార్లు ఎన్నికయ్యాడు. ఏవో, ఇతర పనుల ఫలితం వల్ల మొన్న ఓడిపోయుంటాడు. ఇలా తర్కిస్తూ పోతుంటే, అంతే ఉండదు. అయినా, నీలా పిన్న వయస్కుల్లో ఎవరికో తప్ప, భగవంతుడు, పాప పుణ్య ఫలాలు వంటి విషయాలపై ఆసక్తి ఉండదు. అంతెందుకూ, నీ వయసులో నేనూ అంతే. గుడికెళ్ళే వాణ్ణి కాదు, వెళ్ళినా మనస్ఫూర్తిగా దండం పెట్టే వాణ్ణి కాదు.

ఒక్కటి మాత్రం నిజం. నువ్వు దేవుణ్ణి నమ్మూ, నమ్మకపో! మంచిని నమ్ము. మంచి చెయ్యి. నీకు ఖచ్చితంగా మంచే జరుగుతుంది. GOOD అన్న పదం లోనే GOD ఉన్నాడు. మన తల రాత లోని దుష్ఫలితాలు, దురదృష్ట సంఘటనలు తప్పక పోయినా, నీవు చేసే మంచి వలన, ఆయా ఘటనల తీవ్రత తగ్గుతుంది. కన్ను పోవాల్సిన చోట, కాలి దెబ్బతో పోతుంది. ఒక హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష పడిన వ్యక్తి తర్వాత తన తప్పు తెలుసుకుని, శిక్షా కాలంలో జైలులో సత్ప్రవర్తనతో మెలిగితే, అతని శిక్ష తగ్గించి విడుదల చేయ బడతాడు. అలాగన్న మాట. ఇంత వరకు నీకు తెలియ కుండానే, నీ మట్టుకు ఎక్కడొ హాస్టల్లో చదువుతూ చెడు స్నేహాలు, చెడు అలవాట్ల జోలికి పోలేదూ , ఇది కూడా మంచే కదా. దాని ఫలితమే, నువ్వు మంచి పెర్సెంటేజ్ తో ఇంజనీరింగ్ పూర్తి చేసావు, కేంపస్ సెలెక్షన్స్ లో ఓ కంపెనీకి సెలెక్ట్ అయ్యావు. చూస్తూండు! నెల తిరిగే సరికి నీకు జాబ్ ఆఫర్ లెటర్ వస్తుంది."

తండ్రి సుదీర్ఘంగా తన భావోద్వేగాల్ని వెలి బుచ్చే సరికి, ఇంకేం మాట్లాడాలో తెలిక మౌనం వహించాడు ప్రదీప్. పైగా, తన ఉద్యోగాని

గురించి తండ్రి ఆశా భావం అతని కెంతో నచ్చింది. మనం ఆశావహంగా ఉంటే, జరిగే వన్నీ మంచి గానే ఉంటాయేమో!? అసలు ఆ రోజు తన ఫ్రెండ్స్ అన్నారు, "అరే! జాబ్ కోసం ఆ దిగులేంట్రా? అంతగా అయితే మేం లేమా?" అని! ఏమో నాన్న మాట నిజమయేలా ఉందేమో? చూద్దాం అనుకున్నాడు.




అది టూ టౌన్ పోలీస్ స్టేషన్. డ్స్ప్ మనోహర్ ఓల్డ్ ఫైల్స్ ఉంచిన రూం లో ర్యాక్స్ వద్ద నిల్చుని, గబగబా వెతుకు తున్నాడు. ఒక్కోఫైల్ తీసి పక్కన పడేస్తున్నాడు."సర్! ఎక్స్క్యూజ్ మీ!అది షుమారు ఐదేళ్ళక్రితం కేసుసర్! దాన్నెప్పుడో మూసేశారు. ఎందరో ఆఫీసర్స్ మారారు.ఆపాత ఫైల్స్ తెరవడం,తిరిగి తోడటం అసాధ్యం సర్!" ఎస్సై యాకూబ్ అన్నాడు.

" బట్ ఐ వాంట్ దట్ ఫైల్ . అసహాయులకు న్యాయం చేకూర్చనేనయ్యా మనముందీ. ఆఓల్డ్ మ్యాన్ ను చూస్తే నామనస్సు తరుక్కుపోయింది.అతడికి మాటిచ్చాను. అందుకే కదా పై అధికారులనుంచి అనుమతి పొంది డిప్యుటేషన్ మీద ఇక్కడ కొచ్చింది!ఇఫ్ యూ హేవ్ టైం హెల్ప్ మీ!అదర్ వైజ్ ప్లీజ్ డోంట్ డిస్కరేజ్ మీ యాకూబ్ !" అంటూ సీరియస్ గా ఫైల్స్ వెతక డంలో మునిగి పోయాడు డ్స్ప్ .మనోహర్ .

ఎస్సై యాకూబ్ కూడా ఫైల్ వెతకసాగాడు. ఇంతలో అతడికి ఫోన్ రావడంతో బయటి కెళ్ళాడు. సెంట్రీ కాఫీ తెచ్చి మనోహర్ కిచ్చాడు ." సార్ నన్ను సైదులంటారు.ఇక్కడ సెంట్రీని. మీకు సాయం చేయ వచ్చాసర్!" అని అడిగి మనోహర్ అనుమతి తో

తానూ ఫైల్ వెతక సాగాడు. ఒక్కసారిగా సెంట్రీ "సార్ !ఇది గోండి సర్! ఆఫైల్ దొరికింది.” అంటూ అందించాడు, అతడికి యబ్బై ఏళ్ళుంటై.

“సైదులూ! థేంక్సయ్యా! నీకళ్ళు నాకంటే బ్రైట్ గా ఉన్నై."అంటూ ఫైల్ తీసుకుని తన సీట్ కొచ్చికూర్చున్నాడు మనోహర్ . దూరంగా తలుపు దగ్గర స్టూల్ మీద కూర్చుని మనోహర్ నే దీక్షగా చూస్తూ మధ్య మధ్యలో కళ్ళు తుడుచు కుంటున్నాడు సెంట్రీ. మనోహర్ ఫైల్ చదువుతూనే తలెత్తి సెంట్రీని చూసి , దగ్గరకు రమ్మని సైగ చేశాడు." ఎందుకు సైదులూ! అంతబాధ పడుతున్నావు?" అని మెల్లిగా అడిగాడు.

"సారూ! మీరు వెతుకుతున్న ఫైల్ లో లాగానే నాకూతురి ఫైలూ ఉందిసార్. నేను ఇక్కడ పని చేస్తున్నా నాకు న్యాయం జరగలేదు . మీలాంటి మనసున్న ఆఫీసర్స్ ఆనాడుంటే నాకూ న్యాయం జరిగేదని ఆశ పడుతూ జరిగిందానికి బాధపడు తున్నాను సార్." అన్నాడు

"ఏమైంది సైదులూ! చెప్పు.నా పరిధిలోదైతే తప్పక నీకు న్యాయం చేస్తాను , నన్ను నమ్ము."అంటూ బుజ్జ గించాడు. సైదులు ఒక్క పెట్టున భళ్ళున పగిలిన కుండలా బోరున ఏడ్వసాగాడు. తానే స్వయంగా అతడికి మంచి నీళ్ళుతెచ్చిచ్చి " సైదులూ! ధైర్యంగా ఉండు. ఏమైందో చెప్పు , తప్పక నీకు న్యాయం జరిగేలా చూస్తాను. చెప్పు సైదులూ!" అనడిగాడు మనోహర్. సైదులు చెప్పింది విన్న మనోహర్ కు తార స్థాయిలో కోపం వచ్చింది. " ఓ.కే. నీవిక నిశ్చింతగాఉండు. ముందీ కేసు అంతు చూడనీ, ఆ వెంటనే నీ కేసు తెరుస్తాను. అవసరమైనపుడు నిన్ను వివరాలకోసం పిలుస్తాను. " అంటూ పంపాడు. మనోహర్ లాంటి సిన్సియర్ పోలీస్ ఆఫీసర్స్ ఉంటే న్యాయం దానంతటఅదే బయట పడుతుంది. ఫైలంతా స్టడీ చేసాక మనోహర్ బయటి కొచ్చి జీప్ లో డ్రైవింగ్ సీట్లో కూర్చోబోయాడు. సెంట్రీ సైదులు వచ్చి , "సార్!మీజీప్ డ్రైవ్ చేసే భాగ్యం నా కివ్వండి సర్! ఇక్కడ మరో సెంట్రీ వస్తాడు.ఇక్కడ నా డ్యూటీ టై మైంది. ఇప్పుడు ఫ్రీ "అంటూ వచ్చాడు.సరేని మనోహర్ అతడికి డ్రైవింగ్ ఇచ్చివచ్చి ఎడంపక్క కూర్చున్నాడు. "ఎక్కడికి సర్?" అని అడిగాడు సైదులు."మరెక్కడికి ? ఈ ఫైల్ లో ఉన్న నేరస్తుల కూపీ లాగేందుకే సైదులూ!జీప్ ను ఆహోటల్ కు పోనీ" .అంటూఆహోటల్ పేరు చెప్పి , వెంట తెచ్చుకున్న ఆఫైల్ చూస్తూ కూర్చు న్నాడు. సైదులు డ్రైవ్ చేసే స్పీడ్ చూసి , మనోహర్ భయ పడ్డాడు.

“ సైదులూ! స్పీడ్ తగ్గించవయ్యా! నీకేసు చూసిందాకా నన్నా నన్నుబ్రతకనీ! "అన్నాడు.

"భయంలేదుసర్ ! నేను డ్రైవింగ్లో ఎక్ష్ పర్ట్ ను.ఈ ఉద్యో గంలో చేరకముందు డ్రైవింగ్ చేసేవాడ్ని. “

"ఆ తర్వాత ఈ ఉద్యోగంలో చేరావా?”

"ఔను సార్!"

"మీ అమ్మా నాన్నా ఎక్కడ ఉంటారు సైదులూ! నీకెంత మంది పిల్లలూ?"

" సర్!మానాయన కూలి చేస్తూ కష్టపడి నన్ను హైస్కూల్ దాకా చదివించాక ,ఇహ ఆయన కష్టం చూడలేక చదువు మానేసి డ్రైవింగ్ నేర్చుకున్నాసార్! మా అమ్మ ఎస్సై గారింట్లో పనంతా చేసేది. మానాయన ఎస్సైగార్ని నాకు ఉద్యోగం కోసం సాయం అడిగాడు. ఆయన చూద్దాం అన్నాక,ఆయన సొంత కారుకు, ఉచితంగా డ్రైవర్గా కొన్నాళ్ళు పని చేశానుసార్!ఆ తర్వాత ఈ ఉద్యోగం రాను ఆయన మాట సాయం చేశారు.అందుకే మా అమ్మా నాయనా ఆళ్ళింట జీతం లేకుండా ఊరికే పని చేసేవారు. నా పెళ్ళైనాక మా ఆవిడ చేసేది,అమ్మా నాయనా బదులు. నాకొక్కర్తే కూతురు సార్! ఆమెను బాగా చదివించి పెద్ద పోలిసా ఫీసర్ను చేయాలని కలలు కన్నాను సార్! కానీ అన్నీ బుగ్గి పోయాయి.నాబిడ్డ నెవరో ఒకడు పెళ్ళి చేసు కుంటానని నమ్మిం చాడు. మోసపోయింది సార్!.మోసపోయింది. "దుఃఖం ఆపుకోలేక జీప్ పక్కన ఆపి చేతుల్లో ముఖం దాచుకుని పెద్దగా రోదించ సాగాడు సైదులు. సైదుల్ బాధ చూసిమనోహర్ కూ బాధేసింది.

"సైదులూ ! నెమ్మదించు ముందు ఈకేసు అంతు చూస్తాను. ఆతర్వాత నీకేసు చూస్తాను.అందుకేగా టూటౌన్కు తాత్కాలి కంగా వచ్చాను.నీ కేసూ అంతు తేల్చాకే వెళ్తాను. నీవు మొదటినుంచి ఇక్కడే పని చేస్తున్నావా! ప్రెమోషన్ రాలేదా? " మనసు మరల్చను అడిగాడు మనోహర్

"అవునుసర్! ఇక్కడే పని చేస్తుంటి. నాకు ప్రెమోషన్స్ వద్దనీ, ట్రాన్స్ ఫర్ చేయవద్దనీ రిక్వెస్ట్ చేసుకున్నాను సర్! ఉన్నఒకే ఒక్క కూరుతు అర్ధాంతరంగా పోడంతో నా భార్య దిగులుతో పక్షవాతం వచ్చి మంచాన పడింది. ముసలి తల్లి దండ్రులను, ఆమె నూ, చూసుకుంటూ బ్రతుకు తున్నాను సార్!. మీరు ఈకేసు అంతుచూస్తే ఈ ఆఫీసొది లేసి వెళ్ళిపోతాను సార్ ! “

"అదేంటి సైదులూ! నీకింకా సర్వీస్ ఉందిగా?"

"వద్దుసార్ !ఇప్పటికే చాలా కాలంగా ఉంటున్నాను. ఇకెళ్ళిపోతాను సార్!"

" మరి జీప్ కదిలించు సైదులూ !వెళ్దాం."అన్న మనోహర్ మాటలకు ," సార్! జీప్ కదలడం లేదుసార్! ఏదో చిన్న ప్రాబ్లం, ఇంజన్ వేడెక్కిందేమో సర్! " అంటూ అటూ ఇటూ చూసి, "సార్ ! ఈ ఇంట్లోవాళ్ళు నాకు తెల్సు, ఉండండి సార్! ఇప్పుడే వస్తాను" అంటూ సైదులు ఆఇంట్లో కెళ్ళి పది నిముషాల్లో బయటి కొచ్చి," సార్! లోపలికి రండి సార్! ఈ ఇంటివాళ్ళు నాకు బాగా తెల్సు, ఒక టీ తాగి కూర్చోండి, నేను ఇంజన్లో నీళ్ళుపోసి ఇంజన్ చల్లార గానే వెళ్దాం సార్!" అంటూ లోపలికి తీసుకె ళ్ళా డు సైదులు. మనోహర్ తనచేతులో ఫైల్ పట్టుకుని లోపలికి నడిచాడు."సార్! ఈ ఫైల్ కూడా తీసుకోండి సర్! జీప్లో ఉంది. " అంటూ మరోఫైల్ అందించాడి సైదులు.

"అరే! సైదులూ! ఈ ఫైల్ నేను తేలేదే!ఎక్కడనుంచి వచ్చింది?" ఆశ్చర్యంగా అన్నాడు మనోహర్.

"లేదు సర్! ఇదికూడా జీప్ లోనే ఉంది" అంటూ అందించి,లోపలి కెళ్ళి" మాసార్కు ఓ మంచిటీ ఏర్పాటు చేయండి! నేను జీప్ ఇంజన్లో నీళ్ళుపోసు కొస్తాను."అంటూ వెళ్ళాడు సైదులు. సైదులిచ్చిన ఫైల్లో చాలా ఫోటోలున్నా యి. ఒక యువతి టీ కప్పుతో వచ్చి టేబుల్ మీద పెట్టి వెళ్ళింది.డెస్క్ టాప్[కంప్యూటర్ ]ఓపెన్ ఐఉంది.మనోహర్ యధాలాపంగా అటుచూశాడు, ఒక్కక్షణంలో అలెర్టై ముందుకు వంగి దీక్షగా చూడసాగడు.అదేదో యూ ట్యూబ్ లా ఉంది ఫుల్ స్క్రీన్ మీద పిక్చర్ వస్తోంది. ఒక హోటల్ రూం. కొత్తగా పెళ్ళైన జంటలా ఉంది,మొదటిరాత్రిలా ఉంది. ఆ యువతిని ఎక్కడో చూసినట్లుంది. దీక్షగా చూడ సాగాడు. వారు ఇలాంటి సీన్స్ ఎలా వీడియో తీయించు కున్నారో అర్ధంకాక, అయోమయంగా చూడసాగాడు. కొంత సేప య్యా క, ఒక వ్యక్తి "నీవు నేను చెప్పినట్లు వినకపోతే ని వీడియో మీనాయనకే కాక అందరికీచూపిస్తా. యూ ట్యూబ్ లోపెడ తా, ఒక్క మారు నేను చెప్పినట్లు విను, నీమంచికే! నీజీవితం హాయిగా ఉండాలంటే నామాట విను." అంటూ ఇంకా ఏదేదో చెప్పి బెదిరిస్తున్నాడు. ఆయువతి వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఐనా ఆవ్యక్తి వినడంలేదు. చివరకు విధిలేక అంగీక రించినట్లుంది. మరొక వ్యక్తితో ఆమె గడపటాన్ని కూడా వీడియోలో బంధించారు.మళ్ళా ఆవ్యక్తి బెదిరింపు. ఆయువతి మరొకరితో. అంతా ఒక్కరోజే జరిగినట్లు లేదు, వారి వస్త్రాలను బట్టి, వేరు వేరు రోజుల్లో జరిగినట్లుంది.ఆతర్వాత ఆ యువతి వెక్కి వెక్కి ఏడ్పు. "ఇహ నీకీ రూమే జీవితం, నామాట వినకపోతే నీరోత బ్రతుకు వీధిపాలే!" ఆవ్యక్తి నవ్వు.

"ఈ రూంలో సీక్రెట్ కేమెరా ఉంది. నీలాంటి వాళ్ళను ఇలా ట్రాప్ చేస్తాం.పెళ్ళికాకుండానే వాడితో వచ్చావ్ చూడూ అదే మాకు మంచి అవకాశం. నేను చెప్పినప్పుడల్లా ఈ రూం కు రావాలి, లేకపోతే నీ బ్రతుకు ...తెల్సుగా?" వాడి వికృతపు నవ్వు. చివరగా ఆమె ఆరూంలో ఫ్యాన్ కు ఉరిపోసుకుని చనిపోడంతో వీడియో ఐపోయింది. ఆముఖం తానెక్కడ చూశాడు. ఒక్క మారు మనోహర్ తల విదిలించుకున్నాడు. గబుక్కున లేచి తల త్రిప్పి చూశాడు. టేబుల్ మీద టీ కప్పు అలాగే ఉంది.లేచి వంట గదిలోకి పరుగె త్తాడు.అక్కడ ఎవ్వరూలేరు." సైదులూ!సైదులూ !" అని అరుస్తూ బయటి కొచ్చాడు.తనజీప్ బయటే పార్క్ చేసి ఉంది.దాన్లో సైదులు లేడు."సైదులూ ఎక్కడికెళ్ళావు?" అని కేకలేసి చుట్టూచూశాడు. మరలా లోపలికెళ్ళి , ఆ కంప్యూటర్ లో వీడియోలన్నీ తన బ్యాగ్ లో ఉన్న థంబ్ డ్రైవ్ లో ఎక్కించుకుని ,ఆ వీడియోలింక్ తన మైల్ కు పంపుకుని, లోపలి కెళ్ళి మరోమారు ఇల్లంతా వెతికాడు , ఎవ్వరూ లేరు. ఆశ్చర్యంగా బయటి కొచ్చి సైదులుకోసం చూసి, "మనస్సు బావోలేక ఎక్కడికైనా

వెళ్లాడేమోచూద్దాం!" అనుకుంటూ ,జీప్ తానే డ్రైవ్ చేసుకుంటూ తన గమ్యానికేసి అతివేగంగా డ్రైవ్ చేయ సాగడు మనోహర్. అర్ధగంటలో హోటల్ చేరే సరికి అక్కడ జనం గుంపుగా, గోలగా ఉండటం చూసి, జీప్ లోంచి బయ టికి దూకేసి, "ఏమైంది? "అంటూ అడిగాడు.పోలీస్ ను చూడగా నే అంతా పక్క కు సర్దుకుని దారిచ్చారు. హోటల్ రిసెప్షన్ లో యూనిఫాం లో ఉండే వ్యక్తి ముందుకొచ్చి " సార్! మా హోటల్ మేనేజర్ ఉరిపోసు కుని ఆత్మ హత్య చేసుకు న్నారు. కానీ అది ఆత్మ హత్య కాదనీ, హత్యేనని మా నమ్మకం.ఆయనకు ఆత్మహత్యచేసుకోవాల్సిన అవసరం లేదుసర్ ! హోటల్ లాభాల్లో నడుస్తున్నది. అర్ధగంట ముందే తాను రెస్ట్ తీసుకునే గదిలో కెళ్ళారు .రోజూ ఆగదిలోనే ఒక్కగంట రెస్ట్ తీసుకుంటారు. పది నిముషాలు కాగానే పెద్దగా అరుపులు వినిపించాయి,'వదులు, వదులూ 'అని.ఆయనకుట్.వి.పెద్ద గాపెట్టుకునే అలవాటుంది. అదేకాబోలని మారూం బోయ్ తలుపు తట్టలేదు.కానీ మరో ఐదునిముషాలు వినేసరికి ఆకేకలు మా మేనేజర్ వేనేమో అని పించి, లోపల ఆయనకేదన్నా ప్రమాదం జరిగిందేమోని నన్ను పిలిచాడు, నేను మాదగ్గరుండే డూప్లికేట్ కీ తీసు కొచ్చిరూం తలుపుతీసి చూసేసరికే ఆయన ప్రాణం పోయి ఉంది.వేంటనే పోలీస్ స్టేషన్ కు ముందుగా నేనే ఫోన్ చేశాను.ఇంతలోనే మీరు వచ్చారు." అని చెప్పాడు.

"ఏదీ శవం ఎక్కడ?" అన్నాడు మనోహర్.అతడు గబగబా రూం నెం 333 కి తీసుకెళ్ళాడు.శవం అలాగే ఫ్యాన్ కు వేలాడు తోంది.ఆశవాన్ని చూసి ఆశ్చర్యపడ్డాడు మనోహర్, ఆహోటల్ టూ టవున్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంది . వెంటనే మనోహర్ ఆఎస్సైకి ఫోన్చేసి అవసరమైన వారందరితో రమ్మని చెప్పాడు. వేలి ముద్రల నిపుణుడూ, మరణాన్ని నిర్ధారించను డాక్టర్ , ఫోటోగ్రాఫర్ అర్ధగంటలో వచ్చారు.యాంబులెన్స్ కూడా వచ్చింది.హోటల్ మేనేజర్ ఉరిపోసుకున్న చీర చూసి ఉలిక్కిపడ్డాడు మనోహర్. ఆచీర ఎక్కడ చూశాడో గుర్తు చేసుకోను తన అలవాటు ప్రకారం, తలవిదిలించుకుని , ప్రయత్నించాడు.

" యాకూబ్ గారూ! సైదులు స్టేషన్ కువచ్చాడా! నాజీప్ డ్రైవ్ చేస్తూ నాతో వచ్చాడు. జీప్ ట్రబు లిచ్చింది.నన్నో ఇంట్లో కూర్చో బెట్టి జీప్ ఇంజన్లో లో నీరు పోస్తానని వెళ్ళిన వాడు మళ్ళా కనిపించ లేదు.ఆ ఇంట్లో నాకు టీ ఇచ్చిన అమ్మాయీ కనిపించ లేదు."

" సార్ ఏంటి మీరంటున్నది ? సైదులు మరణించి ఐదేళ్ళైంది.వాడికూతురు పెళ్ళికాకుండానే ఎవరితోనో అక్రమ సంబంధం పెట్టుకుని , అదిబయట పడుతుందని ,ఇదే హోటల్లో ఇదేరూంలో ఉరిపోసుకుని చచ్చింది. సైదులు ఆబాధ భరించలేక గుండె ఆగిచచ్చాడు. వాడి భార్యకు పక్షవాతం వచ్చి తీసుకుని తీసుకుని చచ్చింది.వాడి అమ్మ నాయనా చూసే దిక్కులేక చచ్చారు.ఆకుటుంబం అంతా ఆపాడు పిల్లవల్ల తుడిచి పెట్టుకు పోయింది.సైదులు మంచివాడు సార్! అమ్మనాయ నల్ని చూసుకోను ప్రెమోషన్ వద్దని,ట్రాన్స్ ఫర్ చేయొద్దని రిక్వెస్ట్ చేసుకుని ఇక్కడే పనిచేసేవాడు సెంట్రీగానే."అని చెప్తున్న యాకూబ్ మాటలు విని , ఫోటోలు తీస్తున్న ఆశవం మెడలోని చీరచూశాడు, అదీ తనకు టీ తెచ్చి ఇచ్చిన ఆఇంటి యువతి కట్టుకున్నదే! సందేహం లేదు.ఆహోటల్ మేనేజర్ ,ఔను ఆవీడియోలో ఆ అమ్మాయిని బెదిరించి లొంగ దీసు కున్నవాడే వీడు. అంటే !అంటే! యాకూబ్, ఆ అమ్మాయీ, నన్ను సాయంకోరిన ఆముదుసలి అంతా అంతా .... తమకు న్యాయం జరుగు తుందని నమ్మి, పగతీరగానే ....' మరి ఆలోచించ లేక పోయాడు మనోహర్.




మాధవరావు ఒంటరిగా బయట అరుగుమీద కూర్చుని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.ఏదో ఘోరమైన విపత్తు జరగబోతోందన్నట్టుగా అతని మనసు సూచిస్తోంది. ఇన్నేళ్ళ జీవితంలో ఎప్పుడూ లేని ఏదో అవ్యక్తమైన బెదురూ, నీరసం ముంచుకొచ్చాయి.

మాధవరావు తన వృత్తి ధర్మంలో ఎందర్నో గుడ్డిగా నమ్మాడు.కారణం వాళ్ళల్లో చాలామంది ఏదో కారణంతో రోజూ వచ్చి పోయేవాళ్ళే . తను సాధారణమైన జీవితాన్ని లాగిస్తున్నా అతని ఇల్లుమాత్రం అతిధులూ, అభ్యాగతులతో సందడిగా వుండేది. ఇంట్లో జరిగే సాహిత్య గోష్టులు, సొంతంగా ఏర్పాటు చేసుకున్న గ్రంధాలయం అతని సాహితీ పిపాసకు అద్దం పట్టేవి . దాంతో ఆ ఇంటికి వచ్చే కవులూ, కళాకారులతో ఆయనిల్లు కృష్ణ దేవరాయల ఆస్థానాన్ని గుర్తు చేసేదని వచ్చిన వాళ్ళు అభివర్ణించే వాళ్ళు. కొన్నేళ్ళ నుండి సజావుగా సాగిపోతున్న అతని జీవితంలో మాయని మచ్చలా ఇప్పటివరకు అతని జీవితకాలంలో ఎప్పుడూ ఎదురవ్వని ,ఎదుర్కోని ఒక ఇబ్బందికరమైన సమస్య అతన్ని అనుక్షణం వేధించుకు తింటూనే ఉంది. . ఇది అతనికి ఆత్మహత్యా సదృశ్యం. అవే ఆలోచనలను, మనసును ఇంకోవైపు మళ్లిద్దామన్నా మనిషిని నిలువునా కాల్చేస్తున్నాయి.

వారం రోజుల క్రితం సెక్రటరీ తనతో అన్న మాటలు గుండెల్లో మారు మోగుతున్నాయి. “ ఇన్నాళ్ళు మీరంటే మాకెంతో

గౌరవం. అందుకే మీకు కమిటీ బాధ్యతాయతమైన పోస్ట్ అప్పగించింది . కాని మీరు డబ్బు కోసం ఇంతగా దిగజారుతారని ఏ కోశానా అనుకోలేదు. ఆడిట్ చెకింగ్ లో డబ్బై వేలకు పైగా గల్లంతయ్యినట్లుగా బయట పడింది. ఈ విషయం మేమెలాగో బయటకు పొక్కకుండా చూసుకుంటాం.. ఒక వారం రోజుల్లో ఆ డబ్బు తీసుకొచ్చి కట్టెయ్యండి . ఇంతకన్నా ఒక మానవత్వం ఉన్న వాడిగా నేను చెయ్యగలిగింది లేదు. " గంభీరంగా పలికింది సెక్రటరీ గొంతు.

సెక్రటరీ మాటలు చెళ్ళుమని కొరడాతో కొట్టినట్టుగా అనిపించాయి. ఒంట్లో రక్తం తోడేస్తున్నట్టుగా ఉంది. జరిగింది కలో నిజమో తెలియని పరిస్తితి. అక్కడే తనెలా నిలబడ గలిగాడోకాని నీరసం, నిక్కాక శరీరంలోకి ప్రవేశించి గుండెల్లో ప్రకంపనాలు మొదలయ్యాయి. సెక్రటరీ తన మీద అంత ఘోరమైన నెపం ఎలా వేసాడో? ఇన్నాళ్ళు తన వృత్తిని, తన సిన్సియారిటీని ఎంతో గౌరవించే సంస్థ ఒక్కసారిగా తన మీద వేసిన నిందను జీర్ణించుకోవడం అతని వల్ల కావడంలేదు. తన మీద అతని అభిప్రాయం స్పష్టంగా తెలుస్తూనే ఉంది. అతని మాటలు మొదటినుండి తనతో వ్యవహరించిన దానికి పూర్తి భిన్నంగా ఉండి కర్కశంగానూ , కటువుగానూ అనిపిస్తున్నాయి. అతని మాటల తూటాలు చెవుల్లో మారుమోగుతూంటే నిస్సహాయంగా ఉలుకూ పలుకూ లేకుండా కొద్దిసేపు అలాగే కొయ్యబారి ఉండిపోయాడు మాధవరావు..

"డబ్బు అవసరం ఎవరికైనా వస్తుంది లెండి . ఆ సమయంలో మీకు అదే మంచి అవకాశం అనిపించి ఉంటుంది. పైగా మీ చేతులమీద కొన్ని లక్షల రూపాయల ట్రాన్సాక్షన్స్ రోజూ జరుగుతూంటాయి. మా లాంటి వాళ్లకు అలాంటి అవకాశం రమ్మన్నా వస్తుందా ? ఏది ఏమైనా ఇప్పుడు విచారించి ఏమి లాభం ? సెక్రటరీ చెప్పినట్టు మూడో కంటికి తెలియకుండా డబ్బు తెచ్చి అల్మారాలో పెట్టెయ్యండి స్వామీ ! " అన్నాడు వీరభద్రం అనే సహచరుడొకాయన మర్మగర్భంగా నవ్వుతూ,. అతని నవ్వులో ఒక విధమైన నీచత్వం, అవహేళన దాగి వుంది.

మాధవరావుకు తల కొట్టేసి నట్టయింది. ఎవరికైతే చేరకూడదో ఆ మాటలు వారికే చేరి పోయాయి. . ఇప్పటికే ఈ విషయం అదిగో ఇదిగో అంటూ మొత్తం సంస్థ అంతా పాకిపోయి ఉంటుంది. అతనిలో అప్పటివరకు బిగపట్టిన ఆవేశం ఒక్కసారి కట్టలు తెంచుకుంది. స్ప్రింగ్ డోర్ తెరుచుకుని సెక్రటరీ రూమ్ లోకి దూసుకెళ్లాడు.

తనని తానూ నిగ్రహించు కోవాలని చూసాడు మాధవరావు . కాని అతని గుండెల్లోంచి ఆక్రోశంగా బయట పడ్డాయి అప్పటివరకు అణగదొక్కుకున్న ఆగ్రహ జ్వాలలు..

"సెక్రటరీ గారు ! నా మీద ఉట్టి పుణ్యాన వేసిన నిందలు ఎప్పటికైనా మిమ్మల్ని బాధించక మానవు. ఇప్పటికైనా మీరు ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోండి . మీ మాటలు, మీ ఆరోపణలు వృత్తి పట్ల నాకున్న అంకిత భావాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసాయి. మిమ్మల్ని ఏ విధంగా నమ్మించాలో నాకర్ధం కావడం లేదు. పూర్తిగా ఏ విషయం నిర్ధారణ కాకుండానే అప్పుడే

అందరికి పాకి పోయింది. ఈ సంస్థలో అందరూ నా వాళ్ళే అనుకున్నాను. కాని చాలా మంది శత్రువులు మధ్య నేను పని చేస్తున్నట్టుగా ఇప్పుడు అర్ధ మవుతోంది.ఇప్పటికైనా మిమ్మల్ని ప్రాధేయ పడుతున్నాను ఇంకో సారి బాగా రికార్డులు వెరిఫై చెయ్యండి. ఎంక్వయిరీలు వేయించండి. నిజాల్ని నిగ్గు తేల్చే అవకాశం ఇవ్వండి. నేను కూడా రాత్రంతా కూర్చుని బిల్లులూ అవీ చూస్తాను. . నా హయాంలో పొరపాటున కూడా అవినీతి జరగడానికి అవకాశమే లేదు. " ఆరిపోయిందనుకున్న బాంబులా పేలాయి అతని మాటలు. ఈ హటాత్తు పరిణామానికి సెక్రటరీ షాక్ తిన్నాడు. అతని పెదవుల మధ్య పొగలు కక్కుతున్న సిగరెట్టును నిర్లక్ష్యంగా నలిపి యాష్ట్రేలో పడేసాడు..ఇద్దరి మధ్య రెండు నిమిషాలు మౌనంగా దొర్లాయి. మాధవరావు మాటలకు అతని అహంకారం భళ్ళున బద్దలయ్యినా ఇన్నాళ్ళుగా మాధవరావుతో ఉన్నస్నేహాన్ని పురస్కరించుకుని వెంటనే తమాయించుకుని సాధ్యమయినంత వరకు మంద్ర స్థాయి గొంతుతోనే ఇలా అన్నాడు.

" సారీ మాధవరావు గారూ ఈ విషయంలో నేనేమి చెయ్యలేక పోతున్నాను. . ఒకసారి ఆడిటర్ల దృష్టికి వచ్చిందంటే మన చేతిలో ఏమీ ఉండదనీ మీకూ తెలుసు. నేను కూడా మన చైర్మన్ కు జవాబుదారినే. ఆడిటర్లు నోటీసు ఇవ్వక ముందే ఆ డబ్బు ఎంత కష్టమైనా సరే తెచ్చి ఇచ్చేయండి. . అసలు చైర్మన్ గారు పోలీస్ కేసు పెట్టమని అంటున్నారు. నేనే మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం ఇష్టంలేక విషయాన్ని సామరస్యంగా హేండిల్ చేస్తానని మాటివ్వడంతో ఆయన ఏ కళ నున్నాడో ఊరుకున్నాడు. ." అన్నాడు సెక్రటరీ అక్కడ నుండి వెళ్లి పోతూ.

మాధవరావుకు ఎంత త్వరగా అక్కడనుండి బయట పడిపోదామా అనిపించింది. తనని తాను నిగ్రహించుకోవాలని చూస్తున్నాడు కాని సాధ్యపడటం లేదు. అసలు ఆ సంస్తలో ఇంకొక్క నిమిషం కూడా ఉండటానికి అతనికి మనస్కరించడం లేదు.

ఆ రోజు నుండి మాధవరావును అనుమానించే వారి సంఖ్య పెరిగిపోయింది. అప్పటివరకు అతని సలహాలు, సహాయం పొందిన వాళ్ళు వెనక నుండి కామెంట్లు చెయ్యడం మొదలు పెట్టారు. కొన్నాళ్ళుగా అతను ముభావంగా ఉంటున్నాడు. భార్యతో కాని , కూతురితో కాని మనసు విప్పి ఏమీ చెప్పడం లేదు.

" మాకు అనుమానంగానే ఉందండి. ఇద్దరు కొడుకులను పెద్ద పెద్ద చదువులు చదివించడం మామూలు జీతంతో ఈ రోజుల్లో సాధ్యమా ? మా పిల్లలను స్కూల్ ఫైనల్ వరకు చదివించాలంటేనే చుక్కలు కనిపిస్తున్నాయి. పైగాఆయనకు పెళ్లి కెదిగిన కూతురుంది. కనీసం చేతిలో నాల్గైదు లక్షలు ఉంటేకాని పెళ్లి కాదు. అసలు ఇంకా బయట పడలేదు కాని ఇలా ఎన్నాళ్ళ నుండి ఈ భాగవతం నడిపిస్తున్నాడో ఈ పెద్ద మనిషి ? పైకి మాత్రం ఉదార స్వభావుడని, కష్టాల్లో ఉన్న వాళ్ళని చూస్తే కరిగి పోతాడని అందరిచేత అనిపించుకోవాలని వెధవ తాపత్రయం. రోగాలు, రహస్యాలు ఎంత కాలం దాచగలం? ఈ రోజు

పాపం పండింది. అనుభవించక తప్పదు. " అంటూ మాధవరావు తో నిన్నటి వరకు బాగా సంచరించిన సహచర బృందం నిస్సిగ్గుగా, నిర్దాక్షిణ్యంగా వెలివేసి నట్లుగా మాట్లాడుతూంటే కళ్ళ ముందు ఘోరం జరుగుతున్న ప్రేక్షకుడిలా కళ్ళప్పగించి చూడటం తప్ప ఏమీ చెయ్యలేక పోతున్నాడు మాధవ రావు.

ఇంటికొచ్చి వాలుకుర్చీలో కూలబడ్డాడు. భరించలేని ఉద్విగ్నత అతనిలో కనిపిస్తోంది. క్షణ క్షణానికి తన కంపనీ లోని సహచరులు అన్న మాటలే గుర్తొస్తున్నాయి. ఇప్పుడు వాళ్లకు ఇదో మంచి అవకాశం. ఈ పరిస్తితిలో మీద పడిన నింద నుండి ఎలాగోలా బయటపడటం తప్ప చెయ్యగలిగిన దేమీ లేదు. భవిష్యత్తు ఏమిటో కాలానికే వదేలేసే పరిస్తితి కాదు.మనసు అవమానంతో కుతకుతలాడుతున్నా క్షణ క్షణానికి పరిస్తితి విషమిస్తూ ఉండటంతో అప్పటివరకు మల్లగుల్లాలు పడుతున్న అతనికి సమస్యను కొడుకుల దృష్టికి తేక తప్పలేదు. ఆ రాత్రి మాధవ రావు అన్యమనస్కంగానే జరిగిన విషయం కొడుకులకు ఫోనులో చెప్పాడు.

ఇప్పుడు ఈ సమస్య నుండి బయట పడక పోతే పోలీస్ కేసు కూడా ఎదురు కోవాల్సి ఉంటుందని నిష్కారణంగా తన మీద నిందలు వేసి తనని బయటకు నెట్టేయాలని చూస్తున్నారని దీని కంతటికీ కారణం సెక్రటరీ నే నని, ఒక నాడు అర్జెంటు గా తనకో లక్ష రూపాయలు కావాలంటూ వచ్చిన సెక్రటరీకి తను సహకరించక పోవడంతో మనసులో కక్ష పెట్టుకుని ఏదో రకంగా తనని వంచిన్చాలనే నెపంతో అల్మారాలోంచి డబ్బు కాజేసినట్లుగా కథలు అల్లాడని ఇన్నాళ్ళుగా పరువుగా పనిచేస్తూ ఏ సమస్య రాకుండా చూసుకుంటున్న తనకు అనుకోని విపత్కర పరిస్తితి ఎదురైందని ఈ పరిస్తితిలో తలో చెయ్యి వేసి వాళ్లకు ఏదో విధంగా డబ్బు కట్టేసి బాధ్యతలనుండి తప్పుకోవడం తప్ప వేరే దారి లేదని త్వరగా తనని ఆ నరక కూపంనుండి బయట పడేసే మార్గం ఆలోచించమని అతని అంతరాత్మఎంత ఒద్దని వారిస్తున్నా తనో అపరాధిలా కొడుకులతో మొరపెట్టుకోక తప్పలేదు. మనసులో అలజడి రేపుతున్న భయాందోళనలను పిల్లలకు చెప్పేసాక అతని గుండెలు కొద్దిగా తేలిక పడ్డట్టయ్యి హాయిగా ఊపిరి తీసుకున్నాడు.

తండ్రి ఇన్నాళ్ళుగా జరుగుతున్న విషయాలు ఒక్కటీ చెప్పక పోగా ఇప్పుడు పీకల వరకు కూరుకు పోయాక 'ఎమోషనల్ బ్లాక్మెయిల్ ' చేస్తున్నట్టుగా అనిపించింది. ఈ పరిస్తితిలో ఇంత సడన్గా ఏ సమస్యనైనా పరిష్కరించ గలిగే ధైర్యం, నేర్పరి తనం, చొరవ కొడుకులిద్దరి లోనూ ఉంటుందని మాధవరావు కూడా భావించ లేదు. కాని నదిలో కొట్టుకు పోతున్న వాడికి చిన్న తీగ తగిలినా దాని సాయంతో బయటకు రావాలని ప్రయత్నం చెయ్యడం సహజం.

"ఏమిటీ నాన్నా ఇంత పుట్టి ముంచావు. హాయిగా వేరే డిపార్టుమెంటులో పని చేసుకుంటున్న వాడివి అక్కడ సరైన విలువ లేదంటూ క్యాష్ సెక్షన్ కోరుకున్నావు. చూస్తూ చూస్తూ ప్రతి వాడిని నమ్మి ఎదురుగా కూర్చో పెట్టుకుని అల్మారా తాళాలు అప్పగించావు. డబ్బు నీ వల్లే పోయిందని నెపం వేస్తే సరెండర్ అయ్యి అకారణంగా డబ్బులు కట్టే పిచ్చాళ్ళు ఈ రోజుల్లో ఎవరైనా ఉంటారా?. వీటికి ఎంక్వయిరీలు, డిస్కషన్స్ అంటూ ఏమీ ఉండవా ? ఇంతకు ముందు కూడా నీ విషయంలో

మీ మ్యానేజ్మెంట్ వాళ్ళకేదో ఎగైనెస్ట్ గా వెళ్ళావని కక్ష కట్టారని గుర్తు లేదా ? బహుశా అది మనసులో పెట్టుకుని సాధిస్తున్నారేమో ? ఏది ఏమైనా వాళ్లకు భయపడి డబ్బులు కట్టేసి బయట పడి పోవాలని వెర్రి వెర్రి ఆలోచనలు చేస్తే వాళ్లకు ఉట్టిపుణ్యాన లాభం చేసిన వాళ్ళమవుతాం. ఈ పరిస్తితిలో ఎదురొడ్డి సమస్యను ఛేజించుకు రావాలి కాని భయపడి పారిపోవడం మంచి విషయం కాదు. ప్రస్తుతం నీ నిర్ణయం మార్చుకో. నువ్వు తొందరపడి మా దగ్గరకు రావాలనే ప్రయత్నం కూడా నేను సమర్ధించను. మాకూ పిల్లలు ఎదుగుతున్నారు. నీలా బాధ్యతా రహితంగా ఉద్యోగంలో సమస్యలు తెచ్చుకుంటే మా ఉద్యోగాలు కూడా ఊడుతాయి.. డబ్బై వేలంటే మాటలు కాదు. ముప్పై ఏళ్ల నుండి అక్కడ పని చేస్తున్నావు. ఆ మాత్రం సమస్యలను నెగ్గుకు రాలేవా ? నువ్వు మాత్రం అనాలోచితంగా ఉద్యోగం మానేస్తే చాలా ప్రమాదం. నిన్ను వాళ్ళు వదిలిపెట్టరు. నీతో పాటు మమ్మల్ని కూడా మనశ్శాంతి గా బ్రతకనివ్వరు . . ఇప్పటికే ఉద్యోగంలో మాకూ విపరీతంగా టెన్షన్స్ ఉన్నాయి " అని కొడుకులు నెపం అంతా తన మీదే వేసి సమస్యకు ఏ మాత్రం పరిష్కారం చూపడానికి చొరవ చూపక పోవడంతో మాధవరావు పూర్తి అచేతనుడై పోయాడు.

" నన్ను అర్ధం చేసుకోండిరా . నా పరిస్తితి ఇంకొక్క క్షణం కూడా వాళ్ళ దగ్గర పని చేసే టట్లుగా లేదు. మీకు ఇంకా చాలా భవిష్యత్తు ఉంది. కావలసినంత సంపాదించుకునే అవకాశం ఉంది. మన పల్లెటూళ్ళో ఉన్న పొలాన్నికూడా అమ్మేసి నా మనవళ్ళ పేరు మీద వేసాను కదా. అందులోంచి తీసి ఎంతో కొంత పంపించండి . నా జీవితం మీ నిర్ణయం మీద ఆధారపడి ఉంది " అని కొడుకులతో గొంతెత్తి చెప్పాలనుకున్న మాటలు మాధవరావు గొంతులోనే సజీవ సమాధి అయిపోయాయి.

శరీరం బలహీనమైనప్పుడు రోగాలు టెర్రరిస్టు లాగా దాడిచేస్తాయి. మాధవరావుది అదే పరిస్తితి. రిటైరయ్యాక కొడుకుల దగ్గరకు వెళ్లి పోతాం అంటూ తను చాలా మందితో చెప్పుకుంటూ ఉంటే " పోన్లెండి మీకు బంగారం లాంటి ఇద్దరు కొడుకులు. కళ్ళకు రెప్పల్లా చూసుకుంటారు " అని వాళ్ళు అంటూ ఉంటే పుత్రోత్సాహము మాధవరావులో పొంగి పొరలేది. కాని దురదృష్ట వశాత్తు కనీసం సానుభూతి వచనాలు కూడా కొడుకుల నుండి దక్కలేదు.

ఇరవై సంవత్సరాల తర్వాత సంగతి. ఎప్పుడో ఇల్లు విడిచి వెళ్ళిపోయి అర్ధాంతరంగా ఆత్మ హత్య చేసుకున్న తండ్రి మాధవరావు గుర్తుకొచ్చినా ఆయన కొడుకులు " చేతులారా బాధ్యతారహితంగా చేసుకున్న దానికి మనం బాధ్యత వహించి బాధ పడ్తూ ఉండటం అనవసరం".అని కొట్టి పారేస్తారే కాని నానా కష్టాలు పడి తమని పెద్ద చదువులు చదివించి ఉన్నత స్తితికి ఎదగడానికి పునాదులు వేసిన ఆయన్ని ఆపద నుండి ఏదో విధంగా బయట పడేసి ఉంటే ఆయనిలా ఎవరూ లేని వాడిలా దిక్కులేని చావు చావాల్సి వచ్చేది కాదు " అని మాధవరావు కొడుకులు ఏనాడూ అనుకున్నది లేదు. .

పిల్లలు తల్లి తండ్రులను ఇడుముల పాలు చేసి కష్టాల కడలిలో ముంచినా చనిపోయాక తల్లి తండ్రుల ఆత్మలు తమ పిల్లలు,వాళ్ళు

కన్న పిల్లలు హాయిగా సుఖంగా ఏ కష్టం రాకుండా సుఖశాంతులతో కలకాలం జీవించాలని కోరుకుంటాయే తప్ప వారిమీద పగ పూనవు. వారిని పైనుండి చల్లగా చూసుకుంటాయి. అదే తల్లితండ్రులకు ఇతరులకు ఉన్న తేడా.

ఈ నాటికి కూడా మాధవరావు గారి పిల్లలు, వారి సంతానం ఉన్నత స్థానాలకు ఎగబాకుతూ జీవితంలో అసంతృప్తి అనే దానికి ఆమడ దూరంలో ఉంటూ డబ్బులోనే ఆనందాన్ని వెతుక్కుంటున్నారు.




ఇండియా పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న స్టేడియం బయట ఎంత టెన్షన్ వుంటుందో..

అంతకు మించిన టెన్షన్ వ్యాపించి పోయింది.. ఆ కోర్టు ప్రాంగణమంతా. అన్ని ఛానళ్ల ఓబి వేనులతో బాటు ..పోలీస్ వెహికల్స్ తో అక్కడి పార్కింగ్ ప్లేసు నిండి పోయింది. యస్ పీ..డియస్పీ రేంక్ ఆఫీసర్లతో బాటు దాదాపు రెండు వందల మంది పోలీస్ బలగాలతో..టెర్రరిస్ట్ ఎన్ కౌంటర్ ఆపరేషనా?..అనిపించేలా..నిశ్శబ్దం గానూ..ఉద్రిక్తంగా వుంది. ఛానెళ్ల కెమారా మెన్ లతో బాటు..న్యూస్ రిపోర్టర్లు కూడా పోలీసులు ఏర్పాటు చేసిన బారికేళ్ల వెనుక..నిలబడి..కోర్టు నుండి బయటి కొచ్చే..వ్యక్తులను నిశితంగా గమనిస్తున్నారు.

ఆ రోజు సిటీలో సెన్సేషన్ క్రియేట్ చేసిన ..ముగ్గురి మరణానికి కారణమైన..శ్రావన్ కేసు విచారణ. ఆ కేసులోవున్న ముద్దాయిల

సంబంధీకులందరూ..సిటీలో బిగ్ షాట్స్ కావడమే..ముఖ్య కారణం.

కోర్టు లోపలి వాతావరణం కూడా అందుకు భిన్నంగా లేదు సెషన్స్ కోర్టు విజిటర్స్ గేలరీ ఖాళీ లేకుండా క్రిక్కిరిసి పోయింది.

వివిధ న్యూస్ పేపర్ల పత్రికా విలేఖరులతో.. కోర్టు హాలంతా ..కోలాహలంగా వుంది.

కార్ యాక్సిడెంట్ లో చని పోయిన" చిరంజీవి సౌమ్య కేసు" విచారణ..

బోనులో తల వంచుకు నిల బడిన టీనేజ్ ముద్దాయిలు ..ఐదుగురూ..అయోమయంగా చూస్తున్నారు. ముద్దాయిల తలి దండ్రులు ఆడ్వాన్స్ డు కేన్సర్ పేషెంటుల్లా మరీ దీనంగా ముఖాలు పెట్టారు. కోర్టు ప్రారంభాన్ని సూచించే గంట మోగింది. కోర్టు అటెండర్ వచ్చి జడ్జి గారి కుర్చీ ప్రక్క నిలబడటంతో..కోర్ట హాలంతా పిన్ డ్రాప్ సైలెన్సుతో నిండి పోయింది. గంభీరంగా వచ్చిన జడ్జి గారిని చూస్తూనే అందరూ నిలబడి అభివాదం చేశారు.

తల వంచి అభివాదాన్ని స్వీకరించిన జడ్జి గారు ఆశీనులు కాగానే..అందరూ తమ తమ స్థానాల్లో..కూర్చుండి పోయారు. పట్ట పగలే తప్పతాగి..డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా డ్రైవ్ చేసి మూడు నిండు ప్రాణాలను బలిగొన్న కిరాతకుల పక్షాన వాదించడానికి ఏ లాయరూ ముందుకు రాక పోవడంతో కోర్టు వారు అనుమతించిన డిఫెన్సు లాయరు ముద్దాయిల తరపున కేసు ప్రెజెంట్ చేయడానికి నియమించబడ్డారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్..లేచి నిలబడి

"యస్ యువరానర్" అంటూ మొదలు పెట్టారు .".యువరానర్ ముగ్గురి ప్రాణాలు బలిగొన్న ఈ కేసులో ముద్దాయిలు ఐదు మందీ మైనర్లే. అందరూ ఇంజినీరింగ్ విద్యార్ధులే..యువరానర్. మల్టిప్లెక్స్ లో టికెట్లు దొరక్క పోవడంతో..పట్ట పగలే డ్రింక్ చేసి ..ఫ్లై ఓవర్ డౌన్ లో కార్ ను కంట్రోల్ చేయ లేక రోడ్ డివైడర్ ను గుద్దేసారు. కారు..ఆ స్పీడుకు టిల్టై ..రైట్ సైడ్ లో వస్తున్న కారు మీదకు పల్టీలు కొట్టేసింది. ఆ కారు డ్రైవ్ చేస్తున్న సౌమ్య బాబాయ్ స్పాట్ లో చనిపోతే ఎనిమిది సంవత్సరాల సౌమ్య కోమా లోకి వెళ్లి పోయి ఎనిమిదో రోజున కన్ను మూసింది యువరానర్. సౌమ్య తాత గారు కూడా చికిత్స పొందుతూ మరణించారు. పోలీస్ డిపార్టుమెంటు కోర్టుకు సమర్పిం చిన బారు లోని సిసి కెమారా రికార్డింగ్స్..ఇన్సిడెంట్ ప్లేసు ప్రక్కనున్న హోటల్ సిసి కెమారాలో

రికార్డైన క్లిప్పింగ్స్ కేసును ప్రూవ్ చేశాయి యువరానర్. ముద్దాయిలు కూడా తమ నేరాన్ని అంగీకరించారు యువరానర్.

ముద్దాయిలకు ఐ పి సి 304సెక్షన్ బి ప్రకారం తగిన శిక్షలు విధించ వలసినదిగా..కోరుతున్నాను యువరానర్..పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన వాదనను ముగించగానే.. ముద్దాయిల తరఫున వాదనలు వినిపించడానికి లాయర్స్ ఎవరూ ముందుకు రాక పోవడంతో.. కోర్టు వారే నియమించిన డిఫెన్స లాయర్ నిలబడి.. అభివాదం చేసి.

" యువరానర్..!"

"ఈ కేసులో డిఫెన్స్ చేయడానికి గానీ..వాదించ డానికి గానీ ..ఏమీ లేదు యువరానర్.. కేసుకు సంబంధించిన వివరాలన్నీ కోర్టుకు సబ్మిట్ చేశాను యువరానర్..అభియోగం మోప బడిన ముద్దాయిలందరూ తమ నేరాన్ని ఒప్పుకున్నారు యువరానర్..ముఖ్యంగా ముద్దాయిల తరఫు పేరెంట్సందరూ నా ద్వారా కోర్టు వారికి తమ మనవిని విన్నవించుకోడానికి అనుమతి కోసం సవినయంగా మనవి చేసుకుంటున్నారు యువరానర్. "

"ఐ అబ్జెక్ట్ యువరానర్.!. ముద్దాయిల తరఫున వున్న ఐదు మందికీ టైం స్పేర్ చేయడం కోర్టు వారి సమయాన్ని వృధా చేయడమే ఔతుంది."

ప్రాసిక్యూటర్ ఆబ్జెక్ట్ చేయడంతో..డిఫెన్స్ లాయర్ లేచి..

"కోర్టు సమయాన్ని వృధా చేయడం ముద్దాయిల తలిదండ్రుల ఉద్దేశం కాదు యువరానర్. కేసుకు గానీ ముద్దాయిలకు గానీ ఎటువంటి సంబంధం లేని..తమ మనో భావనలతో బాటు..చిరంజీవి సౌమ్యకు తమ సంతానం కలిగించిన అన్యాయానికి బదులుగా తాము చేయ తల పెట్టిన కార్యక్రమాన్ని కోర్టు ముందాచాలనే తపన తప్ప మరో ఉద్దేశం లేదు యువరానర్..అందరి తరఫున ఒక్కరికైనా అవకాశం యిప్పించ వలసినదిగా అందరి ప్రార్ధనే ఈ విన్నపం.. యువరానర్."

వినమ్రంగా అభివాదం చేశాడు ..డిఫెన్స్ లాయర్.

"అబ్జెక్షన్ ఓవర్ రూల్డ్ నౌ..వన్ కెన్ ప్రొసీడ్.."

జడ్జి గారు అనుమతించగానే ..కారు డ్రైవ్ చేసి మూడు ప్రాణాలను బలిగొన్న శ్రావన్ తండ్రి కిషోర్

బోనులోకొచ్చి అందరికీ అభివాదం చేశాడు.

“మా అభ్యర్ధనను మన్నించి మాకీ అవకాశ మిచ్చిన కోర్టు వారికి..హృదయ పూర్వక నమస్కారములు. ముగ్గురి మరణానికి మూడు కుటుంబాల క్షోభకు..కారకులైన మా దారి తప్పిన పిల్లల..గురించి ఏంచెప్పినా ..వ్యర్ధమే యువరానర్.ఈ దురదృష్ట సంఘటనకు బాధ్యులు ఈ మా పిల్లలే కాదు యువరానర్..మేం కూడా బాధ్యులమే. వీలయితే మా పిల్లలకు విధించే శిక్షను..వారితో బాటు మాకు కూడా వర్తింప చేసే అవకాశాలను పరిశీలించ వలసినదిగా మనవి చేసుకుంటున్నాము. చిన్నారి సౌమ్య జ్ఞాపకార్ధం ..తన పేరున ఓ ట్రస్ట్ ఏర్పాటు చేసి..

మాలాంటి పనికి మాలిన పేరెంట్స్ ను ఎడ్యుకేట్ చేసే కార్యక్రమాలను ..నిర్వహించేలా..రూపు దిద్దాలనుకుంటున్నాము..ఇది మాత్రమే గాక ఏ టీనేజర్ తప్పు చేసినా ముందతని తల్లిదండ్రుల్ని బాధ్యుల్ని చేసే జీవో పాస్ చేయ వలసిందిగా..మీ ద్వారా ప్రభుత్వాన్ని..కోరుతున్నాము యువరానర్..ఒకప్పుడు తాగుబోతంటే సంఘం చీకొట్టేది..అసహ్యించు కొనేది.. మరి అదే ఈనాడు..ఫ్యాషనై పోయింది ..ప్రభుత్వానికి గొప్ప ఆదాయ వనరై పోయింది. ఒకప్పుడు తాగుబోతులు రాత్రిళ్లు మాత్రమే తాగి తందనాలాడేవారు మరి ఈనాడు..తాగి మరీ ఆఫీసులకొస్తున్నారు..ముఖ్యంగా.... టీనేజర్స్..పబ్బుల్లో వారే.. హుక్కా సెంటర్లలో వాళ్లే..తాగి మరీ బైక్ రేసుల్లో ప్రాణాలు కోల్పోతోంది.. డ్రగ్స్ రాకెట్లలోపట్టు బడుతోంది యువతే.. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో కూడా యువతే యువరానర్.. వీరందరి విచ్చల విడి తనానికి..ఆద్యులూ..ఆజ్యం పోస్తోంది మా వంటి బాధ్యత తెలియని.. తల్లిదండ్రులే యువరానర్.. ఆఖరు సారిగా మాకు కూడా కఠిన కారాగార శిక్ష. విధించ వలసినదిగా మనవి చేసుకుంటూ మాకీ అవకాశమిచ్చిన..కోర్టు వారికి మా కృతజ్ఞతలు తెలుపుకుంటూ..సెలవు తీసుకుంటున్నాను యువరానర్.”

కిశోర్ నమస్కరించి వెళ్లగానే..జడ్జి గారు కోర్టులో వున్న అందరినీ చూస్తూ..

నా అనుభవంలో వాదోపవాదనలు లేని తొలి కేసిది. ముద్దాయిల తరఫు మనవిని పరిగణన లోకి తీసుకుంటాం.వారి విన్నపాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తాం.. ఈ కేసు..క్షుణ్ణంగా పరిశీలించిన పిమ్మట..అయా సెక్షన్ల ప్రకారము ..శిక్షలు అమలు చేస్తాం..ఫైనల్ హియరింగ్ నెక్స్ట్ సోమ వారానికి వాయిదా వేస్తున్నాం...నౌ కోర్ట్ ఈజ్ ఎడ్జర్న్డ్ ..

***                    ***          ***

ముద్దాయిల తలిదండ్రులందరూ కిశోర్..బంగ్లాను సమీపిస్తూ ఇంటి చుట్టూ గుమి కూడిన జనాల్ని చూస్తూనే ఏదో ఉపద్రవం సంభవించిందన్న సెన్స్ తో కొట్టుకుంటున్న గుండెల్ని అదుపులో పెట్టుకుంటూ జీవమున్న శవాల్లా కార్లు దిగారు. అంతలో ఏడ్చుకుంటూ హఠాత్తుగా వచ్చిన కిశోర్ కూతురు తండ్రిని చుట్టుకుపోతూ..

"డాడీ !అమ్మ..అమ్మ చచ్చి పోయింది " అంటూనే ఒక లెటర్ తండ్రి చేతిలో పెట్టి కుప్ప కూలి పోయింది.

కూతురి ప్రక్కనే కూలబడి పోయిన కిశోర్ వణికే చేతులతో..లెటర్ తెరిచాడు.

ఏమండీ..!ఈ లెటర్ మీరు చదివే సరికి నేని లోకంలో వుండను. మన బాబు తప్ప తాగి ముగ్గురి జీవితాలను పొట్టన పెట్టుకున్నాడన్న వార్త వింటూనే చచ్చి పోవాలనుకున్నాను...కాని మన మిగిలిన యిద్దరు బిడ్డల ముఖాలు చూసి ..సాహసం చేయ లేక పోయాను. ఈవారం రోజులూ నేనెంత నరకం అనుభవించానో..మీరు వూహించలేరు. బంధువుల పరామర్శల్లోని వ్యంగ్యాన్ని ..చుట్టు ప్రక్కల వారి అసహ్యమైన చూపుల్ని..భరించ లేక పోయాను. మన కిరాతకుడు పొట్టన పెట్టుకున్న ముక్కు పచ్చ లారని సౌమ్య..సౌమ్య బాబాయి..తాతయ్యల మరణాన్ని టీవీల్లో  ..పేపర్లలో చూస్తూ..ప్రతి క్షణం చచ్చి పోతున్న..ఫీలింగులతో ఈ వారం రోజులూ నెట్టుకొచ్చాను. మనం ..చేసిన చెత్త పనులే మన బిడ్డ కిరాతకానికి కారణాలయ్యాయని మనసారా నమ్ముతున్నాను. దద్దమ్మకు..పట్టం కట్టాలనుకున్నాం. లికుల పేపర్లు కొన్నాం..లక్ష లక్షలు తగలేసాం..చెప్పు తినే కుక్కను అందలమెక్కించాలనుకున్నాం. చివరకు హంతకుడయ్యాడు. మనం చేసిన చెత్త పనులు మన చావుకు కారణమైనా..సంతోషించే వాళ్లం..మూడు నిండు ప్రాణాలు..మూడు కుటుంబాలు..ఈ పాపం ఎవరిది.?.డబ్బులు సంపాదించాలనే యావలో మీరు..ఆడంబరాల వలలో నేను..ఇంటర్ లో స్మార్ట్ ఫోను..లైసెన్స్ లేకుండానే స్పోర్ట్  బైకు..మీకు తెలియకుండా అడిగినంత పోకెట్ మనీ.. నా కారు..ఎన్ని ఎన్నెన్ని వెధవ పనులు చేశామో  ..చేతులు కాలాయి..మూడు నిండు ప్రాణాలు..పోయాయి. పందులు కంటున్నాయి ..మనమూ కంటున్నాం.. మన వెధవకు ఎలాంటి శిక్ష పడినా నాకు ఎలాంటి బెంగా లేదు..వినడానికి నేనుండను..కనీసం మిగిలిన యిద్దరు పిల్లల్ని..పిల్లల్లా..పెరగనివ్వండి.. పిచ్చి ప్రేమతో పిల్లల్ని చంపుకోకండి. ఎంత ఖర్చయినా ఈ నా మరణ వాఙ్మూలాన్ని అన్ని పేపర్లలో ప్రకటించండి..అన్ని ఛానల్స్ లో..టెలి కేస్ట్ చేయించండి.

చివరిగా ఈ దేశ తల్లిదండ్రులకు నా విన్నపం.. అమ్మలూ నాన్నలూ!..దొడ్లో  మొక్కకు చీడ పట్టకుండా పెంచ గల్గితేనే నాటండి. పిల్లల బాగోగులు చూడ గలిగితేనే కనండి..డబ్బుందని అడ్డ దారుల్లో పెంచకండి. మనం పోస్తున్న..పిచ్చి ప్రేమలు..తొక్కుతున్న అడ్డ దారులు విషాన్ని కక్కుతున్న కాల నాగులని గుర్తించండి. చేతులెత్తి వేడుకుంటున్నాను..  కనే ముందు..నన్ను..నా రాక్షస బిడ్డ శ్రావన్ ను..మా చెత్త పెంపకాన్ని ఒక్క క్షణం స్మరించుకోండి...సెలవ్..

చివరి పదం చదువుతూనే..అమ్మా..అంటూ గుండె పట్టుకుని ..కూతురి ప్రక్కనే..ఒరిగి పోయాడు....అప్పటికే బ్లాక్ లిస్ట్ లో వున్న రోడ్స్ కాంట్రాక్టర్ ...కిశోర్.




రోజు లాగే సాయంత్రం అయిదింటికి రామ్మూర్తి గారు జగన్నాధం గారి ఇంటి కాలింగ్ బెల్ నొక్కారు. జగన్నాధం గారి భార్య రుక్మిణి గారు తలుపు తీసి కూర్చోండి వస్తున్నారు అని లోపలికి వెళ్ళిపోయింది. జగన్నాధం గారు డ్రాయింగ్ రూము లోకి రాగానే ఇద్దరికీ ఆవిడ రోజు లాగే కాఫీ తెచ్చి ఇచ్చారు. రామ్మూర్తి గారు రుక్మిణి గారు ఇచ్చే ఫిల్టర్ కాఫీ చాలా లైక్ చేస్తారు . కాఫీ తాగి ఇద్దరూ ఈవెనింగ్ వాక్ కి బయలు దేరారు

జగన్నాధం గారు రామ్మూర్తి గారి కంటే వయసులోనూ వృత్తి పరంగానూ కూడా సీనియర్. ఆయన ఈమధ్యనే హై కోర్టు జడ్జీ గా రిటైర్ అయ్యారు. రామ్మూర్తి గారు కాలేజి లో లెక్చరర్ గా రిటైర్ అయ్యారు. ఇద్దరి ఇళ్ళూ దగ్గర గా ఉండడం, ఇద్దరి పిల్లలూ

స్నేహితులు కావడంతో వారి మధ్య స్నేహం బాగా వృద్ధి అయింది.

చాలా కాలం నుంచి ఇద్దరూ కలిసి ఈవెనింగ్ వాక్ చేయడం జరుగుతోంది. రోజూ ఏదో విషయం మీద వాళ్ల ఇద్దరి మధ్యా చర్చ జరుగుతూ ఉండేది. జగన్నాధం గారికి బాగా పుస్తకాలు చదవడం అలవాటు. జడ్జీ గా ఆయన అనుభవాలు, ఆయన చదివిన వివిధ పుస్తకాలు దృష్ట్యా ఎక్కువగా ఆయన మాట్లాడడం రామ్మూర్తి గారు వినడం కద్దు.

ఆవేళ వాకింగ్ ప్రారంభించిన తరువాత, ప్రొద్దున్న చదివిన పేపరు విషయాలు గుర్తుకు వచ్చి రామ్మూర్తి గారు అన్నారు " ఈ మధ్యన వరకట్న వేధింపులు చాలా ఎక్కువ అయిపోయాయి. పెద్ద పెద్ద కట్నాలు ఇచ్చి పెళ్లి చేసినా పెళ్లి అయినతరువాత ఇంకా తెమ్మని వేధించడాలు ఎక్కువ అవుతున్నాయి" అన్నారు

" మీరు పేపర్లలో చదివే వాటికి వాస్తవంగా జరిగే వాటికి చాలా తేడా ఉంటుందండి" అన్నారు జగన్నాధం గారు

" అంటే పేపర్లలో వచ్చేవి వాస్తవం కాదంటారా?"

" మీకు వార్తలలో వచ్చేవన్నీ పోలీసు స్టేషన్లో నమోదు అయె ఎఫ్ఐఆర్ లు, లాయర్లు కోర్టులలో దాఖలు చేసే ప్లెయింట్ల ఆధారం గా ఉంటాయి. కాని చాలా మాట్లు వాస్తవాలు వాటికి చాలా విరుద్ధం గా ఉంటాయి"

"కానీ మీరు కేసుల మీద న్యాయ నిర్ణయాలు వాటిని ఆధారం చేసుకునే చేస్తారు కదా?"

" వాటితో ప్రారంభం అవుతుంది. కేసు ముందుకు వెళ్లిన కొద్దీ న్యాయ నిర్ణేతలకి వాస్తవంగా కేసులో జరిగిన విషయాలు అవగాహన లోకి వస్తాయి. వాటిని దృష్టి లో ఉంచుకుని లభ్యమయినసాక్ష్యాల అధారంగా తీర్పులు ఇవ్వడం జరుగుతుంది. అనుభవజ్ఞులయిన జడ్జీల చేతుల్లో ఎక్కువకేసుల్లో న్యాయం జరుగుతూనే ఉంటుంది. కానీ ఆ తీర్పులు ఇవ్వదానికి ప్రస్తుత కాలంలో చాలా సంవత్సరాలు పడుతోంది కాబట్టి ప్రజలు పేపర్లలో వచ్చిన వార్తల నే నమ్మి అభిప్రాయాలు ఏర్పరుచు కుంటారు." అన్నారు జగన్నాధం గారు కొంత వివరణ ఇస్తూ.

"కావాలనే లాయర్లు ప్లెయింట్లలో, వాస్తవాలు కానీ విషయాలు చేరుస్తూ ఉంటారా?" అన్నారు రామూర్తి గారు అలాంటి

సందర్భాలు ఊహించ లేక

" కొన్ని సందర్భాలలో న్యాయాన్ని డైరెక్ట్ గా పొందడం కష్టం అవచ్చు. అటువంటి సందర్భాలలో చటం లో ఉన్న వెసులుబాటు ఆధారం గా న్యాయాన్ని పొందాలని కొంత మంది ప్రయత్నించవచ్చు. అది పూర్తి గా ధర్మ మని చెప్పలేము"

" ఉదాహరణ ఇస్తే కాని అర్థం కాదేమో" అన్నారు రామ్మూర్తి గారు నవ్వుతూ

"ఈ మధ్యనే జరిగిన ఒక కేసు లో విషయాలు చెబుతాను. శేషగిరిరావు కి తల్లి తండ్రులు ఓ సంబంధం చూసి పెళ్లి చేశారు. అమ్మాయి జానకి తండ్రి చాలా డబ్బు ఖర్చు పెట్టి పెళ్లి చేశాడు. శేషగిరిరావు కి పెళ్ళికి ముందే ఒక అమ్మాయి తో సంబంధం ఉంది. పెళ్లి అయినా తరువాత దానిని దూరం చేయవచ్చని, శేషగిరి రావు తల్లి తండ్రులూ, శేషగిరి రావు కూడా అనుకున్నారు. అది అంట సులువుగా జరగలేదు. జానకి కి ఈ విషయం తెలిసి, ఆ అక్రమ సంబంధం వదులుకోమని లేకపోతే విడాకులు ఇచ్చేయమని ఒత్తిడి చేసింది. విడాకులకు శేషగిరిరావు సిద్ధ మాయాడ్యు కానీ, జానకి తండ్రి మొత్తం పెళ్లి ఖర్చులు, జానకి జీవితానికి ఆర్థిక భద్రతా అన్నీ దృష్టి లో పెట్టుకుని చాల పెద్ద మొత్తం అడిగాడు. అందుకు శేషగిరి రావు సిద్ధం గా లేడు.

ఆ స్టేజ లో జానకి తండ్రి ఒక లాయరు దగ్గరికి వెళ్లి పరిస్థితి వివరించాడు. లాయరు ఆయనకి చెప్పినదేమిటంటే, కేసు విషయాలు వాస్తవంగా జరిగినవే చెప్పి నెగ్గుకు రావడం కష్టమని, చట్టాలలో ఉన్న కొన్ని విషయాలని ఆధారం చేసుకుని మనకి రావాల్సిన డాబు త్వరగా రాబట్టు కోవచ్చు అన్నాడు. అయితే శేషగిరిరావు మీద ఏ మాత్రం సానుభూతి ఉన్నా ఆ మార్గం కష్ట మన్నాడు. ఎందుకంటే చట్టం లో ఉన్న కొన్ని నిబంధనలు వాడుకుంటే చట్టం ద్వారా శేషగిరి రావు కి చాలా కష్టం కలగా వచ్చు. అప్పుడు అయ్యో అని వెనక్కి వెళ్లడం కుదరక పోవచ్చు. అందుచేత మళ్ళీ బాగా ఆలోచించు కుని చెప్పమన్నాడు. మధ్యవర్తి ద్వారా శేషగిరి రావు నీ, అతని తల్లి తండ్రులని సంప్రదించినా ఉపయోగం లేక పోయింది. అప్పుడు గత్యంతరం లేక తమ లాయర్ కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసారు.

జానకి లాయర్, చట్టం లోని వరకట్నం వేధింపు నింబంధనలు ఆధారం గా శేషగిరి రావు నీ, అతని తల్లితండ్రులనీ కూడా కలుపుతూ ఎఫ్ ఐ ఆర్, ప్లేయింట్ తయారు చేస్తే, అందరినీ తీసుకె ళ్లి జైల్లో పడేశారు.

ఆ తరువాత కాళ్ళ బేరానికి వచ్చి. వీళ్ళు అడిగిన డబ్బు అంతా ఇచ్చి బయట పడ్డారు.వరకట్నం కేసులు మనము పేపర్లలో చదివే కేసులలో ఎక్కువ శాతం ఇలాంటివే." అని వివరించారు జగన్నాధం గారు " అర్థమయ్యిందా?" అన్నట్టు చూస్తూ.

" మరి వేధింపులూ అవీ జరిగినట్టు సాక్ష్యాలు ఇవ్వాలి కదా ?"

" అందుకే ఆ చట్టా లని ఆశ్రయిస్తారు. ముందు సాక్ష్యాలు అవీ అడగకుండా, బైలు కూడా ఇవ్వకుండా జైల్లో పడేస్తారు. ఆ స్థితి లో కోర్టు బయట సెటిల్ చేసుకుంటారు. అందుకే కొంత దుర్వినియోగం అవుతోందని గ్రహించి చట్టాన్ని మార్చడానికి కేంద్రం ప్రయత్నిస్తోంది "

వాళ్లిద్దరూ మాట్లాడుకుంటూ వాళ్ళు రోజు వెళ్లే పార్క్ రోడ్డుకు వచ్చారు. ఈ వేళ ఆ రోడ్డులో తారు వేస్తున్నట్టున్నారు, చాల దుమ్ముగా ఉండి రోడ్డుకు అడ్డం కూడా పెట్టారు. ఆ రోడ్డు వదిలి వాళ్ళు దానికి ఎదురు గా ఉన్న చాకలి పాలెం రోడ్డు లో నడవడం మొదలెట్టారు.

"అయితే లాయర్లు కేసులు నెగ్గడానికి, లేని విషయాలు కూడా తెలివి గా సృష్టిస్తారన్న మాట " అన్నారు రామ్మూర్తి గారు సంభాషణ కొన సాగిస్తూ

"కానీ కొన్ని మాట్లు అవి పనిచేసినా కొన్ని మాట్లు అవి బెడిసి కొడతాయి. కేసును లాయర్లు తిప్పిన మలుపులు జడ్జీలు సులువు గానే పట్టేస్తారు. కానీ పత్రికల వాళ్లకి, ప్రజలకి అవి తెలియవు. ఈ మధ్యన ఖోస్లా గారని ఓ రిటైర్డ్ జడ్జి గారి పుస్తకం చదవడం జరిగింది. ప్రజలు పేపర్లలో చదివి ఉద్రేకాలు తెచ్చుకున్న ఓ కేసులో ఆయన లాయర్లు చేసిన భాగోతం వివరించారు

" ఏమిటాకేసు ? అన్నారు రామూర్తిగారు కుతూహలంగా

" మీరు కూడా పేపర్లలో చదివే వుంటారు చాలా కాలం క్రితం . ఒక నేవల్ ఆఫీసర్ ఒక స్నేహితుడిని హత్య చేస్తాడు. పేపర్లలో వచ్చిన కథనం ఏమిటంటే, ఆ నేవల్ ఆఫీసర్ షిప్ మీద దూర దేశాలు వెడుతూ భార్యని మిత్రుడి ఇంట్లో వదిలి వెడతాడు. అతను తిరిగి వచ్చిన తరువాత భార్యకీ స్నేహితుడికి సంబంధం ఉందని తెలిసి, వస్తూనే, నేవల్ యార్డ్ కి వెళ్లి పిస్తోలు కలెక్ట్ చేసుకుని స్నేహితుడి ఇంటికి వెడతాడు. సంబంధం గురించి ఇద్దరి మధ్యా వాదోపవాదాలు జరుగుతాయి. అందులో భాగంగా , ఆ నేవల్ ఆఫీసర్ సరే అయిందేదో అయి పోయింది తన భార్యని వివాహం చేసుకో మని అడుగుతాడు. అందుకు ఆ మిత్రుడు " పరిచయం ఉన్న ప్రతి ఆడదాన్నీ పెళ్లి చేసుకుంటామా ? ( అసలు వాడిన పదం కొంచెం అసభ్యం గా ఉంటుంది) అని అంటే ఆ మాటకి ఉద్రేకపడి ఈ ఆఫీసర్ అతన్ని కాల్చేశాడు . ఇదీ కథ పత్రికలలో వచ్చింది. ప్రజలు అందరూ ఆ ఆఫీసర్ మీద సానుభూతి

కనబరిచారు. అతన్ని రెచ్చగొడితే ఉద్రేకంలో చేసాడు కాబట్టి అతని తప్పు లేదని అభిప్రాయం పడ్డారు"

" ఇంతకీ అతనికి శిక్ష పడలేదా?

"పడింది. అసలు జరిగిందేమిటంటే. ఆ ఆఫీసర్ కి ఆ మిత్రుడికీ ఏవో వ్యాపార లావాదేవీలున్నాయి. అందులో ఈ మిత్రుడు మోసం చేసి నట్టు ఆఫీసర్ కి తెలిసింది. ట్రిప్ ముంచి రాగానే నేవల్ యార్డ్ కి వెళ్లి పిస్తోలు కలెక్ట్ చేసుకుని మిత్రుడి దగ్గరికి వెళ్లి వాదనల మధ్యలో మిత్రుడ్ని కాల్చి చంపాడు. అతను పారసీ వాడు కాబట్టి పారసీ లాయర్లందరూ కలిసి అతన్ని బయట పడేయడానికి ప్లేయింట్ రాసినప్పుడు ఓ కథ అల్లారు. అదే పత్రికలలో వచ్చింది. కానీ పిస్తోలు కలెక్ట్ చేసుకోవడం అన్న అంశం వల్ల, మిగతా కేసు బలహీనత వల్లా శిక్ష పడింది. ఒక కేసు లో శిక్ష నిర్ణయించేట ప్పుడు జడ్జీలు చాలా విషయాలు దృష్టిలో ఉంచుకుంటారు" అన్నారు జగన్నాధం గారు ఎదో ఆలోచిస్తూ.

వాళ్ళు మాట్లాడుకుంటూ చాకలి పేట రోడ్డు చివరికి వచ్చారు. అక్కడ అన్నీ చాల చిన్న చిన్న ఇళ్ళు, ప్రభుత్వం వారు ఎప్పుడో ఇచ్చిన స్థలాలలో చాకలి వృత్తి వాళ్ళు మొదట, ఆతరువాత వాళ్ళదగ్గరనుంచి కొనుక్కుని కొంతం మంది దిగువ మధ్యతరగతి వాళ్ళు కట్టుకున్నవి ఉన్నాయి. వాటి అన్నిటి మధ్యన ఒక చాలా పెద్దదయిన నాలుగంతస్తుల ఖరీదయిన భవనం అన్ని రకాల హంగులు అమర్చి ఉన్నది వాళ్ళ దృష్టిని పడింది. మొదటి అంతస్తులో ఫ్లవర్ గార్డెన్, రెండవ అంతస్తు లో వరండాలో బయటికి కనబడుతున్న ఖరీదయిన ఉయ్యాల బల్ల మొదలయిన వాటితో, ఎవరిదో చాలా డబ్బు ఉన్న వాళ్ళ భవనం లాగ ఉంది.

వాక్ నుంచి వెనక్కి తిరుగుతూ జగన్నాధం గారు " ఆ భవనం చూశారా? అంత ఖరీదయిన భవనం ఆ చిన్న ఇళ్ల ల్లో వారిమీద ఎటువంటి ప్రభావం చూపు పుతుందంటారు?" అన్నారు.

" కొంత మంది తమ తమ రొటీన్ జీవితం లో పట్టించుకోక పోవచ్చునేమో కాని చాలా మంది మీద ఒక నెగటివ్ ప్రభావం తప్పకుండా పడుతుంది. ఎదురుగా కనపడే విలాస వంతమయిన జీవితం చూస్తూ అలాంటివి తాము పొందడానికి వీలున్నంతలో ప్రయత్నాలు చేసినా, అవి పొందే అవకాశం ఏమాత్రం లేని సందర్భాలలో వాళ్లకు తెలియ కుండానే ఒక రకమయిన నిస్పృహ వాళ్లలో ప్రవేశించ వచ్చు. ప్రత్యక్షంగా కాక పోయినా పరోక్షంగా కొంత ప్రభావం ఉండా వచ్చు" అని తన అభిప్రాయం చెబుతూ ఇంతకీ "ఆ ఇల్లు ఎవరిదీ ?" అన్నారు రామ్మూర్తి గారు

"మీరు ఈ మధ్య పేపర్లలో చూసే ఉంటారు. రాజరత్నం గారని ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ "

"ఓ! ఆయనదా !.గతం లో ఓ వారం రోజులు టీవీ లోనూ, పత్రికల లోనూ ఆయన అక్రమ సంపాదన మీద హోరెత్తిపోయింది కదా. ఈ మధ్యనే కదా జడ్జిమెంట్ వచ్చింది. జడ్జిమెంట్ మీద చాలా చర్చ జరిగింది. అటువంటి కేసులలో మామూలుగా రెండు సంవత్సరాలు కంటే వేయరు. కాని చట్టం లో ఉన్న మొత్తం పది సంవత్సరాల శిక్ష ని ఎందుకు విధించారో చాలా మందికి అర్థం కాలేదు. మీరు ఇందాకా చెప్పిన కేసులలో లాగ ప్లేయింట్ లో కథలు చేర్చడం కుదరలేదు కాబోలు తప్పించుకోవడానికి. అయినా మీరు కూడా చాలా జడ్జిమెంట్లు ఇచ్చారు కదా? అలా ఎందుకు వేశారో మీకు బాగా తెలిసుండాలె?

ఆ తీర్పు ఇచ్చిన బెంచ్ లో తానూ ఉన్నట్టూ, తన నిర్ణయాన్ని మిగతా సభ్యులు అందరూ ఆమోదించారన్న విషయాన్ని జగన్నాధం గారు రామ్మూర్తి గారికి చెప్పలేదు.

" ఇప్పుడు రాజారత్నం గారి ఇల్లు, ఆ పరిసరాలూ చూసిన తరువాత తీర్పు అలా ఎందుకు ఇచ్చారో ఊహించండి " అన్నారు నవ్వుతూ.




మా అమ్మ చిన్న నాటి స్నేహితురాలు లీల ఆంటీ మరణ వార్త ఆలస్యంగా తెలియడముతో తెలిసిన వెంటనే వైజాగ్ నుండి బయలు దేరి హైదరాబాద్ లో ఉన్న లీల ఆంటీ ఇంటికి నేను, అమ్మ చేరుకున్నాను. ఆ రోజు ఆదివారం కావడంతో వాసు అంకుల్ వాళ్ళ పిల్లలు రోజ, శ్రీను ముగ్గురు ఇంటి వద్దనే ఉన్నారు. మమ్మల్ని చూడ గానే ముగ్గురూ దుఃఖం ఆపుకో

లేక ఏడ్చేశారు. పిల్లలిద్దరూ అమ్మని గట్టిగా వాటేసుకుని విడువనే లేదు.

'' అసలు ఎలా ఇలా జరిగింది, లిల ఆరోగ్యం గానే ఉంది కదా, రెండు నెలల క్రితం నేను తనతో మాట్లాడాను, అప్పుడు నాతో తను ఏమీ చెప్పనే లేదు, నేను కంపెనీ ప్రాజెక్ట్ పని మీద ఏడాది క్రిందట అమెరికా వెళ్ళాను, నిన్ననే ఇండియా వచ్చాను, ప్రాజెక్టు చివరి దశలో ఉండడం వలన గత నెల రోజులు గా ఎవరి తోనూ మాట్లాడ లేనంత పనిలో మునిగి పోయాను, వచ్చిన వెంటనే విషయము తెలిసి ఆశ్చర్య పోయాను. వెంటనే బయలు దేరి వచ్చేశాను, అసలు ఏమైంది వాసు గారు '' అని అమ్మ ఒకటే ప్రశ్నల వర్షం కురిపించింది . ''మాకు విషయము తెలిసే సరికే డాక్టర్లు ఏమి చెయ్య లేమని చెప్పేసారు, తనకి కేన్సర్ చివరి దశ, తెలిసిన వారు చెప్పిన డాక్టర్లు అందరికీ చూపించాను, ట్రీట్ మెంట్ చేయించాను, కానీ అంతా నెల రోజుల లోనే ముగిసి పోయింది'' అని వాసు గారు బోరున విలపించారు. వింటున్న మాకు బాగా ఏడుపు వచ్చింది. ఇంకా ఏడవ డానికి కన్నీళ్లే లేవన్నంతగా అందరమూ ఏడిచాము.

తరువాత లోపలికి వెళ్ళిన నాకు ఇల్లు చూస్తే ఒక్క సారిగా భయం వేసింది. ఆడది లేని ఇల్లు ఇలా ఉంటుందా అని అనిపించింది. గదులలో ఎక్కడ విడిచిన బట్టలు అక్కడే పడి ఉన్నాయి. ఏవి విడిచినవో, ఏవి ఉతికినవో అర్ధం కావడం లేదు. పక్క బట్టలు అలానే ఉన్నాయి. వంట గదిని చూస్తే అది స్టోర్ రూమ్ లా ఉంది. పొయ్యి మీద బాగా జిడ్డు పేరుకు పోయి ఉంది, గట్టు మీద చీమలు తిరుగు తున్నాయి, క్రింద గచ్చు కాళ్ళకు అతుక్కు పోతుంది. ఇంకా డైనింగ్ టేబుల్ గురించి చెప్పనక్కర్లేదు, బయట నుండి తెచ్చుకున్న పొట్లాల కవర్లు, కాగితాలు అన్నీ అక్కడే పడి ఉన్నాయి. టేబుల్ తుడిచి ఎన్ని రోజులయ్యిందో అని అనుకున్నాను. రోజ ని పిలిచి'' ఏమిటమ్మా ఇల్లు ఇలా ఉంది పనమ్మాయి రావడము లేదా'' అని అమ్మ అడిగింది ,''ఏమో ఆంటీ నాకు తెలియదు'' అని సమాధానం ఇచ్చి వెళ్లి పోయింది. ఆ మాట విన్న వాసు గారు ''హైదరాబాదు లో పని వాళ్ళ గురించి మీకు తెలియనిది ఏముంది, దొరకడమే కష్టము, ఒక వేళ దొరికినా సమయానికి రారు, వాళ్ళు వచ్చిన సమయానికి మేము ఇంట్లో ఉండము, లిల ఉంటే తానే చూసుకునేది, ఎన్ని రోజులని నేను ఆఫీసుకి సెలవు పెట్టి ఇంట్లో ఉంటాను, ఈ రోజు ఆది వారము కదా ఎవరైనా దొరికితే పని చేయిద్దామని చూస్తున్నాను'' అని బయటికి చూస్తున్న వాసు గారి తో ''మరి వంట ఎవరు చేస్తున్నారు'' అని అడిగింది. ''ఏముంది మూడు పూటలా బయట నుండి తెచ్చుకుని తింటున్నాము'' అని విరక్తిగా సమాధానము ఇచ్చిన వాసు గారితో ''అదేమిటి రోజికి ఏమీ చేయడము రాదా?'' అని అడిగింది.''రోజినా! అది ఇంకా చిన్న పిల్ల తన కేమి తెలుస్తుంది, మీకు టిఫిన్ తెస్తాను ఉండండి'' అని చెప్పి బయటకి వెళ్ళి పోయారు అంకుల్.

ఇవి అన్నీ వింటున్న నాకు ఒక్క సారిగా తల తిరిగినట్లు అనిపించింది. మా అమ్మ ఎప్పుడూ నన్ను ఆ పని చెయ్యి, ఈ పని చెయ్యి అని చెబుతుంటే విసుక్కునే దాన్ని. ఎందుకమ్మా అలా ఏదో ఒక పని చెబుతూనే ఉంటావు పెళ్లయ్యాక నీలా ఎలాగూ చెయ్యక తప్పదు కదా! అప్పుడు చేస్తాలే ఇప్పుడు వదిలేయ్ నన్ను అని అనే దాన్ని .కాని మా అమ్మ అలా కాదు ని పనులు నీవే చేసుకోవాలి, ఎవరి మీద ఆధార పడ కూడదు, అన్ని పనులూ నీకు వచ్చిఉండాలి, బాధ్యతగా అన్నీ చేసుకోవాలి అని నాకు పనులు నేర్పించింది. అయిష్టంగానైనా కొన్ని పనులు నేర్చుకున్నాను. మా అమ్మ పని చెప్పిన ప్రతీ సారీ నేను విసుక్కోవడం అయిష్టంగా చేయడం మా అమ్మ నాకు నచ్చ చెప్పడము అన్నీ ఒక్క సారిగా నా కళ్ళ ముందు కదలాడాయి. రోజీ ఇంజనీరింగు

మొదటి సంవత్సరము, శ్రీను పదవ తరగతి చదువుతున్నారన్న మాటే గాని వాళ్ళిద్దరికి ఏమీ తెలియదు, ఆశ్చర్యకరమైన విషయము ఏమిటంటే రోజి కి తను వేసుకో వలసిన బట్టలు ఎక్కడ ఉన్నాయో, ఏవి వేసుకోవాలో కూడా తెలియదు. ఏది అడిగినా ఏమో ఆంటీ నాకు తెలియదు, అన్నీ మా అమ్మే చూసుకుంటుంది అని ఒకే ఒక్క సమాధానం చెబుతుంది. తెలిసిందల్లా కాలేజి కి వెళ్ళడం, రావడం.. అంతే అది తప్ప ఇంకేమీ తెలియదు.

లీల ఆంటీ పిల్లలిద్దరికీ ఏ పని నేర్పకుండా, చెప్పకుండా అన్నీ తనే చేసిపెట్టేది అంట, వాళ్ళకు బ్రష్ ల దగ్గర నుండి పడుకునే పక్క దుప్పట్ల వరకూ అన్నీ తనే వాళ్ళకు ఏ ఇబ్బంది రాకుండా చూసుకునేదంట. తను ఉన్నన్నాళ్లు బాగుండేది, తను పోగానే ఒక్క సారిగా ఇల్లు ఎలా అయి పోయిందో, వాసు అంకుల్ కి అన్నీ కాళ్ళ దగ్గరికి తెచ్చి పెట్టేదంట. ఒక సారి అమ్మ ఇవన్నీ గమనించి లీల అంటీని అడిగిందంట ''ఎందుకే అన్ని సేవలు చేస్తావు, కాస్త వాళ్ళ పని వాళ్ళని చేసుకో నివ్వు'' అని .'' పోనీ లేవే ఆయన పొద్దున్న నుండి ఆఫీసు లో కష్ట పడి వస్తారు ఆ మాత్రం చేస్తే అలిసి పోతానా ఏంటి, ఇంకా పిల్లలంటావా వాళ్ళు చదివి, చదివి అలిసి పోయి వస్తారు, ఇంకేం చేస్తారు? నేను ఎటూ ఇంట్లోనే ఉంటాను కదా'' అని చిరు నవ్వు తో సమాధానం ఇచ్చిందంట. ఆ మాట నాకు చెబుతూ లీలా ఆంటీ గుర్తుకు వచ్చిందేమో అమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

వాసు అంకుల్ తో అమ్మ" రోజి కి అన్నీ నేర్పించండి, తను ఇంకా చిన్న పిల్ల కాదు, ఇలా అయితే కష్టము" అని, చాలా విషయాలు చెప్పింది. అన్నింటికీ అంకుల్ సరే అని అన్నారు ఏమో ఏమి చేస్తారో మరి, పాపం రోజి ని తలుచు కుంటే బాధ అనిపించింది నాకు, ఇన్నాళ్ళు ఏ కష్టము తెలియ కుండా పెరిగింది, ఇప్పుడు బాధ్యతలన్నీ ఒక్క సారిగా మీద పడే సరికి ఎలా ఉక్కిరి బిక్కిరి అవుతుందో పాపం. అమ్మో! నేను మాత్రం మా అమ్మ చెప్పినట్లు అన్నీ నేర్చుకుంటాను. పని చేయ వలసిన అవసరం ఉన్నా లేక పోయినా ముందు నేర్చుకోవాలి. ఏ సమయానికి ఏ అవసరం వస్తుందో, ఏ బాధ్యత నెత్తి మీద పడుతుందో, అమ్మ చెబుతుంటే తేలికగా తీసుకున్నాను, రోజి పరిస్థితి చూశాక అర్ధమయ్యింది నాకు పెద్దలు, అమ్మ ఏది చెప్పినా మన మంచికే చెబుతారు అని.




తెల తెల వారుతోంది.

"రాణీ!"

"ఊ"

"నేను డ్యూటీలి వెళ్ళాలి. నువ్వు లేచి తలుపేస్కో" కొత్త పెళ్లాన్ని నిద్ర లేపాడు పుష్పశర్.

రాణి బద్ధకంగా లేచి తలుపు తీసింది. చల్లని గాలి ఆమె ఆపాద మస్తకాన్నీ స్పృశించింది. అత్తిపత్తిలా ముడుచుకుపోయింది. పుష్పశర్ ఆమె నుదుటన చుంబించి అల్లరిగా నవ్వి బయటకెళ్లిపోయాడు. ఆమె తలుపేసొచ్చి..మంచం మీద వాలినప్పుడు గుర్తొచ్చింది, ఆరోజు తమ మొదటి సంవత్సరపు పెళ్లి రోజని. నిన్న రాత్రే గుర్తు చేద్దామనుకుంది. ఎప్పుడో పొద్దు పోయి, అలసి

పోయి వచ్చిన అతను స్నానం చేసి వచ్చే సరికి డైనింగ్ టేబుల్ మీద అన్నీ సిద్ధం చేసింది. అతను ఆవురావురుమని తినడంలో మునిగి పోయాడు. పడుకునేటప్పుడు చెప్పాలనుకుంది. కానీ తను వెళ్లే సరికే ఆద మరిచి నిద్ర పోయాడు. ఇప్పుడు వెళ్లేప్పుడు కూడా చెప్ప లేక పోయింది. ప్చ్! ఆమె గతం లోకి జారుకుంది.

*****

"అమ్మాయ్ నీకో పెళ్లి సంబంధం వచ్చిందిరా! అబ్బాయి ఫారెస్ట్ ఆఫీసరు. మంచి ఒడ్డూ పొడుగుంటాడట, చక్కటి సంపాదన, అడవన్న మాటే గానీ పోరూ పొక్కూ ఉండదు. తిన దగినవన్నీ అడవి లోనే తాజా, తాజాగా దొరికేస్తాయి. పొల్యూషన్ ఉండదు. కాక పోతే సిటీ లైఫ్ మిస్సవుతావు. ఈ మల్టి ప్లెక్సులు, షాపింగ్ మాల్స్ ఉండవు. కొంత బోరు కొట్టినా కొట్టొచ్చు. కానీ నాకెందుకో నువ్వు అతన్ని చేసుకుంటే హాయిగా ఉంటావనిపిస్తోంది. నేను వాళ్లని పెళ్లి చూపులకు పిలిచేశాను. మూడు గంటలకు వస్తారు. నువ్వు తయారై సిద్ధంగా ఉండు. అతన్ని చూశాక నీ నిర్ణయం చెప్పు. నా బలవంతమేం లేదు" నవ్వుతూ అన్నాడు తండ్రి శశాంక్.

"ఊర్కోండి, గతి లేక పెళ్లి చేసినట్టు అమ్మాయిని అడవులకు పంపుతారా? రేపు పెళ్లయ్యాక పాపం అడవిలో బిక్కు బిక్కు మంటూ ఉంటుంది. దానికేం ఖర్మ? మన చుట్టు పక్కల మంచి సంబంధం చూద్దురు గాని. వాళ్లను రావద్దని చెప్పండి."అంది మాతృ మమకారంతో సరోజ.

"పెళ్లి చూపులు కానివ్వవోయ్! అమ్మాయికి నచ్చక పోతే తెలుగు సినిమాల్లోని విలన్ లా మెడలొంచి అమ్మాయి పెళ్లి చేస్తానా ఏం?"నవ్వుతూ భార్య వంక చూశాడు.

అమ్మానాన్నలంటే తన కెంతో అభిమానం. ఎప్పుడూ మాట అనుకుని ఎరగరు. ఒకళ్ల కోసం ఒకరు పుట్టినట్టుగా ఉంటారు. ఒక్కగా నొక్క కూతుర్నైన తననూ ఏ లోటూ లేకుండా పెంచి పెద్ద చేశారు.

*****

మధ్యాహ్నం మూడు గంటలు.

ఇంటి ముందు కారాగింది.

అబ్బాయి వాళ్లమ్మా నాన్నలతో దిగాడు. మనం సినిమా యాక్టర్లు అందగాళ్లనుకుంటాం గాని, ఏ మేకప్ లు లేకుండా సహజంగా అందంగా ఉండే వాళ్లు బయట చాలా మందే ఉంటారు. పుష్పశర్ ను చూడం గానే రాణికి అనిపించిన ఆలోచన అది.

చూపులు, లైట్ గా తినడం అయ్యాక "నేను ఒకసారి మీ అమ్మాయితో మాట్లాడాలనుకుంటున్నాను. మీరు అనుమతిస్తే.." అన్నాడు పుష్పశర్.

శశాంక్ అంగీకరించినట్టుగా తలూపి "రాణీ, అబ్బాయిని టెర్రెస్ మీదకు తీసుకెళ్ళు."అన్నాడు.

రాణి వెనకే పుష్పశర్ అడుగులేస్తూ టెర్రెస్ మీదకు చేరుకున్నాక" ఏవండోయ్, పెళ్ళిలో నా వెనగ్గా ఏడడుగులు నడుస్తారు. పెళ్లికి ముందు మీ వెనక నడిపించడం మీ సంప్రదాయమా?" అమాయకత్వాన్ని నటిస్తూ చిలిపితనం మాటల్లో రంగరించాడు.

రాణి సిగ్గు పడి పోయింది.

"చూడండి, నేను ఫారెస్ట్ ఆఫీసరుగా చేస్తున్నానన్న విషయం మీకు తెలిసే ఉంటుంది. బహుశా అందుకేనేమో నాకు పెళ్లి సంబంధాలు గొప్పగా రాలేదు. మీ సంబంధం వచ్చింది. మీరూ నచ్చారు. మీరు బాగా ఆలోచించుకోండి. ఏ సాఫ్ట్ వేర్ అతన్నన్నా పెళ్లి చేసుకుంటే సిటీలో మంచి ఫ్లాట్ తీసుకుని వీకెండ్స్ లో అలా..అలా సరదాగా మిమ్మల్ని తిప్పుతూ స్వర్గాన్ని మీ పాద అంచులకు చేరుస్తాడు. నేను మిమ్మల్ని పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను గాని. అడవి లోనే మిమ్మల్ని ఉంచుతాను. మీరు నన్ను రాక్షసుడు అనుకో కూడదు. మిమ్మల్ని రక్షించడానికి ఏ రాకుమారుడూ రాడు. ఎందుకంటే నేను మీకు నచ్చితే మన పెళ్లై పోతుంది కాబట్టి."అన్నాడు చిన్నగా పాల నురగ లాంటి చిరు నవ్వు ఒలక బోస్తూ.

ఆ అందం, చిలిపి తనం..ఓహ్ నచ్చేశాడు. పుష్పశర్ రాణికి నచ్చేశాడు.

అదే విషయం తండ్రికి చెప్పేసింది.

దగ్గర్లోని మంచి ముహూర్తంలో వాళ్లిద్దరూ ఒక్కటయ్యారు. అడవికి కాపరానికి పయనమయ్యారు.

*****

రక రకాల పక్షులు జంతువులు ఎంతో ఆహ్లాదంగా ఉంది. ఏది తీసుకున్నా, తిన్నా స్వచ్ఛతే! పండు వెన్నెలైనా, వర్షమైనా చాలా ప్రత్యేకంగా ఆహ్లాదంగా ఉండేది.

గూడెం లోని వాళ్లు చూపించే ఆత్మీయత, కల్మషం లేని వాళ్ల ప్రవర్తన ఎంతో బావుండేది. ఇహ పుష్పశర్ అయితే తనను కాలు కింద పెట్ట నీయడు. రతీ దేవిని మన్మధుడు ఎలా చూసుకున్నాడో ఏ పురాణాల్లో చదవ లేదు, విన లేదు కాని పుష్పశర్ మాత్రం గుండెల్లో తనకో గుడి కట్టేసుకున్నాడు. పుష్పశర్ కు ఉద్యోగమంటే ప్రాణం. డ్యూటీకెళ్లిన వాడు మళ్ళీ ఇంటికెప్పుడొస్తాడో తెలియదు. వచ్చాడంటే ఇహ తనే లోకం.

*****

దూరంగా ఏనుగు గట్టిగా ఘీంకరించడంతో ఆలోచనలకు ఫుల్ స్టాప్ పెట్టి లేచి తలార స్నానం చేసి, కొండ దేవత గుడి కెళ్లి తమ ఇద్దరి పేరు మీద పూజ చేయించుకుని కాసేపు కుందేళ్లతో, లేళ్లతో ఆడుకుని ఇంటికొచ్చింది.

పుష్పశర్ మధ్యాహ్నం భోజనానికి ఇంటికెలాగూ రాడు. అందు చేత నాలుగు పళ్లు తిని పాలు తాగింది.

సాయంత్రం చక్కటి చీర రవిక తొడుక్కుని, పూల మాల తలలో తురుము కుని అతని కోసం ఎదురు చుస్తూ కూర్చునుంది. నిండు పున్నమి చంద్రునికి తన బాధ్యత అప్పగించి సెలవు తీసుకుంది సాయం కాలం. వెన్నెల విరగ కాస్తోంది. 'పుష్పశర్ ఎప్పుడొస్తాడో, అసలు తమ పెళ్లి రోజని అయ్య గారికి గుర్తుందో లేదో' మనసులో నిట్టూర్చింది.

ఏడు గంటలు... ఇంటి ముందు జీప్ ఆగింది. పుష్పశర్ దిగీ దిగడం తోటే 'పద రాణీ, నిన్నివాళ ఒక చోటికి తీసుకెళతాను. మన పెళ్లి రోజు ని మనసులో నిలిచుండే మధుర స్మృతి చేస్తాను"అని హడావుడి పెట్టాడు.

రాణి మనసు పురి విప్పిన మయూరమైంది.

గబ గబ జీప్ ఎక్కింది.

గంట ప్రయాణం చేశాక తామరపూలతో నిండి శోభాయ మానంగా ఉన్న ఒక కొలను దగ్గర జీపుని ఆపాడు.

"రాణీ, దీని పేరు సుధా నిధి కొలను. ఇందులో స్నానం చేస్తే తనువూ, మనసూ పులకరించి పోతాయంటారు. పద దిగి స్నానం చేద్దాం' అన్నాడు.

ఇద్దరూ దిగి స్నానం చేశారు. విచిత్రం శరీరంలో రక్తం స్థానంలో మరేదో ఉత్ప్రేరకం ప్రవహిస్తున్న అనుభూతి. మనసులు మత్తిల్లుతున్నాయి.

"పద మనం మళ్లీ ప్రయాణించాలి"అని జీపెక్కించి ఓ పావు గంట ప్రయాణించాక ఒక కొండ దగ్గర ఆపాడు.

"రాణీ, దీని పేరు రతి కేళి గిరి, కొత్తగా పెళ్లైన ఆటవిక జంటను ఇక్కడికి పంపిస్తారు. మూడు రాత్రుల ముచ్చటయ్యాక వాళ్లు గూడెం చేరుకునేవారు. ఆ సంవత్సరమే వాళ్లకో పాప పుట్టేదట. దీనిలో చాలా ప్రత్యేకత లున్నాయి. పద మనం లోపలికి వెళుతుంటే, నడుస్తూ చెబుతా" అని ఆమె చెయ్యందుకుని కొండ అంతర్భాగానికి తీసుకెళుతూ, సంభోగ క్రియలో ఉన్న వాళ్లని ఎవరూ డిస్టర్బ్ చెయ్య కూడదన్నది ప్రకృతి నియమం అని నీకు తెలుసుగా, అందుకే క్రిమి కీటకాదులు, జంతువులూ ఇందులో ప్రవేశించవు. మనం ఇందు లోకి ప్రవేశించ గానే శిఖరం పైన ఒక దీపం వెలుగుతుంది అది చూసిన ఏ ఆటవికులూ ఇందు లోకి రారు. గమనించావా ఇందులో చంద్ర కిరణాలు ఎలా అన్ని వైపుల నించి ప్రసరిస్తున్నాయో? అంతా కాంతి వంతంగా ఉంది కదూ. ఈ సువాసనలు గననించావా? అవి ఎక్కడి నుంచి, ఏ పూల నుంచి వస్తున్నాయో ఎవరూ చెప్పలేరు. అసలు ఈ కొండ సృష్టి విచిత్రం. చాలా మందికి తెలియని ఓ రహస్యం. నేను నచ్చి నాకో కొండ దేవర చెప్పాడు.' అన్నాడు.

"ఇదిగో ఈ చెట్టుకున్న రెండు కాయలు తింటే రాత్రంతటికీ మనిద్దరికీ కావలసిన శక్తి సమకూరి, తాంబూలం వేసుకున్న అనుభూతి కలుగుతుంది" అన్నాడు మత్తుగా.

ఇద్దరూ మధురమైన రుచితో సుగంధ భరితంగా ఉన్న ఆ పళ్లను తిన్నారు.

రాణీ మనసు మైమరచి పోతోంది. ఒళ్లంతా ఏవిటో చెప్పలేని దివ్య అనుభూతి.

అక్కడే ఉన్న ఒక రాయి మీద సన్నటి గడ్డి ఒత్తుగా ఉంది. చుట్టూ గడ్డి పూల మొక్కలు. "రాణీ అదే మన కామ కేళి పాన్పు" అన్నాడు.

అంతే.. వివశత్వంతో ఆమె అతని మీద సోలి పోయింది. అతను కూడా ఆమెని పొదివి పట్టుకుని ముద్దులు ముద్రిస్తూ ముందుకు సాగి పోతున్నాడు. ఆచ్ఛాదనలన్నీ వాటికవే తొలగిపోయి దారినేర్పాటు చేస్తున్నాయి. ఆ రాత్రి వాళ్లిద్దరి జీవిత పుస్తకంలో బంగారు పుటగా చోటు చేసుకుంది.

'అను క్షణం డబ్బు యావలో శృంగారాన్ని, సెక్స్ గా యాంత్రికం చేసుకునే సిటీ లోని కుర్రాడ్ని పెళ్లి చేసుకో కుండా, ప్రకృతితో సహ జీవనం చేస్తూ, మమేకమవుతూండే పుష్పకర్ ను పెళ్లి చేసుకోవడం వల్ల ఇలాంటి అద్భుతం సొంతం చేసుకునే అదృష్టం తనకు దక్కింది. జన్మ జన్మలకీ గుర్తుండి పోయే మనో యవనికపై సుఖ ముద్రిక ఇది' మనసులో అనుకుని పుష్పకర్ ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని బుగ్గలపై ముద్దులు ముద్రించింది రాణీ.




“నాన్నా..! హిమ, అమ్మమ్మతాతయ్యా..! అంటూ జ్వరంతో కలవరిస్తోంది. నాకు భయంగా ఉంది.. ఒక సారి రా..! నాన్నా..!!” అంటూ తన కూతురు రవళిక ఫోన్ చేసేసరికి అప్రయత్నంగా కాశీనాథం కళ్లు చెమ్మగిల్లాయి.

గత మాసం వియ్యంకులిద్దరూ హిమజను చూడ్డానికి వేసవి సెలవుల్లో వెళ్ళినప్పుడు జరిగిన సంఘటన కాశీనాథం కళ్ళల్లో కదలాడ సాగింది.

***

హిమజ కాశీనాథం మనవరాలు. ముద్దుగా ఇంట్లో ‘హిమ’ అని పిలుచుకుంటారు.. యు.కే.జి. పూర్తయ్యింది.. ఫస్ట్ క్లాసులో చేరబోతోంది.

తాతయ్య అంటే ఏ తాతయ్య అని మళ్ళీ మళ్ళీ అడిగే అవసరం రాకుండా.. కాశీనాథంను అమ్మమ్మతాతయ్య.. అతడి వియ్యంకుడు నాగభూషణాన్ని నానమ్మతాతయ్య అని పిలుస్తుంది హిమజ.

ఆవాళ కాశీనాథం “బావగారూ మనం ఈ రోజు హిమజకు జూపార్క్ చూపిద్దాం..” అంటూ ప్రపోజల్ పెట్టాడు.

“ ఆ..! ఎందుకులే బావగారూ.. చిన్న పిల్ల అదేం తిరిగి చూస్తుంది?.. పైగా డబ్బు దండగ” అంటూ ఆదిలోనే హంసపాదు నాటాడు నాగభూషణం. కాశీనాథం చిరునవ్వు నవ్వాడు ‘ఫరవాలేదు మేము వెళ్తాం..’ అన్నట్లుగా.

హిమజ దూరంగా కూర్చొని కాశీనాథం గీచి చూపించిన బొమ్మను కాపీ చేస్తోంది.

కాశీనాథం హిమజ వద్దకు వెళ్లి హిమజ గీచిన బొమ్మను చూసి మెచ్చుకున్నాడు. షేక్ హ్యాండ్ ఇచ్చాడు. హిమజ సిగ్గు మొగ్గయ్యింది.

“జూకు వెళ్దాం పదరా..” అంటూ హిమజ చెయ్యి పట్టుకొని లేచాడు.

నాగభూషణం విసుక్కుంటూ వారిని అనుసరించాడు.

ముగ్గురు కలిసి బస్సులో బయలు దేరారు..

ప్రక్క సీట్లో కూర్చున్న అమ్మాయి ఉన్నఫళంగా ఏడుస్తోంది.

నాగభూషణం “వెధవ సంత..” అంటూ అమ్మాయి వంక గుడ్లురిమి చూసాగాడు.

కాశీనాథం అరా తీసాడు.

“నా పర్సు ఎవరో కొట్టేసారు తాతయ్యా.. బస్సు చార్జీలు లేవు..” అంటూ భయపడుతూ చెప్పింది.

“భయపడకమ్మా.. ఎక్కడికెళ్ళాలి?..” అని ఓదార్పుగా అడుగుతూ కొన్ని డబ్బులిచ్చాడు కాశీనాథం.

“అంతా నాటకం బావగారూ.. డబ్బు లాగే యత్నం.. మీరివ్వకండి..” అంటూ నాగభూషణం చేతితో సైగలు చేసాడు. ‘పోనీలే..’ అన్నట్లుగా వున్న కాశీనాథం మోము అతడికి పిచ్చిమాలోకంలా గోచరించింది. నుదురు సుతారముగా నొక్కుకుంటూ బస్సు కిటికీలో నుండి బయటికి చూడసాగాడు నాగభూషణం.

హిమజను మధ్య మధ్యలో ఎత్తుకుంటూ జూ అంతా కలియ తిరిగాడు కాశీనాథం. నెమళ్ళు, కోతులు, జింకపిల్లల ను చూస్తూ ఆమె పొందే ఆనందంతో కాశీనాథం అలసట మర్చిపోయాడు.

ఇక ఆ రోజు నుండి హిమజ కాశీనాథానికి మరింత మాలిమి అయ్యింది. నిద్దట్లో సైతం పైన చెయ్యి వేసి పడుకునేది. ఉన్న పది రోజులూ పది క్షణాలైన వదిలి పెట్టేది కాదు. బస్సులో సంఘటన పదే పదే గుర్తుకు వచ్చేది.. వేసవి డాన్స్ కోచింగ్ క్లాసులో దిగబెట్టాలన్నా అమ్మమ్మ తాతయ్య తోడు రావాలనేది.. నానమ్మతాతయ్య వద్దు అంటూ మారాం చేసేది.. నాగభూషణం గుర్రుగా చూసేవాడు.. కాశీనాథం సర్ది చెప్పే వాడు. రవళిక ఆశ్చర్య పోయేది.

***

ఇంటికి తిరిగి వచ్చిన రెండు రోజుల్లోనే రవళిక నుండి ఫోన్ రావడం కాశీనాథాన్ని కలవర పర్చింది. వెంటనే రెక్కలు కట్టుకొని హిమజ ముందు వాలాడు.

కాశీనాథాన్ని చూడగానే “అమ్మమ్మతాతయ్యా..” అంటూ వాటేసుకుంది హిమజ జ్వరం కాస్తా తుర్రున పారిపోయినట్లు..

“ నాపిచ్చితల్లి..” అంటూ హిమజ బుగ్గలపై ముద్దుల వర్షం కురిపించాడు కాశీనాథం.

హిమజ మళ్ళీ బస్సులో జరిగిన సంఘటన చెప్పసాగింది.. ఎదురుగా నాగాభూషణం లేడనే ధైర్యంతో..

“అ రోజు బస్సు నుండి మనం దిగుతుంటే అమ్మాయి పర్సు నానమ్మతాతయ్యకు దొరికింది.. నేను చూశా.. దొరికితే తిరిగి ఇచ్చేయాలి కదా అమ్మమ్మతాతయ్యా..? .. అందుకే నానమ్మతాతయ్య కచ్చి..

నువ్వు ఇక్కడే ఉండిపో.. నన్ను వదలి పెట్టి పోవద్దు” అంటూ కన్నీళ్ళు పెట్టుకోసాగింది. రవళిక కొయ్యబారి పోయింది.

“చిన్న పిల్లల ముందు తప్పు చేయొద్దమ్మా.. పసి మనసుపై పడిన ముద్ర తుడిచేయడం చాలా కష్టం. పిల్లల ముందు మన ప్రవర్తన ఆదర్శప్రాయంగా ఉండాలి” అంటూ రవళికకు జాగ్రత్తలు చెప్పసాగాడు.

తను మాత్రమే చూసాడనుకున్న పర్సు విషయం హిమజ సైతం పసిగట్టిందన్న వాస్తవం కాసినాథాన్ని కలవర పర్చింది.

ఇంతలో నాగభూషణం దగ్గరి నుండి ఫోన్..

హిమజ ఎలా ఉందంటూ వాకబు చేస్తున్నాడు. హిమజ ముందు మాట్లాడడం బాగుండదని వేరే గదిలోకి వెళ్ళాడు కాశీనాథం.

“బావగారు నమస్కారం. ఆరోజు బస్సులో మీ కాలి క్రింద పడిన పర్సును మీరే తీసుకున్నారని హిమజ అపోహ పడింది. నిద్దట్లో.. బస్సులో పర్సు.. బస్సులో పర్సు.. అంటూ కలవరిస్తోంది. పర్సు మీరు తీయలేదని కాకతాళీయంగా అది మీ కాలు క్రింద పడిందని దాన్ని తీసి తిరిగి అ అమ్మాయికి ఇచ్చావని సర్ది చెప్పాను.. హిమజ కోలుకుంటోంది ..” అంటూ లాజిక్ గా చెబ్తుంటే..

చటుక్కున ఫోన్ కట్ చేసాడు నాగభూషణం.

నాగభూషణం ముఖ కవళికలను అంచనా వేస్తూ.. ఇప్పుడు హిమజకు నిజం చెప్పాలా? వద్దా? అనే సందిగ్ధంలో పడ్డాడు కాశీనాథం.




"ఈ నగరానికి ఏ మయింది ?---స్మోకింగ్ వార్నింగ్ యాడ్ ప్రారంభమయింది సినిమా హాలులో. నీరజ సీటులో ఇబ్బందిగా కదిలింది. సినిమా మొదట్లోనూ, ఇంటర్వెల్ లోనూ ఆ యాడ్ పూర్తయితే కాని సినిమా హాల్లోకి రాడు ఆమె భర్త రాఘవ. వాళ్ళిద్దరికీ పెళ్లయి మూడు సంవత్సరాలు దాటింది. అన్యోన్యమయిన దాంపత్యమే కాని ఒక్క విషయం లో వాళ్ళిద్దరి మధ్యా వాగ్వివాదాలు జరుగుతూ ఉంటాయి. అదే రాఘవ సిగరెట్టు మానడం గురించి. పెళ్లి అయినప్పటినుంచి అతని చేత సిగరెట్ మాన్పించడం లో విఫలమయ్యింది నీరజ. ఆ ఒక్క బలహీనత తప్ప అతను మిగతా అన్ని విషయాలలో చాలా బాగా చూసుకుంటాడు నీరజని. ఆమె సలహాలని అన్నివిషయాలలో పాటిస్తాడు. ఆమె ఇష్టా యిష్టాలన్నిటి కి తగిన గౌరవ మిస్తాడు. నీరజ స్నేహితుల దృష్టి లో అతను చాలా మంచి భర్త.

సినిమా అయినతరువాత ఇంటికి వస్తూ డ్రైవ్ చేస్తున్న రాఘవ తో అంది నీరజ " ఓ ఛాలెంజ్ గా తీసుకుని కాల్చడం మానేయచ్చు కదా" అని.

'ఇంకో ఛాలెంజ్ గురించి నీకు తెలియదు' అని మనసులో అనుకుని రాఘవ జవాబు చెప్పలేదు.

నారాయణ, గణపతి, రాఘవ ముగ్గురూ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం నుంచీ చాలా మంచి స్నేహితులు. ముగ్గురూ తల్లి తండ్రుల డిసిప్లిన్ నుంచి విడివడి మొదటిసారిగా ఇంజనీరింగ్ లో వేరే ఊళ్ళో కలవడం తో కొంత కంట్రోల్ తప్పిన వాతావరణం లో గడపడం జరిగింది. ఆ మొదటిరోజుల్లో బాలూ మహేంద్ర సినిమా "కొంటె కుర్రాళ్ళు" చూసి వచ్చి మొదటిసారిగా సిగరెట్లు కాల్చారు. అలా సరదాగా మొదలెట్టిన సిగరెట్టు గట్టిగానే తగులుకుంది వాళ్ళని. ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం దసరా సెలవల్లో గణపతి పెళ్లి అయింది. నారాయణ, రాఘవ పెళ్లి కి వెళ్లి వెంఠనే వచ్చేశారు. గణపతి దసరా శలవుల తరువాత వచ్చి చేరాడు. పెళ్ళి

అయి వచ్చిన తరువాత వచ్చిన పెద్ద మార్పు ఏమిటంటే, గణపతి సిగరెట్ మానేశాడు. ఏమిటిరా మార్పు అని అడిగితే, వాళ్ళ ఆవిడ, ఏడ్చి మొత్తుకుని ఒట్టేసుకుని మాన్పించేసిందట. ఒట్టు వేశాడు కాబట్టి ఇంక కాల్చనని ఖచ్చితం గా చెప్పేశాడు. నారాయణ ఎక్కువ మాట్లాడలేదు కానీ రాఘవ మటుకు " నేను అలా లొంగను. పెళ్ళికి ముందే చెప్పి కండిషన్ పెడతాను" అన్నాడు కొంచెం గొప్పగా.

వీళ్ళు ఫైనల్ ఇయర్ లో ఉండగా ఓ కంపెని నుంచి 'ఒరాకిల్' సబ్జక్ట్ చెప్పడానికి పార్ట్ టైం లెక్చరర్ రాజారామ్ గారు వచ్చేవారు. ఆయన చాల సరదాగా స్టూడెంట్స్ తో బాగా కల్సి పోయేవారు. ఓ మాటు కేంటీన్ లో వీళ్ళు ముగ్గురిని చూసి వీళ్ళ దగ్గరికి వచ్చి కూర్చున్నారు. నారాయణ, రాఘవ ఆయన దగ్గరకు రాగానే కాలుస్తున్న సిగరెట్లు హడావిడి గా పడేశారు. ఆయన మిగతా విషయాలు అవీ ఇవీ మాట్లాడి సంభాషణ హాబిట్స్ అలవాటు అవడం గురించి వివరం గా మాట్లాడారు.

" కొన్ని కొన్ని అలవాట్లు చాల సులువు గ తగుల్చు కుంటామయ్యా. కానీ అవి వదుల్చుకోవడం చాలా కష్టమవచ్చు. .HABIT అన్న పదాన్ని మీరు నిలువు గా రాశారనుకోండి. H కొట్టేసామానుకో, అంటే కొంత వదుల్చుకున్నామనుకో, A BIT ఇంకా ఉంటుంది. ఇంకొంచెం ప్రయత్నించి A తీసినా BIT ఇంకా ఉంటుంది. ఇంకా కొంచెం ప్రయత్నించినా IT ఈజ్ స్టిల్ దేర్. .

దానికి నేనే ఉదాహరణ. నేను సిగరెట్ మానేసి పది సంవత్సరాలయినా ఇంకా నాకు సిగరెట్ కాలుస్తున్నట్టు కలలొస్తూ ఉంటాయి. ఒక థియరీ ప్రకారం పూర్తి గా సిస్టం నుంచి పోవాలంటే మానేసిన తరువాత కూడా పన్నెండు సంవత్సరాలు పడుతుందట.

" మీరు సిగరెట్లు కాల్చేవారా మాష్టారూ? ఎలా మానేశారు ?" అన్నాడు గణపతి మిగతా వాళ్ల కేసి చూస్తూ.

. పెళ్ళికి ముందునుంచి కాల్చే వాడిని. మా ఆవిడ గోల తో మానడానికి ప్రయత్నించినా కుదర లేదు. కానీ మా అబ్బాయికి కొద్దిగా జ్ఞానం వచ్చి విషయాలు తెలిసే వయసు రాగానే, వాడిని అలాంటి అలవాటు బారిన పడకుండా చేయాలంటే నేను మానేయటం కంటే మార్గం లేదని పించింది. నేను కాలుస్తూ, వాడిని అలవరచు కోవద్దనే అర్హత నా కెక్కడిది? ఆ భావనే నన్ను దానినుంచి బయట పడేసింది. ఇంకో ముఖ్య విషయం.

"కొంతమందికి చాలా కాలం కాల్చినా ఏమీ కాలేదు" అని కొందరు మూర్ఖులు అర్గ్యూ చేయడం నేను చూశాను. వాళ్లకి తెలియనిదేమంటే ప్రతి వ్యక్తి శరీరం టెస్ట్ ట్యూబ్ లాంటిది కాదు. ఏ టెస్ట్ ట్యూబ్ లో పరీక్షించినా రసాయనాలు ఒకే రకమయిన ఫలితాన్నిస్తాయి. కానీ మనుషుల శరీరాలు అలా కాదుకదా? ఒక్కొక్క వ్యక్తి శరీరం ఒక ప్రత్యేకమయిన సిస్టం. అందరి వేలి ముద్రలూ ఒక లా ఉండవు కదా? అందు చేత, నికోటిన్ ఒక్కొక్క శరీరంలో ఒక్కొక్క లా రియాక్ట్ అవవచ్చు. ఒకడికి పదేళ్లకి ఏమీ కాక పోయినా, ఒకడికి ఏడాదిలోనే కేన్సర్ రావచ్చు. ఎవడికి ఎలా రియాక్ట్ అవుతుందో ముందే తెలియదు కదా? తెలిసేటప్పటికీ ఆలస్యమవ వచ్చు. అందు చేత దూరం గా ఉండడం ఉత్తమం. ఇదంతా ఒక ఆప్త మిత్రుడు ఈ మధ్యనే గొంతు కేన్సర్ కి గురయిన సందర్భం లో తెలిసినవి " అంటూ లేచారు రాజారామ్ గారు.

ఆయన వెళ్ళిపోయిన తరువాత. అందరూ నిశ్శబ్దంగా ఉండి పోయారు కొంత సేపు.

ఆ తరువాత నారాయణ సిగరెట్లు మానేసాడు. కానీ రాఘవ మాత్రం కొద్దిగా ప్రయత్నించినా మానలేక పోయాడు. రాజారామ్ గారు చెప్పినవి విన్న తరువాత రాఘవ లో కూడా మానాలి అన్న ఆలోచన వచ్చినా తొందరేముందిలే అని పక్కకి పెట్టాడు. తరువాత ఉద్యోగాల రీత్యా గణపతీ, నారాయణా విదేశాలు వెళ్లడంతో రాఘవ పెళ్ళికి కూడా వాళ్ళు కలవలేదు, అప్పుడప్పుడు మెయిల్ పలకరింపులు తప్ప.

***

రాఘవ బి టెక్ అవగానే కాగ్నిజెంట్ లో చేరాడు. రెండేళ్లు అయినతరువాత తల్లి దండ్రులు చూసిన ఒకటి రెండు సంబంధాలు చూశాడు. తండ్రికి తెలిసిన మిత్రుడు చెబితే నీరజ ని చూశాడు. నీరజ తండ్రికి జాతకాల మీద బాగా నమ్మకం. ఆయన ఒకళ్లిద్దరికి జాతకాలు చూపించుకున్న తరువాత బాగా నప్పేయని చెబితే ముందుకు వెళ్ళ దలచుకున్నారు. నీరజ, రాఘవ కూడా మాట్లాడుకున్నారు. రాఘవ ముందుగానే తన అలవాటు గురించి నీరజ కి చెప్పాడు. సాధారణంగా పెళ్ళికి ముందు ఉండే ఉత్సాహంలో మానడా నికి ప్రయత్నిస్తానని, కొంచెం టైము ఇవ్వమని అడిగాడు. పెళ్లయిన కొత్తలో కొద్దిరోజులు మానేసి, తరువాత రహస్యం గాను కానిచ్చాడు. ఇద్దరూ ఉద్యోగం చేసు కుంటున్నారు కాబట్టి, ఇల్లూ, కారూ వంటివి అన్నీ కొద్దికాలం లోనే ఏర్పరచు కున్నారు

రాఘవలో ఒక్క సిగరెట్ బలహీనత తప్ప మిగతా అన్ని లక్షణాలు చాల గొప్పవి అని గ్రహించడానికి నీరజకి అట్టే సమయం పట్టలేదు. కొంత మంది మగవాళ్ల లాగ స్త్రీల పట్ల అసలు అతనికిచులకన భావం లేదు . అన్నీ అతనిని అడిగి చేయాలని పట్టింపులు గాని పురుష ఆధిక్యత ప్రదర్శించడం కానీ చేయడు. ఇక ఆర్థిక విషయాలలో సహాయం అవసరమయితే స్వ, పర భేదం లేకుండా ఖర్చు చేస్తాడు. రాఘవకి కూడా నీరజ మీద భార్య అని ప్రేమ తో బాటు ఆమె వ్యక్తిత్వాన్ని ఇష్టపడతాడు. పుట్టింటి వాళ్ల ని, అత్తింటి వాళ్ళని తేడా లేకుండా అందరి పట్లా అన్ని బాధ్యతలూ మీద వేసుకోవడం వల్ల, చాలా సందర్భాలలో అతనికి పెద్ద రిలీఫ్ . అందుకే ఉద్యోగం మీద దృష్టి పెట్టి త్వరగానే మంచి ప్రమోషన్స్ సాధించాడు. వాళ్ళిద్దరిదీ చాలా అన్యోన్య దాంపత్యమని, సేహితులలోనూ బంధు వర్గం లోనూ కూడా అభిప్రాయం ఉంది.

అయితే ఈ మధ్య వృత్తి పరం గా వాళ్ళ జీవితం లో జరిగిన ఒక ముఖ్యమయిన మార్పు సమస్య ని జటిలం చేసింది. ఇద్దరూ వేరు వేరు కంపెనీల్లో పని కాబట్టి వారం లో వాళ్ళు కలిసుండేది తక్కువ సమయమే అయ్యేది. రాఘవ పనిచేసే కంపెనీ లో ఓ క్లయింట్ ఒక స్టార్టప్ కంపెనీ పెట్టి రాఘవ కి భార్యకీ ఒక చక్కటి ఆఫర్ చేశాడు. వాళ్ళు ఇంటివద్దనుంచే పని చేసుకోవచ్చు. పబ్లిక్ ఇష్యూ కి వెడితే ఎక్కువ శాతం స్టాక్ అప్షన్ ఇవ్వడానికి ఒప్పందం. కొన్ని కోట్లు కలిసి వచ్చే అవకాశం. ఇద్దరూ బాగా

ఆలోచించుకుని వెంటనే చేరిపోయారు.

అప్పటినుంచి ఇద్దరూ ఇంట్లోనే పనిచేయడం. పక్క పక్కనే కూర్చుని పనిచేసే అవకాశం. కానీ రాఘవ కి ఇది పెద్ద సమస్యే అయ్యింది. అదివరకు అయితే ఆఫీసులో కావలసినప్పుడల్లా సిగరెట్ కాల్చుకోవడం ఇబ్బంది లేదు. ఇప్పుడు పక్కనే నీరజ ఉండడం ఇబ్బందే. ముందు నీరజ అతని ఆరోగ్యం గురించి జాగ్రత్తలు చెబుతున్నా, ఆ తరువాత అతని పని వత్తిడి చూసి ఏమీ అనలేక పోయేది. నీరజ అతని ఆరోగ్యం గురించి ఎంత పట్టించుకునేదో , రాఘవ కూడా ఆమె మీద అంతే ప్రేమ కనపరచే వాడు. ఒకవేళ ఎప్పుడయినా ఆమెకి కొంచెం నలతగా ఉన్నా పనులు చేయనిచ్చేవాడు కాదు. తాను వంట చేయడమో, లేదా హోటల్ కు ఆర్డర్ చేయడమో చేసే వాడు. పని లో పడి వాళ్లకి తెలియకుండానే ఆరు నెలలు గడిచిపోయాయి. పని బాగా జరుగుతోంది కానీ, రాఘవ సిగరెట్లు కాల్చడం మాత్రం తగ్గలేదు. ఆ విషయం లోనే నీరజ కి ఎక్కువ మనస్తాపం గా ఉంది

నీరజ వాళ్ళు చదువుకున్న టెన్త్ క్లాస్ వాళ్ళు అందరూ ఓల్డ్ స్టూడెంట్స్ మీట్ పెట్టడం తో, ఓ మాటు తల్లి నీ తండ్రిని కూడా చూసి వచ్చినట్టవుతుందని రెండు, మూడు రోజులు కాకినాడ వెళ్లి వస్తానంది. ఆమె పని కూడా తాను చూస్తానని వెళ్లి రమ్మన్నాడు. తాను లేదు కదా అని ఎక్కువ సిగరెట్లు కాల్చవద్దని ఒట్టు వేయించుకుని వెళ్ళింది. మొదటి రోజు సతాయింపులు లేకపోవడం బాగేనే ఉంది కానీ, రెండవ రోజు నుంచి ఆమె లేకపోవడం అతనికి మానసికంగా కష్టమే అయ్యింది.

పుట్టింటి నుంచి వస్తూనే తిరిగి అతనితో బాటు ఆఫీసు పని లో పడి పోయింది నీరజ. వచ్చిన రెండవ రోజు నుంచి కొంచెం దగ్గు ప్రారంభమయి, రోజులు గడిచిన కొద్దీ బాగా ఎక్కువ అయింది. మొదట ప్రయాణం లో తేడా చేసిందేమో అనుకున్నాడు రాఘవ. వారమయినా తగ్గక పోవడంతో, డాక్టర్ దగ్గరకు వెళ్ళవచ్చు కదా? అన్నాడు కొంచెం ఆందోళన వ్యక్తం చేస్తూ.

అమ్మా వాళ ఇంట్లో కొంచెం ఊరగాయలు ఎక్కువ లాగించాను. దానివల్లేమో. కాఫ్ సిరప్ వాడుతున్నాను ఫరవాలేదు అంది. ఓ రోజు కొంచెం తగ్గినట్టు అనిపించినా తరువాత మళ్ళీ రావడం మొదలయింది. ఇక లాభం లేదని కాలనీలోనే ఉన్న డాక్టర్ దగారికి వెళ్లి వస్తానని వెళ్లి మందులు తెచ్చుకుంది. ఒక నాలుగురోజులు అయినతరువాత ఈ మాటు చాలా ఎక్కువగా రావడం తో అతను చాలా కంగారు పడ్డాడు. ఓ మాటు బాగా ఎక్కువ వస్తే శ్లేష్మం ఎక్కువ వచ్చినట్టుంది వాష్ బేసిన్ దగ్గరకి వెళ్లి ఊసి వచ్చింది. పని ఆపేసి ఆమెని రెస్ట్ తీసుకోమని తాను పనిలో పడిపోయాడు. కొంత సేపు తరువాత అతను బాత్ రూమ్ వైపు వెడుతూ యాదాలాపం గా వాష్ బేసిన్ లో చూస్తే కొద్దిగా రక్తం మరకలు లాగ కన్పిస్తే కంగారు పడి, వెంటనే నీరజ ఉన్న గదిలోకి వెళ్ళాడు. ఆమె కళ్ళు మూసుకుని పడుకుని ఉంది.

" నువ్వు వెంటనే చెకప్ చేయించుకోవాలి నడు నిమ్స్ కి వెడదాము" అన్నాడు ఆమెని లేవదీస్తూ.

నిమ్స్ అక్కరలేదు కానీ, మొన్న మా ఊళ్ళో జరిగిన "ఓల్డ్ బోయ్స్ మీట్" లో తెలిసింది. మా క్లాస్మేట్ అనిల్ చెస్ట్

కి సంబంధించిన స్పెషలైజేషన్ చేసి మనకి దగ్గరలోనే ఉన్న యశోద లో ఉన్నాడు. నా పర్స్ లో అతని కార్డు ఉంది. ఫోన్ చేసి వివరాలు చెప్పి ఎప్పుడు రమ్మంటాడో కనుక్కోండి వెడదాము. ఎక్కడో నిమ్స్ కి పోయి తెలియని డాక్టర్ ని కలిసే కంటే అనిల్ సలహా తీసుకుందాము" అని మళ్లీ కళ్ళు మూసుకుంది .

వెంటనే రాఘవ అనిల్ కి ఫోన్ చేసి కొంచెం కంగారుగా నీరజ విషయం చెప్పి వెంటనే చెకప్ చేయించాలని,ఎప్పుడు రమ్మంటారని అడిగాడు. అతను రాఘవ ని కంగారు పడవద్దని, సాయంత్రం అయిదింటికి వస్తే ముందు పరీక్షించి, అవసరమయితే డిటైల్డ్ టెస్ట్స్ చేయిద్దామని ధైర్యం చెప్పాడు.

అనుకున్నట్టే సాయంత్రం ఇద్దరూ యశోదాలో అనిల్ ని కలిశారు. మొత్తం హిస్టరీ విన్నతరువాత, . ప్రిస్క్రిప్షన్ పాడ్ మీద మూడు ఐటమ్స్ రాసి ఓ నర్స్ ని పిలిచినీరజని తీసుకు వెళ్లి టెస్ట్స్ చేయించ మన్నాడు. వాళ్లిద్దరూ వెళ్లిన తరువాత రాఘవతో మాట్లాడుతూ నీరజ ఆహారపు అలవాట్లూ, జాబ్ లో ఉన్న వత్తిడి మొదలయిన కొన్ని విషయాలు అడిగిగాడు. అన్నీ నోట్ చేస్కుని రాఘవని వెయిట్ చెయ్యమని లోపలికి వెళ్ళాడు.

ఓ అరగంట తరువాత నీరజ తో వెనక్కివచ్చాడు అనిల్. పెద్దగా వర్రీ అవలసింది లేదని,టెస్ట్స్ రిసల్ట్స్ మరునాడు వస్తాయని, రాఘవని ముందుగా ఫోన్ చేసి రమ్మన్నాడు. సరే అని నీరజ, రాఘవ లేచి అతనికి తాంక్స్ చెప్పి బయలుదేరారు. వాళ్ళు కొద్ది దూరం వెళ్లిన తరువాత అనిల్, రాఘవని వెనక్కి పిలిచి మెల్లిగా అతనికి వినపడేలా మాత్రమే చెప్పాడు." నీరజ అక్కర లేదు మీరు ఒక్కరే రండి " అని.

మరునాడు మధ్యాన్నం రెండుగంటలకి అనిల్ కి రాఘవ ఫోన్ చేసి "సాయంత్రం రమ్మంటారా? అన్నాడు

" లేదు, ఒక టెస్ట్ డిటైల్డ్ టెస్ట్ కోసం వేరే లాబ్ కి పంపించాము. అది రేపు కానీ రాదు. అందు చేత రేపు సాయంత్రం రండి " అని చెప్పి " నీరజ అనవసరం గా కంగారు పడుతుందేమో డి టై ల్డ్ టెస్ట్ గురించి ఆమెకి చెప్పకండి, ఇవాళ నాకు అనుకోకుండా ఆపరేషన్ షెడ్యూల్ అవడం వల్ల రేపు రమ్మన్నానని చెప్పండి " అని పెట్టేశాడు.

మరునాడు యశోదాకి బయలు దేరే దాకా రాఘవ చాలా వర్రీడ్ గా గడిపాడు. సాయంత్రం అవగానే నీరజకి చెప్పి యశోదాకి బయలుదేరాడు. రాఘవ అనిల్ కేబిన్ కి వెళ్ళగానే ఇతన్ని కూర్చోమని అతను లోపలికి వెళ్లి ఏవో రిపోర్ట్స్ తీసుకు వచ్చాడు. అనిల్ కొంచెం గంభీరముగా ఉండడంతో రాఘవకి కొంచెం భయంగానే ఉంది.

రిపోర్ట్స్ లోంచి తలెత్తి అనిల్ అన్నాడు " ఎలిమినేషన్ కోసం అడుగుతున్నాను - నీరజకి స్మోక్ చేయడం అలవాటు ఉందా ?" అన్నాడు

రాఘవ విస్తుపోయి " భలేవారే ఆమె స్మోక్ చేయడం ఏమిటండి?" అన్నాడు కొంచెం ఇబ్బందిగా

" నేను చెప్పాను కదా? ఎలిమినేషన్ కోసం మాత్రమే అడుగుతున్నానని. అయితే మీరు స్మోక్ చేస్తారా.? ఆమె చెయ్యక పోతే, ఆమెకి దగ్గరగా ఎవరయినా స్మోక్ చేసి ఉండాలి లేకపోతే నికోటిన్ ప్రభావం అంతగా ఎఫెక్ట్ చెయ్యదు" అన్నాడు రాఘవ కేసి చూస్తూ

" ముందు రిపోర్ట్స్ రిజల్ట్స్ కొంచెం చెబుతారా?" అన్నాడు రాఘవ సస్పెన్స్ భరించలేక, అనిల్ మాట్లాడేది అర్థం కాక

" కంగారు పడకండి అంత పెద్దగా వర్రీ అవవలసింది లేదు. కానీ ఆమెకి నికోటిన్ ప్రభావం వల్ల ఊపిరితిత్తులలో చిన్న పాచ్ ఏర్పడింది . అది స్మోకింగ్ వల్ల కానీ,లేదా స్మోకింగ్ చేసే వాళ్లకి దగ్గరగా కానీ ఎక్కువ గడిపితే సంభవించవచ్చు. చాలా ప్రారంభ దశలో ఉన్న మాలిగ్నన్సీ. ఈ మధ్య ఒక కొత్త ఇంజక్షన్ వచ్చింది . అది ఒక వారం రోజులు ఇస్తే ఇటువంటి ప్రారంభం లో ఉన్న పాచ్ ని తీసేయవచ్చు. అవును మీరు సెలవు పెట్టి ఇంట్లో ఎక్కువ సేపు ఉంటూ సిగరెట్లు కాలుస్తున్నారా? మీ స్మోకింగ్ హాబిట్ డీటెయిల్స్ కొంచెం వివరిస్తారా ?

రాఘవ వివరంగా అన్నీ చెప్పాడు. అంతకు ముందు ఆఫీసు కు బయటకి వెళ్లడం అక్కడే ఎక్కువ కాల్చడం జరిగేదని, ఆరు నెలల నుంచి ఇంటినుంచి పనిచేస్తూ ఉండడం వల్ల నీరజ పక్కనే కూర్చుని పని చేస్తూ, వర్క్ ప్రెషర్ లో ఎక్కువ కాల్చడం జరుగుతోందని. మానేద్దామనుకుంటూనే అశ్రద్ధ చేశానని గిల్టీ ఫీలవుతూ చెప్పాడు. అయినా నేను కాలిస్తే నాకేమీ కాకుండా ఆమెకి ఎఫెక్ట్ అవడం ఆశ్చర్యం గా ఉందే అన్నాడు అమాయకంగా

" టెస్ట్ ట్యూబుల్లో అయితే ఒకే రియాక్షన్ఉంటుంది. మీ సిస్టం వేరు ఆమె సిస్టం వేరు కదా ! అందుకే బహి రంగ ప్రదేశాల్లోనూ, జనం ఉండే చోటా స్మోకింగ్ బేన్ చేశారు కదా?"

చెంప మీద కొట్టినట్టు రాజారామ్ మాష్టారి మాటలు గుర్తు కొచ్చాయి రాఘవకి " ప్రతి వ్యక్తి శరీరం టెస్ట్ ట్యూబ్ లాటిది కాదు కదా>"

అనిల్ రాఘవకి ధైర్యం చెప్పాడు. "మనం వెంఠనే ఇంజక్షన్స్ స్టార్ట్ చేస్తే ప్రోబ్లం ఏమీ ఉండదు. మీరు త్వరగా ఇక్కడికి తీసుకు రావడం మంచిది అయ్యింది" మరునాడు ఎప్పుడు రావాలో అన్నీ వివరంగా చెప్పి పంపించాడు. నీరజ కి ఎక్కువ వివరాలు చెప్పకుండా, ఇన్ఫెక్షన్స్ క్లియర్ చేయడానికి ఇంజక్షన్స్ తీసుకోవాలని చెప్పమన్నాడు.

రాఘవ ఇంటికి వస్తూనే ఉన్న సిగారెట్ ప్యాకెట్లు బయట పడేసి, నీరజకి, అనిల్ చెప్పమన్నట్టు చెప్పాడు.

ఆశ్చర్యంగా ఆరోజంతా అతనికి సిగరెట్లు కాల్చక పోయినా, నీరజ ఆరోగ్యం గురించిన ఆలోచనలతో పెద్ద తేడా తెలియలేదు.

అనిల్ సారధ్యంలో వారం రోజులూ ఇంజక్షన్స్ కోర్సు ఇవ్వడం జరిగి, నీరజ కొద్ది రోజులలోనే మామూలు మనిషి అయి పనిలో పడింది. రాఘవకూడా సిగరెట్ల నుంచి బయట పడ్డాడు. సిగరెట్ ఆలోచన వచ్చినప్పుడల్లా, నీరజ ఆరోగ్యం గురించి అనిల్ చెప్పినప్పుడు ఎంత టెన్షన్ పడ్డాడో గుర్తుకు వచ్చి ఆ ఆలోచనల నుంచి త్వరగానే బయట పడ్డాడు.

ఓ వారం రోజుల తరువాత నీరజ బయటికి వచ్చినప్పుడు అనిల్ కి ఫోన్ చేసింది " మన ప్లాన్ సక్సస్. ఆయన సిగరెట్లు పూర్తిగా మానేశారు. మనం ఓల్డ్ స్టూడెంట్స్ మీట్ లో కలవడం మంచిది అయ్యింది. చాలా థాంక్స్ మంచి సలహా కి, దాన్ని అమలు చేయడానికి " అంది నవ్వుతూ.

" నువ్వు ఓ ముఖ్య విషయం మరిచిపోకు, దీనివల్ల రాఘవకి నీ మీద ఎంత ప్రేమ ఉందో కూడా ప్రకటితమయింది కదా ?" నవ్వుతూ అన్నాడు అనిల్. మళ్ళీ వెంఠనే " ఎంతయినా బార్యా భర్తలు కాబట్టి పూర్తి గా బయట పడ్డాడని నమ్మకం కలిగిన తరువాత అన్నీ చెప్పెయ్యి." అన్నాడు సలహా యిస్తూ.

"ఎప్పుడు చెప్పాలో నిర్ణయ మయిపోయింది. ఒక ఇన్సూరెన్సు తీసుకున్న తరువాత చెప్పాలి. దానిగురించి నీకు తరువాత చెబుతాను" అని మరోమారు థాంక్స్ చెప్పి ఫోన్ కట్ చేసింది.

*****

కథ ఇక్కడిలో ముగించేయవచ్చు. కానీ కొసమెరుపుకు కొద్దిగా వివరణ ఇస్తే బాగుంటుందేమో -

రాఘవ అంతకు ముందు పిల్లల గురించి ఎత్తినప్పుడు నీరజ ఖచ్చితం గా చెప్పేది. అతను సిగరెట్లు మానిన తరువాతే పిల్లల మాటఎత్త మని.

అతను సిగరెట్లు మానేసిన ఆరు నెలల తరువాత ప్రెగ్నన్సీ టెస్ట్ కన్ఫర్మేషన్ అయిన తరువాత చెప్పింది వివరాలన్నీ. కాకినాడ లో ఓల్డ్ స్టూడెంట్స్ మీట్ లో కలిసినప్పుడు అనిల్ డాక్టర్ గా యశోద లో పని చేస్తున్నాడని తెలియడం , మిగతా విషయాలు మాట్లాడుతూ , రాఘవ సిగరెట్లు మానలేక పోవడం వర్రీ గా ఉందనిఅతని తో అనడం, అతను మిగతా విషయాలన్నీ విన్న తరువాత 'ప్లాన్' చెప్పడం జరిగిందని.

" అమ్మ దొంగా" పుట్టబోయే బిడ్డని ఇన్సూరెన్స్ గా పెట్టుకున్నావా? చెప్పడానికి ! మరి ఆ రక్తం? ఇంజక్షన్లు?" రాఘవ అడిగాడు వివరాల కోసం

"అవా మనతెలుగు సినిమాలు ధర్మమా అని -టమాటో సాస్ వాడడం జరిగింది. ఇక ఇంజక్షన్లా ? నిన్ను బయట కూర్చోపెట్టి మేము కాఫీ తాగే వాళ్ళం"